

అమృత్‌సర్ : పంజాబ్‌లో కేంద్ర బడ్జెట్‌పై శుక్రవారం మహిళా కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 62 • సంచిక: 24 • శనివారం 3 ఫిబ్రవరి 2018 • విజయవాడ * పేజీలు: 14 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ తదియ మ. 2.21 వరకు, అనంతరం చవితి; నక్షత్రం: పుబ్బ మ. 2.21 వరకు, అనంతరం ఉత్తర; అమృతకాలం: ఉ. 9.00 నుండి 10.35 వరకు; వర్జ్యం: రా. 10.13 నుండి 11.47 ; దుర్ముహూర్తం: ఉ. 6.00 నుండి 7.36 వరకు; రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు;

• మోడీ బడ్జెట్ దెబ్బ...

మార్కెట్లకు ఫ్రైడే!



• ఒక్క రోజులో రూ.5 లక్షల కోట్ల ప్రజల సంపద ఆవిరి
• దారుణంగా దెబ్బతిన్న సెంటిమెంట్
• సెన్సెక్స్ 840 పాయింట్ల పతనం
• ఐటీ తప్ప అన్ని షేర్లూ కుదేలు
• బడ్జెట్‌పై ఇది సెన్సెక్స్ అవిశ్వాస తీర్మానం: రాహుల్ ట్వీట్

7 లో



శుక్రవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం

వేచి చూద్దాం... తప్పకపోతే

పోరు సాగిద్దాం!

రాష్ట్ర ప్రయోజనాలే మనకు ముఖ్యం

• నేరుగా కంటే వ్యూహాత్మకం బెటర్
• తెగదెంపులు కరెక్ట్ కాదు
• ఎంపీలతో మాట్లాడి నిర్ణయిద్దాం
• ప్రజల మనసులు గాయపడ్డాయి
• వైకాపాది ద్వంద్వ వైఖరి
• సమన్వయ భేటీలో చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, అయితే కేంద్రంతో సంబంధాల విషయంలో ఆచితూచి అడుగేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుని చ్చారు. మంత్రులు, సీనియర్ నేతలతో పాటు పార్లమెంట్ సభ్యుల అభిప్రా యాలను కూడా తీసుకున్న అనంతరం ఒక స్పష్టతకు రావల్సిన అవసరం ఉందని అన్నారు. శుక్రవారం ఉండవల్లిలోని గ్రీవెన్స్ సెల్‌లో జరిగిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొ న్నారు. బడ్జెట్ అనంతర పరిణామాలను సమీక్షించారు. పార్టీ నేతలతో కేంద్రం వైఖరిపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ బడ్జెట్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ విన్నపాలను పక్కను పెట్టడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితిని తాను ఊహించలేదని పేర్కొ న్నట్లు సమా చారం. తెలుగుదేశం పార్టీని దెబ్బతియడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగిందని అన్నారు. రాష్ట్రాన్ని విభజించడంలో రెండు జాతీయ పార్టీల పాత్ర ఉందని చెప్పారు. అయితే విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భారతీయ జనతా పార్టీతో జత కలిశామని, మిత్ర పక్షంగా పరిగణిస్తున్నామని గుర్తు చేశారు. ఈ పరి స్థితుల్లోనూ కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను విస్మ రిస్తే ఎలా అని ప్రశ్నించారు. గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం ప్రాధాన్యత

⇨ 7వ పేజీలో...

కేంద్రం ఎంతిచ్చింది?

ఇంకెంత రావాలి?!

• శాఖలవారీ నివేదికలివ్వండి
• అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
• ఆరోగ్యరంగానికి ప్రపంచబ్యాంకు రుణం
• కంటెంట్, డ్రోన్ కార్పొరేషన్ల ఏర్పాటు
• ఆరు ఆర్థిక నగరాల నిర్మాణానికి ఓకే
• పలు భూ కేటాయింపులకూ సమ్మతం
• రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాలు

అమరావతి, ఆంధ్రప్రభ : శాఖల వారీగా కేంద్రం నుంచి రావల్సిన నిధులకు సంబంధించి తక్షణమే వివరాలు అందించాల్సిందిగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదిక రూపంలో సమర్పిం చాలంటూ నిర్దేశించారు. కేంద్రం బడ్జెట్‌ను సమర్పించిన నేపథ్యంలో శుక్ర వారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రం ప్రతిపాదించిన ప్రతిపాదనలు, నిధుల కేటాయింపు రాష్ట్రానికి అందాల్సిన బకాయిలు పెండింగ్ అంశాలకు సంబంధించి అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. నిధుల కేటా యింపు విషయంలో కేంద్రంతో నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని పేర్కొ న్న సీఎం శాఖల వారీగా నిధులకు సంబంధించి

⇨ 2వ పేజీలో...



విద్యుత్ సంస్థల వీర బాదుడు

యూనిట్ రూ.12లా?!

• ప్రభుత్వ మెప్పుకోసం ఆరాటం
• గత ఐదేళ్ల లెక్కలతో పీడింపు
• వారంలోగా కట్టాలని డిమాండ్
• సమయం మించితే రూ.10 ల వడ్డీతో వసూళ్లు
• కోర్టులకు వెళ్లండంటూ ఉచిత సలహాలు
• సీఎం దృష్టి పెట్టాలని నిపుణుల సూచనలు



(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ పరిస్థితిపై ప్రభుత్వం ఆనందం వ్యక్తం చేస్తోంది. విభజనానంతరం విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించగలిగింది. ముఖ్యంగా సౌరవిద్యుత్‌ను ఐదు మెగావాట్ల ఉత్పత్తికి పెంచింది. దీంతో పేదలకు యూనిట్‌కు రెండ్రూపాయల లోపుధరపైనే సరఫరా చేస్తున్నామంటూ సంతోషిస్తోంది. కానీ వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. సమాచార లోపం కావొచ్చు. లేదా మంత్రి, ముఖ్య మంత్రిలకు అధికారులు సరైన వివరణలివ్వడంలేదన్న అనుమానాలు ఉన్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వం కూడా గతంలో విద్యుత్ సంస్థలు నిలదొక్కుకోవడానికి పెద్దెత్తున ఆర్థిక సాయాన్నందించాయి. కాగా ఇప్పు డు ఈ సంస్థలు స్వయం సమృద్ధితో వనరులు సమీకరించుకుని ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలందిస్తున్నాయన్న సంతృప్తి ప్రభుత్వంలో వ్యక్త మౌతోంది. ఓ వైపు ప్రభుత్వతీరు పట్ల సంతృప్తి శాతం ప్రస్తుతమున్న 60ని 80కి పెంచాలని ప్రభుత్వం అనేక రకాల ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. కానీ విద్యుత్ శాఖ ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రభు త్వానికి ధరల వసూలుపై ఖచ్చితమైన సమాచారమివ్వడంలేదు. మంత్రికి కూడా దీనిపై వాస్తవ వివరాలు అందుబాటులో ఉన్నట్లు లేదు. సమృద్ధిగా విద్యుత్ ఉత్పత్తితో పాటు అతితక్కువ ధరలకే వినియోగదార్లకు సరఫరా అవుతోందన్న విశ్వాసానికి ప్రభుత్వం లోబడుంది. మేథావులు కూడా దీన్నే విశ్వసిస్తున్నారు. వాస్తవానికి 50యూనిట్ల లోపు వినియోగదార్లకు మాత్రమే యూనిట్ రెండ్రూపాయలకు ట్రాన్స్‌కో సరఫరా చేస్తోంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఒకగదిలో జీవించే కుటుంబాలు కూడా ఇప్పుడు 50కిపైగా యూనిట్ల విద్యుత్‌ను వినియోగించక తప్పడంలేదు, కాగా గృహ వినియోగానికి యూనిట్‌కు 9.50రూపాయల వరకు ధరలు వసూలు చేస్తున్నారు. పరిశ్రమలకు 7నుంచి 8, వ్యాపార సంస్థలకు 12.50రూపాయల వరకు వసూలు

⇨ 3వ పేజీలో...



ఇ-వేకు బ్రేక్!

• పటిష్ఠ వ్యవస్థ వచ్చాకే అమలు
• జీఎస్టీఎన్‌ను పూర్తి వివరాలు కోరిన ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ: ఒకే వే బిల్లు ద్వారా దేశవ్యాప్తంగా సరకు రవాణా జరగాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా అమలు చేసిన ఇ-వే బిల్లు వ్యవస్థకు ఆదిలోనే హంసపాదం పడింది. సర్వర్ల మొరాయింపుతో బిల్లు చెల్లింపులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వాహన దారులకు చుక్కలు కనిపించడంతో కేంద్రం పునరా లోచనలో పడింది. వెంటనే ఇ-వే బిల్లుల చెల్లింపులను నిలిపివేసి పటిష్ఠమైన వ్యవస్థ అందుబాటులోకి వచ్చే వరకు చెల్లింపులకు పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిం చాలని కేంద్ర ఆర్థిక శాఖ

⇨ 7వ పేజీలో...

విద్యుత్ ఉద్యోగులకు

ఊరట!

• హైకోర్టు తీర్పుతో వివాదానికి తెర
• ప్రత్యేక కమిటీ ఏర్పాటు
• విభజనకు 4 నెలల గడువు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రాల పునర్విభజన చట్టం మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా విభజన సమస్యలు చిక్కుము డులు మాత్రం ఇంకా వీడటం లేదు. చివరకు న్యాయ స్థానాలు జోక్యం చేసుకుంటే తప్ప వీటికి పరిష్కారం లభించటంలేదు. తాజాగా విద్యుత్ సంస్థల్లోని ఉద్యో గుల విభజన అంశంలో కూడా ఇదే జరిగింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఏపీ స్థానికత ఉద్యో గుల అంశంలో శుక్రవారం నాడు హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి ఎదురుదెబ్బగా మారింది. ఏపీ స్థానికత అంశంపై గత మూడేళ్లుగా పోరాడుతున్న విద్యుత్ ఉద్యోగులకు మాత్రం పెద్ద ఊరటనిచ్చింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఏపీ స్థానికత ఉన్న 1200మంది ఉద్యోగులను గుర్తించిన తెలంగాణ ప్రభు త్వం వీరిని విధుల నుంచి రిలీవ్ చేసింది.ఈ అంశంపై సామరస్యంగా పరిష్కారం కోసం ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కూడా మంత్ర వర్గ ఉప సంఘాలు వేసి పలు మార్లు సమావేశాలు చర్చలు జరి పాయి. గత మూడేళ్లుగా ఈ అంశం కొలిక్కి రాకుండా కొనసాగుతూనే వస్తోంది. ఈ నేపథ్యంలో సమస్య పరి ష్కారం అయ్యేదాక ఏపీ స్థానికత ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం 58శాతం, తెలంగాణ ప్రభుత్వం 42శాతం జీతాలు చెల్లించాలని గతంలో కోర్టు మధ్యంతర ఉత్త ర్వులు కూడా ఇచ్చింది. ఇక అప్పటి నుంచి ఏపి స్థానికత ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం 58శాతం జీతాలు చెల్లి స్తూనే వస్తోంది. ఈ నేపథ్యంలో

⇨ 7వ పేజీలో...

ఔరా..!



ఆర్థిక నగరం- సమస్యల హోరం

జక్కంపూడి చిక్కుముడి

• స్థల సేకరణ అసలు సమస్య
• ఆర్థిక నగరం ఏర్పాటులో ఇబ్బంది
• నాలుగోవంతు స్థలమే అందుబాటులో..
• కంపెనీలు సిద్ధంగా ఉన్నా దక్కని ప్రయోజనం
• సమస్యను అధిగమిస్తేనే ఉపాధి అవకాశాలు



ప్రతీకాత్మక చిత్రం

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: రాష్ట్రంలో ఇన్‌ఫ్రా రంగం విచిత్ర పరిస్థితులను ఎదుర్కొంటోంది. ముఖ్యమంత్రి చంద్ర బాబు చిరకాల స్వప్నంగా ఉన్న ఆర్థిక నగరాల ఏర్పాటుకు స్థల సేకరణ సమస్య చిక్కులు తెచ్చి పెడుతోంది. రాష్ట్రంలో దాదాపు 2 లక్షల ఉద్యోగాలను తెచ్చిపెట్టే ఈ ఆర్థిక నగరాలు స్థల సమస్య నుండి గట్టేందుకు ముఖ్యమంత్రి చొరవ చూపాలని పారిశ్రామిక వేత్తలు కోరుతున్నారు. జక్కంపూడిలో ఏర్పాటు చేయదలచిన ఆర్థికనగరానికి 28 లక్షల చదరపు అడుగుల స్థలం అవసరంకాగా, కేవలం 6.40 లక్షల చదరపు అడుగుల

⇨ 3వ పేజీలో...

సీడ్ దొరక్క డీలా!

ఆక్వా సాగు ఎలా?

• సిండికేట్‌గా మారిన హేచరీలు
• భారీగా పెరిగిన ధర
• సాగుకు ఎదురుచూస్తున్న లక్షల ఎకరాలు
• మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ శూన్యం
• ఆందోళన చెందుతున్న రైతాంగం

7 లో

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చే నివేదికల ఆధారంగా కేంద్రం వద్ద మరోసారి ప్రస్తావించడం జరుగుతుం దనే సంకేతాల్ని ఇచ్చారు. మెట్రో రైలుతోపాటు అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, ఎయిర్ పోర్టులకు సంబంధించి ముఖ్యమంత్రి రెవెన్యూ పరిశ్రమలు మున్సిపల్ తదితర శాఖలను తక్షణ నివేదికల కోసం ఆదేశించినట్లు సమాచారం. బడ్జెట్‌లో మెట్రో రైలు ప్రతిపాదన లేకపోవడంపై స్పందిస్తూ అమరావతి రాజధాని నగరం ఒకవైపు గ్రామం కాదని, మరోవైపు పట్టణం కూడా కాదని భావించారేమో నని అన్నారు. అందువల్లే ఈ ప్రతిపా దనను పరిగణనలోకి తీసుకోలేదేమో అని అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావు స్పందిస్తూ అలాంటప్పుడు మెట్రో రైలును విశాఖపట్నం నగరానికి ఇవ్వవొచ్చు కదా అని ప్రతిపాదించారు. కాగా మంత్రివర్గ సమావేశాన్ని కేవలం శాఖల వారీ నివేదికలకే పరిమితం చేసిన ముఖ్యమంత్రి సాయంత్రం 6 గంటల వరకే మంత్రులతో వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం అధికారులతో కూడా ప్రత్యేకంగా శాఖపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి దావోస్ పర్యటనతో పాటు అమెరికాలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జరుపుతున్న పర్యటనపై కూడా ప్రస్తావించారు. కాగా పోలవరం ప్రాజెక్టు విషయమై ప్రస్తావిస్తూ కేంద్ర సహకారం, విభజన చట్టం మేరకు ఇప్పటికీ ఉంటుందని భావిస్తున్నామని అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విభజన చట్టానికి పోలికే లేదని రీతిలో ఆయన కేబినెట్ సమావేశంలో స్పందించినట్లు సమాచారం.

కేంద్రం ఎంతిచ్చింది?
ఇంకెంత రావాలి?!



మంత్రివర్గం నిర్ణయాలివే...

ప్రపంచ బ్యాంకు సహకారంతో ఆరోగ్య రంగాన్ని పటిష్టపర్చాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. అదే విధంగా విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానం, విద్యా, సాంఘిక సంస్కరణలు, ఆర్థిక శాస్త్రం, రాజకీయాలు మొదలైన వాటికి సంబంధించి ఏపీ కంటెట్ కార్పొరేషన్, ప్రభుత్వ అవసరాలు, ప్రైవేట్ వినియోగానికి ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడానికి కేబినెట్ ఆమోదించింది. అలాగే రాష్ట్రంలో ఆరు ఆర్థిక నగరాల నిర్మాణానికి చంద్రబాబు అనుమతినిచ్చారు. వివిధ అంశాలపై చర్చించి ప్రాధాన్యతా ప్రతిపాదికన పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం సమావేశ వివరాలను రాష్ట్ర సమాచార శాఖ, పౌరసంబంధాలు, మంత్రి కాల్వ శ్రీనివాసులు మీడియా ప్రతినిధులకు వివరించారు. గుంటూరు జనరల్

రాష్ట్రంలో నూతనంగా
కంటెంట్, డ్రోన్స్ కార్పొరేషన్లు

● ఆరోగ్య రంగానికి ప్రపంచ బ్యాంకు రుణం ● ఎంపీల ట్రస్టుకు నిధులు ● కేబినెట్ వివరాలు వెల్లడించిన మంత్రి కాల్వ

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో నూతనంగా రెండు కార్పొరేషన్ల ఏర్పాటు చేసేందుకు శుక్రవారం జరిగిన మంత్రి మండలి సమావేశం ఆమోదం తెలిపినట్లు మంత్రి కాల్వ శ్రీనివాసులు వెల్లడించారు. క్యాబినెట్ సమావేశ అనంతరం సచివాలయంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నూతనంగా రాష్ట్రంలో ఏపీ కంటెంట్ కార్పొరేషన్, డ్రోన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచ బ్యాంక్ సహకారంతో రాష్ట్ర ఆరోగ్య రంగాన్ని పటిష్ట పరచాలనే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలో వైద్య మౌలిక వసతుల కల్పనకు 4,807 కోట్లు అవసరం కాగా, అందులో 70 శాతం 3,365 కోట్లు ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో 597 పడకలతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టనున్న 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఏపీటిట్కో నిధులు సమకూర్చుకునేందుకు బ్యాంకులకు ప్రభుత్వం హామీగా ఉంటుందన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి అవసరాలు, కార్యక్రమాలు ప్రాజెక్ట్‌ల రూపకల్పన ట్రస్టుకు రూ.1.2 కోట్లు విడుదల చేసేందుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. టాటా ట్రస్టు ద్వారా బాలామృతం పౌష్టికాహారం తయారుచేసి మహిళలకు, చిన్నారులకు పంపిణీపై నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే ఆలయ పోస్టులు, పోలవరం హెడ్‌వర్క్స్, గోరకల్లు ప్రాజెక్ట్‌పనులు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు.



ఆసుపత్రిలో రూ. 65 కోట్లతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటుతో పాటు ప్రపంచ బ్యాంకు రుణంతో రూ. 3,365 రుణంగా తీసుకునేందుకు మంత్రి వర్గం ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి నిధుల సమీకరణకు సంబంధించి బ్యాంకులకు హామీగా ఉండాలని, రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల కోసం ఏర్పాటైన మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ అలైయన్స్ ఫర్ కలెక్టివ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ట్రస్టుకు రూ. 1.20 కోట్లను విడుదల చేయాలని, టాటా ట్రస్టు ద్వారా బాలా మృతం అమలు చేయాలని తీర్మానించింది. టీటీడీ పరిధిలోని అల్లూరుగుంట ఆలయానికి 8 పోస్టుల మంజూరు, ఆంధ్రప్రదేశ్ పోలీసు ఆర్డినెన్స్-2017 స్థానంలో బిల్లు ప్రవేశపెట్టడం, పోలవరం హెడ్ వర్క్స్ కోసం ముందస్తు నిధులను పెంచడం, గోరకల్లు ప్రాజెక్టుకు రూ. 4.78 కోట్లను చెల్లించడానికి మంత్రి మండలి ఆమోదించింది. శ్రీకాకుళం జిల్లా కాజ దేవుని పాలవలసలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 13.58 ఎకరాలకేటాయింపు, విశాఖపట్నం జిల్లాలోని 5 గ్రామాల పరిధిలోని 90.72 ఎకరాలను సెజ్ విస్తరణకు, తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో 3.43 ఎకరాల్లో పరిశ్రామికయూనిట్ల ఏర్పాటుకు, చిత్తూరు జిల్లా నాగమంగళంలో 7.44 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ పార్కుకు, చిత్తూరు జిల్లా మొలకలదిన్నెలో 24.13 ఎకరాలను ఏపిఐఐసి పార్కుకు, చిత్తూరు జిల్లాలో కోటవూరు గ్రామంలో 3.74 ఎకరాలను హార్సిలిహిల్స్‌లో హై అల్టిట్యూడ్ క్రీడా శిక్షణా కేంద్రం ఏర్పాటుకు అప్పగించేందుకు రాష్ట్ర మంత్రి మండలి తీర్మానించింది. అనంతపురం జిల్లా కుదేరు గ్రామంలో ఏపిఐఐసికి 16.05 సెంట్ల భూమిని వెనక్కి తీసుకొని ఎన్ ఆర్‌ఈడీ క్యాప్‌కు అప్పగించడం, కృష్ణాజిల్లా కొండపావులూరి గ్రామంలో 25 ఎకరాల్లో సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యాచురోపతి స్థాపనకు అప్పగించేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలపడం జరిగింది. కాగా రూ. 38, 265 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో కీలకమైన పట్టణ గృహనిర్మాణ పథకంలో భాగంగా ఉద్దేశించిన ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ. 13,035 కోట్లను, కేంద్రం రూ. 7,500 కోట్ల మొత్తాన్ని భరించడం జరుగుతుంది. మిగిలిన మొత్తాన్ని లబ్దిదారుడు సమకూర్చుకోవాల్సివుందని మంత్రి వర్గం పేర్కొంది. త్వరలో నెల కొల్పే గుంటూరు మెడికల్ కాలేజ్ అలుమ్ని నార్త్ అమెరికాకు ప్రభుత్వ సహకారాన్ని అందించాలని, ఇందులో జింఖానా వాటా రూ. 30 కోట్లుగా పేర్కొంటూ, జి ప్లస్ 5 పద్దతిలో భవనాన్ని నిర్మించాలని, ప్రసూతి కోసం 300 పడకలు, చిన్నారుల కోసం 200, పి ఏసియూ కోసం 27, ఎస్ ఐసీయు కోసం 30, ఎన్ఐసియు కోసం 40 పడకలు చొప్పున ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదించింది. 30 ఫ్యాకల్టీ రూములు, 300 మందికి కాన్ఫరెన్స్ హాలు, 2, 34,420 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసుపత్రి నిర్మించేందుకు ఆమోదం తెలిపింది. పోలీస్, మైనింగ్, మున్సిపల్ పరిపాలన, డిజాస్టార్ మేనేజ్‌మెంట్, వ్యవసాయ, జల వనరుల, అర్బన్ డెవలప్‌మెంట్, సర్వేలు, టూరిజం, ఎస్సెంట్ మానిటరింగ్‌వంటి సేవలను విస్తృతపర్చాలని టూడి, త్రిడి మోడల్స్‌లో హై రిజల్యూషన్ వీడియోలు తీసేందుకు చర్యలు తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బాపట్ల ఎంపీ మాల్యాద్రి శ్రీరామ్ చేసిన అభ్యర్ధనను క్యాబినెట్ ఆమోదిస్తూ ఎంపీల ట్రస్టుకు సంబంధించిన పనుల విషయంలో పురగోతిని ఎప్పటికప్పుడు ప్రణాళికకు అందించాలనే నిబంధనను క్యాబినెట్ విధించింది. పౌష్టికాహారం తయారు చేసే కార్మాగారం కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయడానికి మంత్రి వర్గం సమావేశం ఆమోదించింది.

దేశంలో 63% క్యాటరాక్ట్ లోపం

● వైద్య సౌకర్యాలు పెంపొందించాలి: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ: దేశంలో 63 శాతానికి పైగా క్యాటరాక్ట్ లోపంతో ప్రజలకు జబ్బులు వస్తున్నాయని, ఆప్తమాలజి డాక్టర్ల కొరత ఉందని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. దేశంలో వైద్య సౌకర్యలు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కువ మంది వైద్యులు వచ్చినప్పుడే వైద్యం అందుబాటు లోకి వస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. పవిత్రమైన వైద్యాన్ని లాభార్జనతో కాకుండా సేవా దృక్పథంతో అందిస్తే పేరు ప్రఖ్యాతులతో పాటు జీవితానికి సార్థకత వస్తుందని ఆయన సూచించారు. శుక్రవారం విజయవాడలో శంకర నేత్ర చికిత్సాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో కంటి పరీక్షలు, చికిత్సలు చేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు. శంకర నేత్ర చికిత్సా లయం ప్రజలకు సేవలు అందించే పెద్ద శిబిరంగా ఎదిగి ప్రజలకు మెరుగైన కంటి వైద్యం అందించాలని ఆయన ఆకాంక్షించారు. వైద్యుల కొరతను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2017-18 సంవత్స రంలో 24 వైద్య కాలేజీలు ఏర్పాటు చేస్తామ న్నారు. ఉత్తర భారతదేశం, ఈశాన్య రాష్ట్రా లతో పోల్చుకుంటే దక్షిణ భారతదేశంలో ప్రైవేటు రంగంలో ఎక్కు వ ఆసుపత్రులు ఉన్నా యని తెలిపారు. పారామెడికల్ రంగాన్ని ప్రోత్సహించా ల్సిన అవసరం ఉందని వెంకయ్య అన్నారు. ప్రైవేటు రంగంలో ఎంతో మంది నిష్ణాతులు ఉన్నారని వారిని తగిన విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యం కోసం మన రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు ఇంకా వెళ్లుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌వి ప్రసాద్, అరబిందో, శంకర్స్ నేత్రాలయ వంటి ప్రసిద్ధ సంస్థలు ఉన్నాయని కొనియాడారు. నేత్ర చికిత్సలు జిల్లా, డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్యపరికరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతికి ఆయన చిత్రపటాన్ని ఆసుపత్రి మేనేజ్‌మెంట్ జ్ఞాపికగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కామి నేని శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్, జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, వైద్యబృందం నాదెండ్ల విష్ణు వర్దన్, స్వాతి ఉన్నారు.

ఉపరాష్ట్రపతి నేటి పర్యటన వివరాలు...

ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యా నాయుడు ఈ రోజు గుంటూరు జిల్లా పెదనందిపాడులోని పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఉదయం 9.30 గంటలకు జరిగే గోల్డెన్ జూబ్లీ వేడకలలో పాల్గొంటారు. అనంతరం 11 గంటలకు ఆగతవరపాడులోని ఒమేగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 150 ఆంకాలజీ విభాగాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుండి బయలుదేరి గుంటూరులోని నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీలో మధ్యాహ్నం 12 గంటలకు జరిగే గోల్డెన్ జూబ్లీ వేడకలలో పాల్గొని తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు చేరుకుంటారు.

కార్పొరేషన్ చైర్మన్లపై కసరత్తు కొలిక్కి

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఖాళీగా వున్న ఏడు కార్పొరేషన్లకు పాలకవర్గాల నియామకానికి సంబంధించి ముఖ్యమంత్రి కసరత్తు దాదాపు పూర్తయినట్టుసమాచారం. ఇటీవలే గడువు పూర్తయిన ఆరు కార్పొరేషన్లలో నాలుగు కార్పొరేషన్ల విషయంలో ఏకాభిప్రాయం రాగా, రెండు కార్పొరేషన్ల చైర్మన్లను మార్చే యోచనలో ముఖ్యమంత్రి వున్నారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి ఇప్పటికే మంత్రులతో చర్చలు పూర్తి చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయ నాయకులతోనూ చర్చించిన ముఖ్యమంత్రి మరోరెండు, మూడు రోజులలో అధికారికంగా ప్రకటించే దిశగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాపు కార్పొరేషన్‌తో పాటు రాష్ట్ర బి.సి ఆర్థిక సహకార సంస్థ చైర్మన్లుగా పాతవారిని కొనసాగించకుండా కొత్తవారికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. కాపు మంత్రులు, కొందరు సీనియర్ కాపు నేతల అభిప్రాయాన్ని సేకరించారు. ఇంతవరకు కొనసాగిన చైర్మన్‌తో పాటు ఇతర నాయకుల పేర్లను పరిశీలించారు. మరో రెండు రోజుల్లో సస్పెన్స్‌కు తెరదించే దిశగా కసరత్తు కొనసాగుతోంది. ఎస్.సి కార్పొరేషన్‌కు చైర్మన్‌గా మళ్ళీ జూపూడి ప్రభాకర్‌రావునే కొనసాగించాలనే విషయంలో ఏకాభిప్రాయం వచ్చింది. ఇప్పటికే ఎస్ సి కార్పొరేషన్ విషయంలో దాదాపు తుది నిర్ణయం తీసుకోగా, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా మళ్ళీ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్యకే అవకాశం ఇవ్వనున్నారు. రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ చైర్ పర్సన్‌గా పంచుమర్తి అనూరాధ, పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా పొద్దుటూరుకు చెందిన మల్లెల లింగారెడ్డిలను కొనసాగించాలనే నిర్ణయానికి ముఖ్యమంత్రి వచ్చినట్టు తెలిసింది. బిసి ఆర్థిక సహకార సంస్థ విషయంలో ముఖ్యమంత్రి పునరాలోచనలో వున్నట్టు తెలుస్తోంది.

ఏపీఐడీసీ చైర్మన్‌గా రాజశేఖర్ రెడ్డి?

ఇదిలా వుండగా ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పొద్దుటూరుకు చెందిన చెమికెల రాజశేఖర్ రెడ్డిని నియమించాలని సీఎం దాదాపు నిర్ణయించినట్టు సమాచారం. ఇప్పటికే ఏపీ ఐడిసిరాష్ట్ర డైరెక్టర్‌గా వున్న ఆయన గత రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం అనేక వ్యయప్రయాసలకోర్చి శ్రమిస్తున్నారని, పైగా రాజశేఖర్ రెడ్డి నియామకం పట్ల జిల్లా ఇంచార్జి మంత్రితో పాటు మరో జిల్లా మంత్రి సానుకూలంగా వుండటం ప్లస్‌పాయింట్‌గా మారింది. ఏపీ ఐడిసిలో మొత్తం నలుగురు డైరెక్టర్లు వున్నారు. టీడీపీ ప్రతిపక్షంలో వున్నప్పుడు కూడా పార్టీని మారకుండా డాక్టర్ వైఎస్‌ని ఎదుర్కోవడం, పులివెందులలో పార్టీ అభ్యర్థిని రంగంలోకి దింపడంలో క్రియాశీలక పాత్ర పోషించడంతోపాటు కడప జిల్లాలో ఏకైక ఎమ్మెల్యేగా మల్లెల లింగారెడ్డిని గెలిపించు కోవడం, విపక్షంగా పార్టీ వాణిని బలంగా వినిపించడం వంటిపలు అంశాలను సీఎం పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయి. తాజాగా లింగారెడ్డి పదవీకాలం కూడా ముగిసిపోవడంతో చెమికెల రాజశేఖర్ రెడ్డికి ఏపీఐడిసి చైర్మన్ పదవిని ఇచ్చేందుకు సీఎం సుముఖంగా వున్నట్టు సమాచారం.

మారిన స్వరం

● ఉదయం ఉద్రేకం... సాయంత్రం ఉపశమనం ● బడ్జెట్‌పై మారిన దేశం నేతల వైఖరి

అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ నేతల స్వరం మారింది. గురువారం బడ్జెట్ ఫలితాలు వెలువడిన అనంతరం మంత్రులు మాట్లాడిన తీరు, శుక్రవారం ఉదయం సమన్వయకమిటీలో నాయకుల ఆగ్రహం, సాయంత్రం క్యాబినెట్ సమావేశంలో జరిగిన చర్చ అనంతరం విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు కళా వెంకట్రావు కామెంట్లు పరిశీలిస్తే టీడీపీ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపించింది. శుక్రవారం విలేకరుల సమావేశంలో మంత్రి కళా వెంకట్రావును మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, కొన్ని క్షణాలు మౌనం వహించారు. గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ మంత్రులు, నాయకుల ఆగ్రహాన్ని పరికిస్తే సాయంత్రం జరిగిన మంత్రి మండలి సమావేశంలో బడ్జెట్‌పై తీవ్రత ఎక్కువగా ఉంటుందని భావించారు. ఐతే క్యాబినెట్ సమావేశంలో బడ్జెట్‌కు సంబంధించిన తీవ్ర చర్చ జరగకపోగా టీకప్పులో తుఫాన్‌లా ముక్తసరిగా ముగించారు. కేవలం మెట్రో విషయం ప్రస్తావనకు రాగా నవ్యాంధ్ర రాజధాని అమరావతి పల్లె కాదు, పట్టణం కాదు అందుకే మెట్రో ప్రస్తావన బడ్జెట్‌లో తీసుకురాలేదోమనని సీఎం వ్యాఖ్యానించినట్లు సమాచారం. అందుకు స్పందించిన మంత్రి గంటా విశాఖకి అయినా మెట్రోకు నిధులు కేటాయించవచ్చుగదా అని ప్రస్తావించినట్లు తెల్సింది. బడ్జెట్‌పై కేంద్రంతో అనుసరించాల్సిన వైఖరిపై టీడీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ప్రతిపక్షాల దాడిని ఎదుర్కొనేందుకే టీడీపీ కేంద్రంపై తన స్వరాన్ని పెంచినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం జరిగే పార్లమెంటరీ సమావేశంలో చర్చించిన అనంతరం తగు నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు తెలియవచ్చింది.



బడ్జెట్ కేటాయింపులపై సర్వత్రా అసంతృప్తి: కళా వెంకట్రావు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులపై ప్రజలు, ప్రభుత్వం సర్వత్రా అసంతృప్తిగా ఉన్నారని మంత్రి కళా వెంకట్రావు అన్నారు. బడ్జెట్‌లో రైల్వేజోన్, రాజధాని నిర్మాణానికి నిధులు. రెవెన్యూ లోటు ప్రస్తావనే లేదన్నారు. వీటిపై బడ్జెట్‌లో ఊసే లేకపోవడం బాధాకరమన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ రెవెన్యూ లోటుతో ఉందని దీన్ని తీర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడానికి నిధుల ఆవశ్యకత ఉందన్నారు. బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరగదని కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ వ్యాఖ్యానించినట్లు తెల్సిందని దీంతో నిధుల సాధన కోసం కేంద్రంతో చర్చించనున్నామన్నారు. రాష్ట్రానికి సంబంధించి ఏఏ శాఖకు బడ్జెట్‌లో ఎంతెంత కేటాయింపులు జరిగాయో అధ్యయనం చేయాల్సిందిగా సీఎం అధికారులను ఆదేశించారన్నారు. నాల్గోతేదీ జరిగే పార్లమెంటరీ సమావేశంలో బడ్జెట్ కేటాయింపులపై సమగ్రంగా చర్చించడం జరుగుతుందన్నారు. బడ్జెట్ కేటాయింపులపై తీవ్రంగా ఉన్న అసంతృప్తిని వైకాపా రాజకీయం చేస్తుందని విమర్శించారు. ఇది సరైంది కాదన్నారు. రాష్ట్రానికి దీనివల మేలుకంటే కీడు జరుగుతుందన్నారు. బీజేపీతో పొత్తు భార్య భర్తల బంధం లాంటిదని ఒక్కసారిగా తెంచుకుంటే తెగేది కాదని వ్యాఖ్యానించారు. బడ్జెట్‌పై ప్రజలు, పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని కేంద్ర ప్రభుత్వంపై ఏ విధంగా ఒత్తిడి తీసుకురావాలనే విషయంపై ఆలోచిస్తున్నామన్నారు. రాజధానికి డీపీఆర్ లేకపోయినా 2,500 కోట్లు కేటాయించినట్లు మంత్రి మాణిక్యాలరావు వ్యాఖ్యలను ప్రస్తావించగా ప్రభుత్వం వద్ద లోపంలేదని అన్ని నివేదికలను అందించడం జరిగిందన్నారు. విలేకరుల సమావేశంలో మంత్రి కాల్వ, ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ పాల్గొన్నారు.

పరిపాలనా వ్యవస్థలో మహిళలు అభివృద్ధి సాధించాలి

● హెరిటేజ్ ఫుడ్స్ ఈడీ నారా బ్రాహ్మిణి



విశాఖ ఎడ్యుకేషన్, ప్రభన్యూస్: మహిళలు పరిపాలనా వ్యవస్థలో అభివృద్ధి సాధించాలని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మిణి అన్నారు. శుక్రవారం ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్ హౌస్‌లో ఐడిడి సదస్సును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో గుర్తింపు ఉన్ననాడే మహిళా సాధికారిత సాధ్యపడుతుందన్నారు. మహిళలు వ్యవస్థను నడిపే సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తోందని ఇది శుభపరిణామంగా తెలిపారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి. సృజన మాట్లాడుతూ సమాజంలో అసమానతలకు దూరంగా ఉండాలని, విశాల దృక్పథం ఉండాలన్నారు. అప్పుడే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయంలో మహిళలు చదువు, ఉద్యోగాల్లో నలభై శాతం ఉన్నారన్నారు. మహిళలు విద్యాభ్యాసం కోసం మహిళా ఇంజనీరింగ్ కళాశాల కూడా ఏర్పాటు చేసామన్నారు. ఐడిడి సెక్రటరీ టి. శివరావు, ఆంధ్రాబ్యాంక్ సీనియర్ బ్యాంక్ మేనేజర్ డి. సంగీత, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ పి. రాధిక, ఎన్ఎస్ఐసి సంస్థ జోనల్ హెడ్ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మిలిండా గేట్స్ సేవలు

● రైస్ ఫోర్టిఫికేషన్‌కు సహకారం ● ఏపీలో శాంసంగ్ గ్లోబల్ ఈ-కామర్స్ సెంటర్ ● అమెరికాలో అమెజాన్ సహా పలు సంస్థల ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ: సాంకేతికతను అనుసంధానం చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు రాష్ట్రగ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం ఆ దేశంలోని పలు ప్రతిష్టాత్మకమైన సంస్థల ప్రతినిధులతో విస్తృత సమావేశాలు నిర్వహించారు. విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజలకు అత్యున్నతమైన సేవలు అందించేందుకు చేస్తున్న కృషిని ఆయన ఆయా కంపెనీల ప్రతినిధులకు వివరించారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వపరంగా అందించనున్న సహాయ, సహకారాలను ఆయన వివరించారు. బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌నిక్ ఆస్టిన్, ఇతర ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. రియల్‌టైమ్ గవర్నెన్స్‌తో అందిస్తున్న సేవలు వారికి వివరించారు. సెన్సార్లు, డ్రోన్లు, ఐఓటి పరికరాల ద్వారా రేషన్, పింఛన్ల పంపిణీ, వాతావరణంలో మార్పులు, తదనుగుణంగా భూసార పరీక్షలు నిర్వహించి కాలానుగుణంగా రైతులు వేయాల్సిన పంటలను నిర్దేశిస్తున్నట్లు చెప్పారు. సీసీఎమ్ విధానంలో ఎల్‌ఈడీ లైట్లను అనుసంధానించడం, ప్రతి ఇంట్లో ఆర్‌ఎఫ్‌ఐడి కార్డు ఏర్పాటు ద్వారా చెత్త సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రజలకు రక్షిత మంచినీరు సరఫరా చేసే విధానంలో నీటి నాణ్యతను తెలుసుకునేందుకు సెన్సార్లు వినియోగిస్తున్నట్లు మంత్రి లోకేష్ పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్న బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ తమ రాష్ట్రంలో చేపడుతున్న గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యా, వైద్య సేవల్లో సహకారం అందించాలని ఆయన కోరారు. ఇందు కోసం రాష్ట్రప్రభుత్వంతో కలిసి పని చేయాలని ఆయన అన్నారు. మిలిండా గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు, ఆలోచనలు ఏపీలో అమలు చేయాలన్నారు. రైస్ ఫోర్టిఫికేషన్‌లో సహకారం అందించాలని ఆయన అన్నారు. చిన్న పిల్లల ఎదుగుదలలో మొదటి వెయ్యి రోజులు ఎంతో ముఖ్యమైనవి చెపుతూ పౌష్టికాహారం లేక అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. రైస్ ఫోర్టిఫికేషన్ ద్వారా దీనిని అధిగమించే అవకాశం ఉందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫోర్టిఫైడ్ రైస్ ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరించొచ్చని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ కార్యక్రమాలను మరింతగా విస్తరించనున్నట్లు మిలిండా గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు మంత్రి లోకేష్‌కు హామీ ఇచ్చారు. రైస్ ఫోర్టిఫికేషన్‌కు తమ ఫౌండేషన్ తరపున పూర్తి సహకారం అందించనున్నట్లు వారు మంత్రి లోకేష్‌కు హామీ ఇచ్చారు.



ప్రపంచంతో పోటీకి ప్రణాళికలు... అమెజాన్ బృందానికి స్పష్టం

దేశంలో అభివృద్ధి చెందిన మొదటి మూడు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ 2022 నాటికి ఒక్కటి గానూ, 2029 నాటికి దేశంలో నెంబర్ వన్ స్థానంలోనూ, 2050కి ప్రపంతో పోటీ పడాలని లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ అమెజాన్ ప్రతినిధి బృందానికి స్పష్టం చేశారు. అమెజాన్ వైస్ ప్రెసిడెంట్ ఫర్ గ్లోబల్ పాలసీ మైకెల్ పంక్, సీనియర్ ప్రోడక్ట్ మేనేజర్ డేవిడ్ రాత్ మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. టెక్నాలజీ అనుసంధానంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పిన మంత్రి లోకేష్ 15 శాతం వృద్ధి సాధించే దిశగా వెళుతున్నామన్నారు. ఇప్పటికే 12శాతం వృద్ధి సాధించిన తాము ఇంటర్ నెట్‌ను అందుబాటులోకి తేవడం ద్వారా మిగిలిన మూడు శాతం అభివృద్ధిని సాధించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ ద్వారా రూ.149కే వైఫై, టీవీ, టెలిఫోన్ సౌకర్యం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టినట్లయితే ఫైబర్‌నెట్ ద్వారా అమెజాన్ ప్రతి ఇంటికి చేరుకునే అవకాశం ఉందన్నారు. ఈ ప్రగతిలో భాగంగా ప్రభుత్వ సమాచారమంతా ఒకే వేదికపైకి తెచ్చి సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్ విధానం అమలు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో క్లౌడ్, ఐఓటికి పెద్ద ఎత్తున డిమాండ్ పెరబోతోందని, ఏపీని క్లౌడ్ హబ్‌గా మార్చేందుకు అనేక విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. క్లౌడ్ హబ్ పాలసీ ద్వారా క్లౌడ్ సెంటర్లను ఆకర్షించేందుకు చర్యలు చేపట్టామన్నారు. విశాఖపట్టణంలో ఏర్పాటు చేయనున్న ఇంటర్‌నెట్ ల్యాండింగ్ పాయింట్ ద్వారా విశాఖపట్టణం, అండమాన్, సింగపూర్ కలిపే విధంగా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. క్లౌడ్ సెంటర్లకు పూర్తి భద్రత కలిపించడంతో పాటు డేటా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే వారికి రాయితీలు, సబ్సిడీలు అందిస్తున్నామని లోకేష్ చెప్పారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ కౌడ్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆయన అమెజాన్ ప్రతినిధి బృందానికి తెలియజేశారు. తమ భారత ప్రతినిధి బృందంతో చర్చించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి స్థాయి సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీ అమలు చేస్తున్న క్లౌడ్ హబ్ పాలసీ బాగుందని కితాబిచ్చిన వారు వీలైనంత తొందరలో తమ బృందాన్ని ఏపీకి పంపుతామని చెప్పారు. విద్యా, వైద్య రంగాలతో పాటు స్టార్టప్ కంపెనీల అభివృద్ధికి స్వచ్ఛందంగా క్లౌడ్ సేవలు అందిస్తున్నట్లు చెపుతూ ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యంతో అక్కడ కూడా అమలు చేయనున్నట్లు అమెజాన్ వైస్ ప్రెసిడెంట్ ఫర్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ మైకెల్ పంక్ పేర్కొన్నారు.

దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయం చాలా తక్కువ ఉన్నప్పటికీ సవాల్‌గా తీసుకొని సమస్యలను అధిగమిస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ శాంసంగ్ సంస్థ ప్రతినిధులతో చెప్పారు. శాంసంగ్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ కాల్ రోమన్, ఇతర ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్న తాము పారిశ్రామికాభివృద్ధికి పలు పాలసీలు తీసుకొస్తూ అనేక రాయితీలు కలిపిస్తున్నామన్నారు. ఐటీ రంగ అభివృద్ధికి క్లస్టర్ మోడల్ అమలు చేస్తున్నామని చెప్పారు. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద కార్ల ఉత్పత్తి సంస్థ కియా రాష్ట్రంలో కంపెనీ ఏర్పాటుకు వచ్చిందన్నారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి, అనంతపురంలో ఐటీ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఫ్రాంక్లిన్, జోహో, హెచ్‌సిఎల్, కాన్డ్యుయెంట్ లాంటి కంపెనీలు వచ్చాయన్నారు.

ఎలక్ట్రానిక్ తయారీ రంగం అభివృద్ధికి ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫాక్స్‌కాన్, సెల్ కాన్, కార్బన్, డిక్సన్ ఇప్పటికే ప్రారంభం కాగా చెన్నై, బెంగుళూరు కారిడార్లను వినియోగించుకుంటూ ఐటీ, పారిశ్రామికాభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. కంపెనీల ఏర్పాటుకు భూముల కేటాయింపు, విద్యుత్ సరఫరా, మౌలిక వసతులు త్వరితగతిన కల్పిస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ఆలోచనలు, విజన్‌ను తాను బలంగా నమ్ముతానని చెప్పిన కాల్ రోమన్ తాను ఆయననే అతిపెద్ద అభిమానినన్నారు. తాను అమెజాన్‌లో పని చేస్తున్నప్పుడు హైదరాబాద్‌లో కంపెనీ ఏర్పాటుకు మూడు రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసినట్లు చెపుతూ ఇప్పుడు అక్కడ 30వేల మందికి ఉద్యోగావకాశాలు వచ్చినట్లు తెలిపారు. చంద్రబాబు మాట ఇస్తే కట్టుబడి ఉంటారని చెపుతూ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. శాంసంగ్ గ్లోబల్ ఈ కామర్స్ సెంటర్‌ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇతర రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై అధ్యయనం చేసిన తర్వాత ఏపీలో విస్తరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పేద విద్యార్థులకు స్వచ్ఛందంగా తానే విద్యకు సహాయం చేయనున్నట్లు చెపుతూ ఏపీలో పాఠశాలను ఏర్పాటు చేసి వెయ్యి మంది విద్యార్థులను దత్తత తీసుకోనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి చూడండి.. పెట్టుబడులు పెట్టండి



గత మూడున్నరేళ్లుగా సాంకేతికతను వినియోగించుకొని చేసిన అభివృద్ధిని స్వయంగా వచ్చి పరిశీలించి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని మంత్రి నారా లోకేష్ కోరారు. శుక్రవారం వాషింగ్టన్ స్టేట్ ఇండియా ట్రేడ్ రిలేషన్స్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ సాంకేతిక సాయంతో ఏ విధంగా అధిగమించి అభివృద్ధి సాధించిందీ వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పారిశ్రామికాభివృద్ధిలో దేశంలోనే తాము ముందున్నామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద కార్ల కంపెనీలలో ఒకటైన కియా కార్ల కంపెనీ ఏపీకి వచ్చిందంటే తాము చేపడుతున్న పాలసీలే నిదర్శనమన్నారు. ఇప్పుడున్న విమానాశ్రయాలు, నౌకాశ్రయాల అభివృద్ధితో పాటు మరింత అభివృద్ధిని సాధించే దిశగా కొత్త పోర్టుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఏపీకి రావాలంటూ వాషింగ్టన్ స్టేట్ ఇండియా ట్రేడ్ రిలేషన్స్ యాక్షన్ కమిటీ సభ్యులకు లోకేష్ ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, రియల్ టైమ్ గవర్నెన్స్, ఫైబర్‌నెట్, రాజధాని సహా పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశం ద్వారా వాషింగ్టన్, ఏపీ మధ్య బంధం మరింత బలపడిందని, వాణిజ్య సంబంధాలు మరింత మెరుగయ్యేలా చర్యలు తీసుకుంటామని వాషింగ్టన్ రాష్ట్ర గవర్నర్ సైరస్ హబీబ్, వివిధ కంపెనీల ప్రతినిధులు లోకేష్‌కు హామీ ఇచ్చారు. వీలైనంత తొందరలోనే రాష్ట్ర పర్యటనకు రానున్నట్లు వారు తెలిపారు.

రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి

ప్రవాస భారతీయులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని మంత్రి నారా లోకేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రవాస భారతీయులు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మూడేళ్లలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని వివరించారు. గ్రామీణాభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం, ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు, భూగర్భ నీటి పారుదల, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు వంటి ప్రభుత్వపరంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏపీలో పారిశ్రామికాభివృద్ధి శరవేగంగా జరుగుతున్నట్లు చెపుతూ కియా లాంటి కార్ల సంస్థ రాష్ట్రానికి రావడం ప్రభుత్వ సమర్థతను తెలియజేస్తుందన్నారు. ఐటీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల కారణంగా ఫ్రాంక్లిన్, ఎఎన్ఎస్ఆర్, కాన్డ్యుయెంట్, జోహో లాంటి కంపెనీలు రాష్ట్రానికి వచ్చినట్లు తెలిపారు.

విద్యుత్ సంస్థల వీర బాదుడు

యూనిట్ రూ.12లా?!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. చిన్న చిన్న కార్యక్రమాలక్కూడా తప్పనిసరిగా మారిన ఫంక్షన్‌హాళ్లలో విద్యుత్ వినియోగానికి యూనిట్‌కు 11.75రూపాయల బిల్లు వేస్తున్నారు. ప్రచారం నిమిత్తం ఏర్పాటు చేసే చిన్న పాటి బోర్డులకు యూనిట్‌కు 12.75రూపాయల చొప్పున బిల్లులేస్తున్నారు. ఇంతటి స్థాయిలో విద్యుత్‌ను అమ్మాల్సిన అవసరముందా అన్న సందేహాలు ఇప్పుడు నెలకొంటున్నాయి. ఏ రకంగా చూసినా ఉత్పత్తి విలువ యూనిట్‌కు రెండు నుంచి ఐదురూపాయలకు మించడంలేదు. దీన్ని 12నుంచి 15రూపాయలకు అమ్మాల్సిన అవసరమేంటి. ఇదంతా ప్రభుత్వానికి తెలీకుండానే.. కనీసం సమాచారం కూడా ఇవ్వకుండానే విద్యుత్ సంస్థలుప్రజల్ని చేస్తున్న దోపిడీకి అద్దంపడుతోంది. ఈ సంస్థల్ని కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికే ఉంది. జెన్‌కో, ట్రాన్స్‌కోల ఏర్పాటు అనంతరం వీటికి స్వయం ప్రతిపత్తినిచ్చారు. ఆదిలో నిలదొక్కుకునేందుకు ప్రభుత్వాలు భారీగా నిధులిచ్చాయి. విద్యుత్ విక్రయ ధరల నిర్ణయాన్ని కూడా ఈ సంస్థలే స్వయంగా చూసుకుంటున్నాయి. గతంలో ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతికోరేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ కారణంగానే ప్రభుత్వం రెండ్రూపాయల లోపు ధరతో విద్యుత్ విక్రయించాలని నిర్దేశించినప్పటికీ యూనిట్‌కు 12రూపాయల పైబడి విక్రయాలు జరుగుతున్నాయి. రాష్ట్రం మొత్తమ్మీద లెక్కేస్తే యూనిట్‌కు రెండ్రూపాయల లోపు ధరకు విద్యుత్‌ను పొందుతున్న గృహాల సంఖ్య 0.5శాతం కూడా ఉండవు. ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకున్నామంటూ ప్రభుత్వ మెప్పు పొందేందుకు వీలుగా ఈ సంస్థలు వినియోగదార్లను పీడిస్తున్నాయి. మీటర్ రీడింగ్‌లో లోపాలున్నాయి. పని చేయడం లేదంటూ గత ఐదేళ్ళుగా లెక్కలేని వినియోగదార్లనుంచి ముక్కుపిండి అపరాధ రుసుంతో సహా అధిక మొత్తాన్ని రాబడుతున్నాయి. అవసరమైతే కోర్టుకెళ్ళండి.. కాకుంటే హైకోర్టులో కేసులెట్టండంటూ వినియోగదార్లకు సలహాలిస్తూ తాము మాత్రం లక్ష్యాలకనుగుణంగా బిల్లులు పెంచి వసూలు చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యుత్ సంస్థల విక్రయాలు, సరఫరా చేస్తున్న విద్యుత్ ధరలపై పరిశీలన జరిపి యదార్థ పరిస్థితిని తెలుసుకోవాల్సిన అవసరముంది. విద్యుత్ సంస్థలు వినియోగదార్ల మీటర్లు సరిగా పనిచేయడంలేదంటూ గత ఐదేళ్ళ వినియోగాన్ని పెంచి చూపి ఇప్పుడు ఒకేసారి బిల్లులు జారీ చేస్తున్నారు. అలాగే గతంలో తప్పుడు బిల్లులు జారీ అయ్యాయని, కేటగిరి తప్పుగా నమోదైందని, నిర్దేశిత లోడుకు మించి వినియోగించారంటూ వేలూ, లక్షల్లో అదనపు బిల్లులేసి వసూలు చేస్తున్నారు. పైగా ఏడ్రోజుల కాలపరిమితిలోగా ఈ బిల్లుల్ని చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. దాటితే పదిరూపాయల వడ్డీని వసూలు చేస్తున్నారు. ఇలా తప్పుడు బిల్లులు, అధిక లోడు బిల్లులు, టారిఫ్ వ్యత్యాస బిల్లులు, మీటర్ సరిగా తిరగడంలేదన్న సాకుతో కొత్త బిల్లులు వినియోగదార్లను తీవ్రంగా సతమతం చేస్తున్నాయి. ఇవన్నీ ముఖ్యమంత్రికి తెలీకపోవచ్చు. తెలుసుకుని సవరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

ఇక సమరమే

• బీజేపీపై పోరు మొదలైంది • చివరి అస్త్రం తెగతెంపులే • పూర్తి మెజారిటీ ఉందని బీజేపీకి పొగరు : టీడీపీ ఎంపీ టీజీ వెంకటేశ్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: భారతీయ జనతా పార్టీపై పోరు మొదలైందని తెలుగుదేశం రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్ అన్నారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం పార్లమెంటు సమీపంలోని విజయ్ చౌక్ వద్ద మీడియాతో మాట్లాడారు. బడ్జెట్ కేటాయింపులపై తెలుగుదేశం నేతలు అసంతృప్తి స్వరాన్ని గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో, రాజ్యసభ సభ్యుడిగా ఉన్న టీజీ వెంకటేశ్ ఒక అడుగు ముందుకేసి యుద్ధం ప్రకటించారు. అంచెలంచెలుగా బీజేపీ మీద పోరాటం చేస్తామని వెల్లడించారు. ఈ పోరాటంలో చివరి అస్త్రంగా తెగదెంపులు కూడా ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇంకా ఏడాది కాలమే మిగిలి ఉందని, తెగదెంపులకు సైతం వెనుకాడే ప్రసక్తే లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇంతకాలం పాటు రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో స్నేహంగా ఉన్నామని, ఆదివారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే ఎంపీల సమావేశం తర్వాత తమ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కేంద్రంలో సొంతంగా పూర్తి మెజారిటీ ఉందన్న పొగరుతో భారతీయ జనతా పార్టీ ఉందని, తెలుగుదేశం పార్టీ మద్దతు ఉపసంహరించుకున్నా తమ ప్రభుత్వానికొచ్చే నష్టమేమీ లేదన్న ధీమాతో వ్యవహరిస్తోందని టీజీ వెంకటేశ్ అన్నారు.

తాము మొదటి నుంచి ప్రత్యేకహోదా కావాలని అడిగితే ప్యాకేజీ ఇస్తామన్నారని, చివరకు దానిపైనా స్పష్టత లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తాము మళ్లీ ప్రత్యేక హోదాయే కావాలని డిమాండ్ చేస్తామని తెలిపారు. ఇప్పటికే నాలుగేళ్ల గడచిపోయాయని, ఇక సహించే ప్రసక్తే లేదని ఆయన తెగేసి చెప్పారు. విభజన హామీలు అమలు చేయకుండా మొండిచేయి చూపుతున్నది బీజేపీయేనని చెప్పడానికి కూడా తాము వెనుకాడబోమని హెచ్చరించారు. తామేమీ కొత్తగా గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. బీజేపీకి మరో ఝలక్ కూడా ఇచ్చారు. గతంలో తమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశ రాజకీయాల్లో చక్రం తిప్పారని, మళ్లీ ఆ రోజులు వస్తాయని వ్యాఖ్యానించారు. జీఎస్టీ అమలు చేసిన దేశాల్లో ఆయా ప్రభుత్వాలు కూలిపోయిన సంగతి కూడా గుర్తుంచుకోవాలని టీజీ అన్నారు. బీజేపీ పై జరిగే పోరులో తమ నాయకుడు కమాండర్‌లా ముందుండి నడిపిస్తారని టీజీ వెంకటేశ్ అన్నారు. హోదా ఇస్తే భాజపాతో కలుస్తామన్న జగన్ వ్యాఖ్యల వల్ల కూడా రాష్ట్రానికి కేంద్రం నుంచి సహకారం అందడం లేదని అన్నారు. రాష్ట్రప్రయోజనాలకోసం జగన్ రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని హితవు పలికారు.

విద్యతోనే అభివృద్ధి


• శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్



అమరావతి, ఆంధ్రప్రభ: విద్యతోనే అభివృద్ధి ముడిపడి ఉందని, ఈ విషయాన్ని గుర్తెరిగి విద్యలో రాణించడం ద్వారా ఉన్నతస్థాయిలో స్థిరపడాలని రాష్ట్రశాసన సభస్పీకర్ కోడెల శివప్రసాద్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గుంటూరులోని నాగార్జున ఎడ్యూకేషన్ సొసైటీ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోడెల మాట్లాడుతూ విద్యాసంస్థలకు పూర్వ విద్యార్థులు ఎంతో బలమని, ప్రతి విద్యార్థి వారు చదువుకున్న విద్యాలయాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. సేవా దృక్పథంతో పలువురు ప్రముఖులతో కలిసి జాగర్లమూడి చంద్రమౌళి స్థాపించిన జేకేసీ కళాశాలలో చదువుకున్న వేల మంది విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. గత 50 సంవత్సరాలుగా విద్యారంగానికి నాగార్జున ఎడ్యూకేషనల్ సొసైటీ చేస్తున్న సేవలు అద్వితీయమని, ఇలాగే మరింత మంది విద్యార్థులను నైపుణ్యవంతులగా తీర్చిదిద్దాలని ఎన్ఈఎస్ సభ్యులకు సూచించారు. అనంతరం జస్టిస్ ఛలమేశ్వర్ మాట్లాడుతూ గతంలో డబ్బున్న వారికే పరిమితమైన విద్యను నిరుపేదలైన గ్రామీణ, రైతు కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు 1967లోనే ఎన్ఈఎస్ సంస్థ ద్వారా కళాశాలలను ప్రారంభించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఎటువంటి లాభాపేక్షలేకుండా సేవా భావంతో నాణ్యమైన విద్యను అందిస్తూ ముందుకు సాగుతున్న ఎన్ఈఎస్ సంస్థల్లో ప్రస్తుతం 10 వేల మంది విద్యార్థులతోపాటు వెయ్యి మంది అధ్యాపకులుగా ఉపాధిని పొందుతున్నారని తెలిపారు. వేలాది మంది విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతూ దేశ, విదేశాల్లో రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీకువచ్చే దిశగా వారిని ఎన్ఈఎస్ విద్యా సంస్థలు తయారు చేస్తుండటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఈఎస్ అధ్యక్షులు కొండబోలు బసవపున్నయ్య, ఎంపి రాయపాటి సాంబశివరావు, ఏఎన్‌యూ వీసీ రాజేంద్ర ప్రసాద్, జాగర్లమూడి మురళీ, రాయపాటి శ్రీనివాస్, మద్దినేని గోపాల కృష్ణ, ఎన్.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు చైర్మన్‌గా పుట్టా సుధాకర్‌యాదవ్ పేరు ఖరారు

• నేడో, రేపో అధికారికంగా ప్రకటన • పాలకమండలి సభ్యుల ఎంపికపై కసరత్తు • మాజీ మంత్రి డీఎల్‌ను టీడీపీలోకి చేర్చుకునే అవకాశం?



కడప, ప్ర భ న్యూస్ బ్యూరో: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు చైర్మన్‌గా కడప జిల్లా మైదుకూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్‌ను పాలకమండలి చైర్మన్‌గా నియమించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించినట్లు తెలిసింది. ఈ విషయమై అధికారికంగా నేడో,రేపో ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలుగుదేశం పార్టీ వర్గాల ద్వారా స్పష్టంగా తెలిసింది. సుధాకర్ యాదవ్‌ను టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా నియమించేందుకు గత రెండు నెలలు గా సీఎం చంద్రబాబు ఆమోద ముద్ర వేసినప్పటికీ కొన్ని కారణాల వలన ఈ ఎంపిక నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. అయితే అటు రాజకీయ సమీకర ణలు , సామాజిక వర్గాల సమీకరణాల నేపథ్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్‌ను టీటీడీ బోర్డు చైర్మన్‌గా నియమించేందుకు సీఎం చంద్రబాబు ఆమోద ముద్ర వేసినట్లు స్పష్టంగా తెలిసింది. ఈనేపథ్యంలో తిరు మల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుల నియామకంపై కసరత్తు జరుగుతోంది. ఇదిలా ఉండగా మైదుకూరు నియోజకవర్గంలో నెలకొన్న రాజ కీయ పరిణామాల నేపథ్యంలో సుధాకర్‌యాదవ్‌కు టీటీడీ చైర్మన్ పదవీని అప్పజెబుతున్న నేపథ్యంలో ఆ నియోజకవర్గానికి సంబంధించి 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మైదుకూరు టీడీపీ అభ్యర్థిగా మాజీమంత్రి, సీనియర్ నేత డీఎల్ రవీంద్రారెడ్డిని తెలుగు దేశం పార్టీలోకి చేర్చుకుని వచ్చే ఎన్నికల్లో ఆయనను మైదుకూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయించే దుకు పార్టీ అధిష్టాన వర్గం యోచిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఏదిఎమైనా గత 9నెలలుగా ఖాళీగా ఉన్న తిరుమలతిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ పదవికి పుత్తా సుధాకర్‌యాదవ్‌ను సీఎం చంద్రబాబు నాయుడు ఖరారు చేయడంతో ఇంతకాలం కొన సాగుతున్న సందిగ్ధతకు తెర దించినట్లయింది.

మహిళా ఉద్యోగుల సంక్షేమానికి కృషి

• రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని మహిళా ఉద్యోగుల సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి తెలియజేశారు. శుక్రవారం ఏపీఎస్ఆర్‌టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర మహిళా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెస్తే తక్షణ పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. ముఖ్యంగా ఆర్‌టీసీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారని, బిడియం వీడి ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తూ తిరిగి అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏపీఎస్ఆర్‌టీసీ ఎండి, రాష్ట్రడీజీపీ ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ అతి పెద్ద రవాణా సంస్థ అయిన ఏపీఎస్ ఆర్‌టీసీలో సమస్యలు ఉండటం సహజమేనని, అయితే వాటిని తక్షణమే పై అధికారుల దృష్టికి తీసువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మహిళా కండక్టర్లకు రాత్రిపూట విధుల నిర్వహణ, సెలవులు తదితర అంశాలపై సంస్థ ఉన్నతాధికారులతో చర్చిస్తే సానకూల స్పందన ఉంటుందని చెప్పారు. ఆర్‌టీసీలో తొలిసారిగా ప్రారంభించిన ఈ-ఆఫీసుల ద్వారా ఎటువంటి సమస్యలున్నా తక్షణమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. బయోమెట్రిక్ తప్పనిసరైన నేపథ్యంలో ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ, సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా ఉద్యోగులు రాత్రి వేళల్లో విధులు లేకుండా, రోజుకు 8 గంటలు విధులు ఉండేలా, పదోన్నతుల్లో రిజర్వేషన్లు, నెలలో మూడు రోజుల సెలవుల కేటాయింపులు తదితర సమస్యలను పరిష్కరించాలని నన్నపనేని రాజకుమారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ చైర్మన్ ఆర్.వి.ప్రసాద్, అధ్యక్షులు చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ డిఎస్పీరావు, మహిళా ప్రతినిధులు మంగమ్మ, సుజాతలతో పాటు దాదాపు 1200 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టిల్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం నుంచి ప్రారంభమైన పరీక్షలకు ప్రభుత్వం అన్ని కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా 986 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. ఇదే విధానాన్ని ఈసారి ఇన్విజిలేటర్లకు కూడా వర్తింపజేస్తున్నారు. ప్రాక్టికల్ పరీక్షల్లో అవకతకలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈసారి పకడ్బందీగా చర్యలు తీసుకుంది. ప్రతి సెంటర్‌లోను సీసీ కెమెరాల నిఘా ఉంచారు.

రాష్ట్రంలో 3.56 లక్షల మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈనెల 21వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ ఉదయలక్ష్మీ తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

• మంత్రి మాణిక్యాలరావు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని దేవాదాయ శాఖామంత్రి మాణిక్యాలరావు అన్నారు. కేంద్ర బడ్జెట్ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. బడ్జెట్‌పై టీడీపీ చేస్తున్న విమర్శలను అపోహలుగా కొట్టిపారేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ దేశానికి వెన్నుముకగా ఉన్న రైతుకు భరోసానిచ్చే విధంగా బడ్జెట్ ఉందన్నారు. గ్రామీణ భారతాన్ని అభివృద్ధి చేసేందుకు వేలకోట్ల రూపాయలు కేటాయించారన్నారు. గ్రామ సేవల అభివృద్ధి ద్వారా దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం మౌలిక రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేయడం వలన దేశం అభివృద్ధి చెందుతుందనీ, తద్వారా రాష్ట్రం కూడా అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపుల విషయంలో అధ్యయనం జరుగుతుందని సమగ్ర సమాచారం వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు సజావుగా నడుస్తుందని, దానిగురించి బడ్జెట్‌లో ప్రస్తావించాల్సిన అవసరం లేదన్నారు. ప్రాజెక్టు సమగ్ర నివేదిక లేకున్నా, రాజధాని నిర్మాణానికి కేంద్రం 2,500 కోట్లు కేటాయించిందన్నారు. రాజధానికి సంబంధించి డిజైన్లు ఖరారు కాలేదన్నారు. రాజధాని నిర్మాణం కాకుండా మెట్రో రైలు ఆవశ్యకత ఏమిటని ప్రశ్నించారు. విశాఖ రైల్వేజోన్ విషయంలో కొన్ని సాంకేతిక సమస్యలున్నాయనీ, దీనిపై కూడా త్వరలో స్పష్టత వస్తుందన్నారు. ఇప్పటి వరకు ఏపీకి 12 విద్యాసంస్థలు వచ్చాయన్నారు. విభజన హామీలు నెరవేర్చేందుకు బీజేపీ ధృడంగా ఉందన్నారు. పొత్తుల విషయం చంద్రబాబు, అమిత్‌షాలు చూసుకొంటారని మంత్రి మాణిక్యాలరావు ముక్తసరిగా సమాధానమిచ్చారు.



మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఈవో పద్మావతి

బెజవాడ దుర్గగుడి ఆలయం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి మాణిక్యాలరావు ఈవో పద్మావతిని ఆదేశించారు. బెజవాడ కనకదుర్గమ్మ గుడి కార్యనిర్వహణాధికారిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఐఏఎస్ అధికారిణి పద్మావతి శుక్రవారం అమరావతి సచివాలయంలో మంత్రిని మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందర్నీ కలుపుకుపోతూ మంచి సంబంధాలు కొనసాగిస్తూ ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని ఈవోకు సూచించారు. పాలకమండలితో పాటు సిబ్బంది సహకారంతో సమస్యలను పరిష్కరించుకుంటూ, ఆలయాన్ని అభివృద్ధిపథంలో పయనింపజేయాలని అన్నారు. ఇక ముందు ఎటువంటి వివాదాలకు తావు లేకుండా గుడిపాలన ఉండాలన్నారు. భక్తుల మనోభావాలకనుగుణంగా నడుచుకుంటూ గుడి ప్రాముఖ్యతను కాపాడాలన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన పలు రకాల సమస్యలపై ఈవోతో మంత్రి చర్చించారు. ఆలయంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా భక్తుల మనోభావాలే లక్ష్యంగా విధి నిర్వహణ చేస్తానని ఈవో మంత్రికి తెలిపినట్లు సమాచారం.

నేటి నుండి మంత్రి అమరనాథ్‌రెడ్డి విదేశీ పర్యటన

• మూడు దేశాల్లో రోడ్ షోలు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి ఎన్ అమరనాథ్ రెడ్డి ఫిబ్రవరి 3 నుండి 10 వరకు 7 రోజులపాటు విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. విశాఖపట్టణం వేదికగా ఫిబ్రవరి 24,25,26 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య ఒప్పంద సదస్సు (పార్టనర్‌షిప్ సమ్మిట్) జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశా లమేరకు పరిశ్రమలశాఖా మంత్రి ఎన్ అమర్నాథ్ రెడ్డి అభివృద్ధి చెందిన దేశాల్లో పర్యటించి రోడ్ షోలను నిర్వహించనున్నారు. యూకే, జర్మనీ, స్వీడన్ దేశాల్లో ఆయన తన పర్యటన కొనసాగించనున్నారు. ఈ సం దర్భంగా మంత్రి పలు పారిశ్రామికవేత్తలను కలిసి ఏపీలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరడంతోపాటు ఏపీలో ఇస్తున్న రాయితీలను వారికి వివరించను న్నారు. ఇదే సమయంలో వారిని విశాఖలో జరగబోయే సమ్మిట్‌కు ఆహ్వానించను న్నారు. ఈ పర్యటనలో మంత్రితోపాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఆర్ ప్రీతమ్ రెడ్డి, పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్, ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) అధికారులు వెళ్లనున్నారు.

ఎలక్టోరల్ బాండ్లపై వివరణ ఇవ్వండి

• కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఉండాలన్న నిర్ణయంపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది..సీపీఐ(ఎం) జనరల్ సెక్రటరీ సీతారాంఏచూరి పిటిషన్ పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎ ఎం ఖాన్విల్కర్, డి.వై చంద్రచూడ్ లతో కూడిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈసందర్భంగా ధర్మాసనం కేంద్రానికి సూటి ప్రశ్న వేసినట్లు సమాచారం. ఎలక్టోరల్ బాండ్లు ఆచరణ సాధ్యమయ్యే అంశమేనా అని అడిగినట్లు తెలుస్తోంది.. కేంద్ర నిర్ణయం ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్లక్ష్యం చేసే విధంగా ఉందని..దీనిద్వారా రాజకీయ అవినీతికి ఆస్కారం ఉంటుందని ఏచూరి తన వాదనను వినిపించారు. ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో పెట్టినప్పుడు సవరణలు చేయాలని కోరామని గుర్తు చేశారు. లోక్ సభలో మెజారిటీ ఉందనే ఎన్డీఏ ప్రభుత్వ బిల్లులకు ఆమోదముద్ర వేయించుకుంటుందని రాజ్యసభలో మెజారిటీ లేకపోవడంతో వాటికి మోక్షం లభించడం లేదని అన్నారు. గతేడాది బడ్జెట్‌లో ఎలక్టోరల్ బాండ్ లను ప్రవేశపె ట్టనున్నట్లు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఎస్బీఐ లలో బాండ్లు కొనుగోలు చేయవచ్చని పేర్కొంది. బాండ్ల అమ్మకాలకు కొన్ని తేదీలను కూడా గతంలో ప్రకటించింది.

జల్లికట్టుపై పిటిషన్లు రాజ్యాంగ ధర్మాసనానికి

న్యూఢిల్లీ: జల్లికట్టుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ నివేదించింది.రాజ్యాంగ ధర్మాసనాన్ని ఐదు అంశాలపై స్పష్టత కోరామని జస్టిస్ నారిమన్ తెలిపారు. జల్లికట్టునిషేధంపై తమిళనాడు ,మహారాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటినీ కలిపి విచారించేందుకు వాటిని రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీంకోర్టు నివేదించింది. గత డిసెంబర్‌లో కొన్ని పిటిషన్లను నివేదించింది.

జక్కంపూడి చిక్కుముడి!

(మొదటిపేజీ తరువాయి)

స్థలం మాత్రమే అందుబాటులో ఉంది. ఇది గత నాలుగేళ్లుగా ఇన్‌ఫ్రా కంపెనీల యాజమాన్యాలకు తమ కంపెనీల ఏర్పాటుకు ఈ అంశం ఇబ్బందికరంగా మారింది. తమ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి పేపర్ వర్క్ మొత్తం పూర్తయినప్పటికీ అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో సదరు కంపెనీల యాజమాన్యాలు డోలాయమానంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఆర్థిక నగరాల ఏర్పాటు చేయాలనే ధృడ సంకల్పంతో ఉన్న తరుణంలో స్థల సేకరణ ఇబ్బందికరంగా మారింది. తాను ముఖ్యమంత్రిగా పదవీప్రమాణ స్వీకారం చేసిన మూడేళ్ల కాలంలో వీటిని ప్రారంభించాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకుని పనిచేశారు. ఈ ఆర్థిక నగరాల ఏర్పాటు బాధ్యతను ఇంధన శాఖకు అప్పగించిన తరువాత వీటి ఏర్పాటు అంశం వెలుగులోకి వచ్చింది. అయితే వీటి ఏర్పాటుకు 20 లక్షల చదరపు అడుగుల స్థలానికి పైగా అవసరమని సంబంధిత శాఖ ప్రాథమికంగా గుర్తించింది.

1975 తరువాత ఆంధ్రప్రదేశ్ చరిత్రలో జీవీకే, జీఎమ్మార్, వరప్రసాద రెడ్డి కంపెనీలు తమ ఉనికిని చాటుకుని కొంత కాలానికి అతిపెద్ద కంపెనీలను ఏర్పాటు చేయగలిగాయి. దీంతో కొంతమేర ఉపాధి అవకాశాలను కల్పించగలిగారు. మళ్లీ ఇన్నాళ్ల తరువాత నాలుగేళ్ల వయస్సున్న ఆంధ్రప్రదేశ్‌లో ఆశ్చర్యంగొలిపేలా పారిశ్రామికవేత్తలు ముఖ్యమంత్రి స్థాయిలో తీసుకున్న రాజకీయ నిర్ణయాలు, ఇతర కారణాలవల్ల తమ కలలను సాకారం చేసుకొనే అవకాశం దక్కించుకున్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ బోర్డు (యూఐపీబీ) ఫిబ్రవరి 2వ తేదీన కేబినెట్ సమావేశానికి ముందు కీలకసమావేశాన్ని నిర్వహించింది. ఇందులో యుఐపీబీ సభ్యులు ఒడిస్సా, తెలంగాణ, మధ్యప్రదేశ్, కర్నాటక, తమిళనాడుల్లో అమల్లోఉన్న కోల్డ్ కాలింగ్ విధానంపై పూర్తిస్థాయిలో చర్చించాయి. వాస్తవానికి రాష్ట్రంలో ఏర్పాటు చేయాలనుకునే మెగా ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వడం లేదా తిరస్కరించడం యుఐపీబీ పరిధిలోనే ఉంటుంది. ముఖ్యమంత్రి చేపట్టే సంస్కరణలకు ఇది కేంద్ర బిందువుగా పనిచేయాల్సి ఉంటుంది. సింగిల్ ఫైల్ పాలసీ (ఎస్ఎఫ్ఎస్) అమల్లోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ పాలసీని పునరుద్ధరించేందుకు దీనిని రెండవ అంశంగా పరిగణిస్తున్నారు. ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ పనితీరును కొన్ని కేసుల్లో క్షుణ్ణంగా గమనించిన తరువాత సాధారణ పరిపాలనా విభాగం (జీఏడీ), ప్రోటోకాల్ శాఖలు పనితీరును దృష్టిలోపెట్టుకుని ముఖ్యమంత్రి యుఐపీబీని ఏర్పాటుచేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి తెలుస్తోంది. ఈ బోర్డు రాష్ట్రంలో నెలకొల్పబోయే మెగా ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వడం, తిరస్కరించడం వంటి నిర్ణయాలను యూఐపీబీ కమిటీ సిఫార్సులమేరకు తీసుకోనుంది. ఆర్థిక నగరాల ఏర్పాటుకు అనుమతులు కూడా ఈ కమిటీ సిఫార్సు మేరకు ఇవ్వనున్నారు. ఏపీఐఐసీ ఇస్తున్నఅనుమతులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో యుఐపీబీ కమిటీ సమగ్ర పరిశీలన అనంతరం మాత్రమే ఏపీఐఐసీ అనుమతులను ఇవ్వనుంది. 1970 తరువాత ఇప్పుడు పరిశ్రమల ఏర్పాటు మళ్లీ పునరావృతం అవుతోందని, నాలుగేళ్ల వయస్సున్న ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడుదారులు కావాలని, సబ్సిడీలు, ఫ్రీ స్కీములు ఇవ్వడం ద్వారానే అది సాధ్యమని అనుకుంటే పొరపాటేనని ఒక పారిశ్రామికవేత్త అభిప్రాయపడ్డారు. వీటికంటే ముఖ్యంగా స్థల కేటాయింపు అత్యవసరమని చెప్పారు. ఈ సందర్భంగా ఒక విషయాన్ని గుర్తుచేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆర్థిక నగరాలు అనేవి ఉపాధి కల్పనా కేంద్రాలని, ప్రత్యేకంగా రాష్ట్ర జనాభాలో 43 శాతం మేర ఉన్న స్కిల్ డవలప్‌మెంట్, సెమీ స్కిల్ డవలప్‌మెంట్, స్కిల్డ్ యువతకు ఇవి ఎంతగానో ఉపకరించనున్నాయన్నారు. రాష్ట్రవ్యవహారాలు కనుక సక్రమమైన మార్గంలో పయనిస్తే జక్కంపుడి ఆర్థిక నగరం ఒక గొప్ప ఉపాధి కల్పనా కేంద్రంగా భాసిల్లే అవకాశముంది. స్థలసమస్యనుండి రాష్ట్రప్రభుత్వం గట్టెక్కగలిగితే మంచిప్రయోజనాలు దక్కనున్నాయి. అంతేకాకుండా రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ ఈ ఆర్థిక నగరాల ఏర్పాటు ద్వారా పర్ కేపిటా ఇన్‌కమ్ కర్నాటక ప్రభుత్వంతో సమానంగా పెరగుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. గ్రామీణ గృహనిర్మాణ శాఖలో పనిచేస్తున్న మరో సీనియర్ అధికారి మాట్లాడుతూ, ఆర్థిక ప్రగతి అనేది కేవలం ఒక్క ప్రభుత్వంతోనే సాధ్యపడదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కోర్ డిమాండ్ అనేది పారిశ్రామికవేత్తల రాక మీద మాత్రమే ఆధారపడి ఉంటుందని చెప్పారు. దీనికితోడు పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు సబ్సిడీలు, డిస్కౌంట్లు ఇవ్వడం అవసరమనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నాన్యృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శనివారం 3 ఫిబ్రవరి 2018

జీఎస్టీ బాలారిష్టాలు!

వస్తు, సేవా పన్ను (జిఎస్‌టి) అమలులోకి వచ్చాక అవినీతి తొలగిపోయిందనీ, సరకుల రవాణా అంతా పారదర్శకంగా జరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పదే పదే ప్రకటించారు. అవినీతి నిర్మూలన కోసం తమ ప్రభుత్వం జిఎస్‌టిని తీసుకుని వస్తే, ప్రతిపక్షాలు మోకాలడ్డుతున్నాయని ఆరోపించడం ఇంకా మనకు గుర్తుంది. కానీ, వాస్తవం ఏమిటి? జిఎస్‌టి వ్యవస్థ అమలులోకి వచ్చి ఆరు మాసాలు కావస్తున్నా, ఇంకా బాలారిష్టాలను దాటలేదు. ఇప్పటికి 25సార్లు పైగా జిఎస్‌టి మండలి సమావేశమై 170 పైగా వస్తువులు, సేవలపై గరిష్ఠ పన్ను రేటును 28 నుంచి 18కి తగ్గించింది. అయినప్పటికీ, రాష్ట్రాల నుంచి ఇంకా ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. జిఎస్‌టి లో మరో కీలక ఘట్టమైన ఈ-వే బిల్లుల వ్యవస్థను తెలుగు రాష్ట్రాలతో సహా 13 రాష్ట్రాల్లో ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి అమలులోకి రావల్సి ఉండగా, కొద్దివారాల పాటు వాయిదా వేయాలని నిర్ణయించడం ఇందుకు పటిష్ఠమైన వ్యవస్థ లేదని అంగీకరించడమే. నిజానికి జిఎస్‌టిని కానీ, ఈ-వే బిల్లుల వ్యవస్థను కానీ వ్యాపారులు ఎవరూ వ్యతిరేకించడం లేదు. తమ కష్టనష్టాలను పరిగణనలోకి తీసుకోవమనే వారు కోరుతున్నారు. సర్వర్ల మొరాయింపుతో ఈ-వే బిల్లుల చెల్లింపులు ఎక్కడివి అక్కడ నిలిచిపోయాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఇందుకు సంబంధించి పారదర్శకమైన, పటిష్ఠమైన వ్యవస్థ లేకపోవడమే కారణమన్నది ఈ రంగంతో పరిచయం ఉన్న వారందరికీ తెలుసు.

జిఎస్‌టి కింద అమలులోకి తెచ్చిన ఈ-వే బిల్లులు 5 వేల రూపాయిల విలువకు మించిన సరకు రవాణా చేసే వాహనదారుల నుంచి వసూలు చేస్తారు. ఈ వసూళ్ళు పారదర్శకంగా జరగడం లేదన్నది జగద్విదితం. టోల్ ప్లాజాలు, టోల్ గేట్ల వద్ద సిబ్బందిపై దౌర్జన్యాలు చేయడం, చాలా చోట్ల టోల్ గేట్ సిబ్బంది రాజీ పడటం అంతటా కనిపిస్తున్న దృశ్యం. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్టవేయడానికీ, ఎగవేత దారులకు చెక్‌పెట్టేందుకూ ఈ-వే బిల్లుల వ్యవస్థను తెచ్చారు. అయితే, ఆనుపానులు చూసుకోకుండా హడావుడిగా ప్రవేశపెట్టే ఏ ప్రయత్నానికైనా ఆదిలోనే హంస పాదు తప్పదు. ఇప్పుడు జరిగింది అదే. కొందరు వ్యాపారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వాహనదారుల ఇబ్బందుల గురించిన వార్తలు, సరకు

రవాణాలో జరుగుతున్న జాప్యం మొదలైన అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తర్వాత వ్యవస్థ పూర్తి స్థాయిలో పనిచేయడం ప్రారంభమైన తర్వాతనే దీనిని అమలు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించింది. నిజానికి ఈ-వే బిల్లులు అమలులోకి వచ్చిన తర్వాత వేధింపులు ఎక్కువయ్యాయని పలువురు వ్యాపారస్తులు ప్రభుత్వానికి ఇప్పటికే ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి తన యంత్రాంగాన్ని అదుపు చేసుకునే సత్తా లేకపోవడం వల్లనే ఇలాంటి వన్నీ పరిణమిస్తున్నాయి. వాణిజ్య పన్నుల శాఖను బంగారు బాతుగా పరిగణించేవారు ఇప్పటికీ ఉన్నారు. అవినీతి, అక్రమాలకు నెలవుగా మారడం వల్లనే వాణిజ్య పన్ను స్థానే జిఎస్‌టిని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే, సరకు రవాణాలో సమస్యల పరిష్కారం కోసం ఈ-వే బిల్లువిధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం కింద జిఎస్‌టిలో నమోదు అయిన ప్రతి వ్యక్తి సరకుల రవాణాకుముందు పోర్టల్ లో తమ వివరాలను నమోదు చేసుకుంటే ఈ వే బిల్లులను ఆన్‌లైన్ నుంచి పొందవచ్చు. సరకు రవాణాచేసే వ్యక్తి ఈ-వే బిల్లు అసలును కానీ, జిరాక్స్ కాపీని కానీ తమ వెంట తీసుకుని వెళ్ళాలి. ఈ వే బిల్లు విధానంలో సరఫరా దారులు, కొనుగోలుదారులు, రవాణాదారులు ఉంటారు. వీరందరికీ ఈ కొత్త విధానం గురించి అవగాహన కల్పించాలి. సాధారణంగా సరకు రవాణాదారుల్లో అవగాహనతో పని చేసే వారే ఎక్కువ మంది ఉంటారు. ప్రభుత్వ అధికీకృత అధికారి సరకు రవాణాను మధ్యలో తనిఖీ చేసినప్పుడు ఈ వే పత్రం, నెంబర్ వివరాలు, వాహనాలతోని సరకులతో సరిపోల్చినప్పుడు తేడా వస్తే, ఏదో విధంగా వాహనాలను వదిలేయడానికి ఒప్పందాన్ని కుదుర్చుకుంటారు. ఇలాంటి చోట్లే అవినీతికి అవకాశం ఉంటుంది. ఏదో ఒక మిషపై సరకు రవాణా వాహనాన్ని గంటల తరబడి ఆపేస్తారు. అలా ఆపేసినప్పుడు రవాణాదారు కామన్ పోర్టల్‌లో పొందు పర్చాలన్న విషయం చాలా మందికి తెలియదు. అందువల్ల అధికారుల ఒత్తిడికి లొంగుతుంటారు. ఈ విధానాన్ని ఇంకా పారదర్శకంగా రూపొందించాల్సిన అవసరం ఉంది. బహుశా అందుకే ప్రభుత్వం నెట్ వర్క్ ను పటిష్ఠం చేసేందుకు వాయిదా వేసింది. ఇలాంటి బాలారిష్టాలు ఏ సంస్కరణలకైనా తప్పవన్న మాట నిజమే అయినా, ముందుగానే తగిన చర్యలు తీసుకుంటే ఇలాంటి అవరోధాలు ఏర్పడి ఉండేవి కావు. జిఎస్‌టి విషయంలోనూ, ఈ-వే బిల్లుల విషయంలోనూ ప్రభుత్వం తొందరపాటు స్పష్టంగా కనిపిస్తోంది.

పాఠకీయం

గవర్నమెంట్ సుగర్ టాక్


ఎన్నికల ముందు ఆఖరి పూర్తి స్థాయి బడ్జెట్‌ని ప్రభుత్వం ప్రకటించినట్టుగానే జనరంజకంగా తయారు చెయ్యలేదు గానీ తీపి కబుర్లతో కడుపు నింపింది. ఎన్నికల హామీలకు ముందుగా రిహార్సల్ వేసినట్టుంది తప్పితే ఖచ్చితమైన ఊరట ఎవరికీ ఇవ్వలేదు. హవాయి చెప్పులు వేసుకున్న ప్రతీ వారూ హవాయి యాత్ర చేసే విధంగా దేశీయ వాయు యానాన్ని ఐదు రెట్లు అభివృద్ధి చేస్తామని ఆర్థికమంత్రి చెప్పారు. రైతులకు కూడా దాదాపు అదే తరహా భరోసా. 2022 కల్లా వారి ఆదాయం రెట్టింపు చేస్తామని. ప్రస్తుతానికైతే హవాయి చెప్పుల్లో కాళ్ళు దూర్చి రాబోయే విమానం కోసం మబ్బుల వైపు చూడాలి. రైతులైతే 2022 సంవత్సరం ఎప్పటికొస్తుందో లెక్కలేయాలి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల కనుగుణంగా అన్ని పంటలకూ పెట్టుబడి ఖర్చుకి ఒకటిన్నర రెట్లుగా కనీస మద్దతు ధర నిర్ణయిస్తున్నట్టు ప్రకటించడం బాగుంది. ఎర్యావరణ మార్పుల ద్వారా 25 శాతం నష్టం జరుగుతుందన్న అంచనాల మధ్య, అందుకు తగ్గ ప్రణాళికలు, ముఖ్యంగా సాగునీటి అందుబాటుకి సంబంధించినవి లేవు. 30 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఎగుమతుల్ని 100 బిలియన్ డాలర్ల మేరకు పెంచుతామన్నది ఆశావహ దృక్పథమే తప్ప వాస్తవ అంచనా కాదు. వ్యవసాయిక సంక్షోభానికి ఈ బడ్జెట్ చూపించింది పైపై పూత వైద్యమే.

- డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

పట్టువిడుపులు... పెట్టుబడులు

ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ రాష్ట్రంలో విమర్శలు, ఆరోపణల వేడి పెరిగిపోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రంగా విమర్శల దాడి సాగుతోంది. ముఖ్యంగా, మిత్రపక్షంగా చెప్పుకుంటున్న బీజేపీ ప్రధాన విపక్షం వైకాపా కంటే అధికంగా అధికారపక్షాన్ని చికాకుపరుస్తోందనే చెప్పాలి. సారాంశం ఒక్కటే తమను లెక్కచేయడం లేదనే! ఇవ్వాల్సిన గౌరవమర్యాదలు ఆశించిన స్థాయిలో ఇవ్వడం లేదనే!! కేవలం ఏవేవో గణాంకాలు చెప్పి రాజకీయ విమర్శలు, ఆరోపణలు చేసినంత మాత్రాన ప్రజలను మెప్పించలేమన్న సంగతిని బీజేపీ రాష్ట్ర నాయత్వంలో కొందరు విస్మరిస్తున్నారు. తెలిసిన మరికొందరు వినోదం చూస్తున్నారు లేదా నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. ఈ విమర్శల్లో విశ్వసనీయతను ప్రజలు ఎంతవరకూ పట్టించుకుంటున్నారన్న అంశాన్ని గాలికి వదిలేశారు. చంద్రబాబుతో ఉన్న వ్యక్తిగత వైరం, లేదా బీజేపీలో అంతర్గత కుల వైషమ్యాలే ప్రధానంగా కనిపిస్తున్నాయని జనం భావించేవరకూ పరిస్థితి వెళ్లింది. నేల విడిచి సాము చేస్తే ఇలాగే ఉంటుంది మరి! రాష్ట్రం అడ్డగోలుగా విభజనకు గురైందన్న నిజాన్ని ఒప్పుకున్న బీజేపీ కేంద్ర నాయకత్వం, ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు అన్నివిధాలా ఆదుకుంటామని నాడు పార్లమెంటులోను, ప్రజల సాక్షిగా పలు వేదికలపై పదేపదే చెప్పుకొచ్చింది. మరి వాస్తవం ఏమిటి? జనసామాన్యానికి దీని గురించి ఎవరూ చెప్పనవసరం లేదు. కళ్లెదుట స్పష్టంగా కనిపిస్తూనే ఉంది! దీనిపై ఎవరెన్ని వివరణలు, సంజాయిషీలు లేదా రాష్ట్ర ప్రభుత్వం, తెలుగుదేశం అధినాయత్వంపై విమర్శలు, ఆరోపణలు చేసినంత మాత్రాన నిజం చెరిగిపోదు. రాజకీయాల్లో ఎవరూ శాశ్వత మిత్రులుగా, శత్రువులుగా ఉండరు. ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి ఆశించిన గౌరవమర్యాదలు లభించకపోయినా లేదా మరింతగా ఆశించినా అసహనం మొదలవుతుంది! ఇందులో రాష్ట్ర ప్రజల ప్రమేయం ఉండదు... వారి ఇబ్బందులు పట్టవు! వారికోసమే అన్నట్టుగా విమర్శలు చెలరేగడమే రాజకీయనేతల చాణక్యం! రాష్ట్రాన్ని హేతుబద్ధంగా విభజించలేదనీ, తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనీ కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హస్తిన చుట్టూ ఇప్పటికి 42 సార్లు తిరిగారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా ఉన్నంతకాలం పరిస్థితి ఆశాజనకంగానే కనిపించింది. ఆయన ఉపరాష్ట్రపతి పదవిని చేపట్టిన తర్వాత పెద్ద దిక్కును కోల్పోయామన్న బాధ తెదేపా నాయకుల్లో స్పష్టంగా వెల్లడైంది. సరిగ్గా అప్పటి నుంచే రాష్ట్ర బీజేపీ నేతల నుంచి దాడి ఎక్కువైంది. ఎవరెంత రెచ్చగొట్టే విధంగా మాట్లాడినా చంద్రబాబు నాయుడు సహనాన్నే ఆశ్రయించారు.

తెదేపా నేతలను కూడా సాధ్యమైనంత నియంత్రణలోనే ఉంచారు. సహనం ప్రదర్శించే కొద్దీ బీజేపీ విమర్శల తీవ్రతను పెంచింది. కేంద్ర నాయకత్వం నుంచి ఎటువంటి వారింపూ లేకపోవడంతో ఏకంగా చంద్రబాబు నాయుడినే కవ్వించేలా కొందరు మాట్లాడడం మొదలెట్టారు. చివరకు చంద్రబాబు నోటి నుంచే తమతో తెగదెంపులు మాట కోసం ఎదురుచూస్తున్నామని బీజేపీ నేతలు చెప్పేంత వరకూ పరిస్థితి వెళ్లింది. వాస్తవానికి చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని కలిసిన ప్రతిసారి ఎంతో అణకువ ప్రదర్శిస్తూ.. రాష్ట్ర అవసరాలను తీర్చాలని కోరుతూ వస్తున్న విషయాన్ని మాధ్యమాల ద్వారా రాష్ట్ర ప్రజానీకం గమనిస్తూనే ఉంది. ఆయా కేంద్ర మంత్రులను కలిసిన ప్రతిసారి వరుస విజ్ఞప్తులు చేసి వస్తూనే ఉన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, ముందస్తు ప్రణాళికల రూపకల్పనలు, అధికార యంత్రాంగం సహకారంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఎటువంటి ఆటంకం కలుగకుండా నెట్టుకొస్తూనే ఉన్నారు. రుణాల మాఫీ నుంచి అన్ని హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వచ్చారు. ఇదంతా సర్వసామాన్యమైన విషయంగా కొట్టేయలేం. చించిన విస్తరిలా తయారైన రాష్ట్రాన్ని రెండంకెల వృద్ధి రేటుతో ముందుకు నడిపించడాన్ని చూసి ఆర్థికవేత్తలే ఆచ్చెరువొందారు. నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడైతే, మీరు రెండెంకెల వృద్ధి సాధిస్తున్నారు... జాతీయ తలసరి కంటే అధికంగా రాష్ట్ర తలసరి ఆదాయం ఉంది... మీకు మీరే అభివృద్ధి చేసుకోగల సత్తా ఉంది అని ఓ పక్క పొగుడుతూనే, పరోక్షంగా కేంద్ర సాయం ఇంకెందుకన్నట్టు ఇటీవలి కలెక్టర్ల సదస్సులో వ్యాఖ్యానించారు. పోషక పదార్థాలు అధికంగా ఉన్న గంజి నీళ్లు తాగుతున్నారు కదా... మీకింకా భోజనం ఎందుకన్నట్టు ఉంది ఆయన వైఖరి! ఇది ఆయన సొంత అభిప్రాయమా లేక కేంద్ర ప్రభావం ఉందా అన్నది తేలాల్సి ఉంది! వాస్తవానికి నంద్యాల ఉప ఎన్నికకు ముందు నుంచే బీజేపీ కేంద్ర నాయకత్వ వైఖరిలో మార్పు కొట్టొచ్చినట్టు కనిపించింది. నంద్యాలలో ఊహించిన దానికంటే భారీ మెజారిటీతో తెలుగుదేశం గెలుపొందింది. ఈ నేపథ్యంలోనే తెలుగుదేశం తమకు విలువైన మిత్రపక్షం అంటూ ప్రధాని మోడీ పేర్కొనడంతో రాష్ట్ర బీజేపీ నేతల్లో కొంత మార్పు కనిపించింది. ఆ తర్వాత పరిణామాలతో పరిస్థితి మరింత దిగజారడం మొదలైంది.



పోలవరం ఆకస్మికంగా తెరపైకి వచ్చింది. ఆశించిన రీతిలో ట్రాన్స్‌ట్రాయ్ పనులు చేయడం లేదనీ, విపరీతమైన ఆలస్యమవుతోందనీ, తక్షణం మార్చకపోతే నిర్దేశిత కాలపరిమితిలో ప్రాజెక్టు పూర్తి చేయడం అసాధ్యమనే అభిప్రాయానికి వచ్చారు. కొన్ని పనులు కొత్త కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని నిర్ణయించారు. టెండర్లు పిలిచారు. సరిగ్గా ఇక్కడే కేంద్రం మెలిక వేసింది. అప్పర్ కాఫర్ డ్యామ్ నిర్మాణంపై అభ్యంతరాలు చెప్పింది. కాంట్రాక్టర్‌ను మారిస్తే మరింత భారం పడుతుందని పేర్కొంది. అయినా నిబ్బరం కోల్పోని ముఖ్యమంత్రి ప్రొటోకాల్‌ని పక్కనపెట్టి స్వయంగా నాగపూర్ వెళ్లి కేంద్రమంత్రి గడ్కరీని సంప్రతించారు. ఆ తర్వాత నెల గడువు ఇవ్వడం, కొత్త కాంట్రాక్టర్ ముందుకు రావడం, పనులు ప్రారంభం కావడం చకచకా అయిపోయాయి. ప్రాజెక్టు నిర్మాణం ఆర్నెల్లు వెనుకపడిపోయింది. చంద్రబాబు ప్రాజెక్టు కంటే కాంట్రాక్టర్ల నుంచి కమిషన్‌కే ప్రాధాన్యమిస్తున్నారనే స్థాయి వరకూ ఆరోపణలు శృతి మించాయి. ఇక ప్రత్యేకహోదా స్థాయి నుంచి కారణాలు ఏమైతేనేం ప్రత్యేక ప్యాకేజీకి కూడా చంద్రబాబు అంగీకరించారు. ఎంతకాలం గడిచినా ఆ హామీకి చట్టబద్ధత లభించలేదు. ఆశించిన స్థాయిలో నిధులు విడుదల కాలేదు. తమ గణాంకాల ప్రకారం, ఇచ్చిన హామీల మేరకు లోటుతో సహా నిధులను దాదాపు ఇచ్చేశామని కేంద్రమంత్రులు ఏకంగా పార్లమెంటులోనే ప్రకటించారు. గణాంకాలు ఎవరెన్ని వల్లె వేసినా రాష్ట్రంలో పరిస్థితి ఏమాత్రం మారలేదన్నది వాస్తవమే కదా! ఇక ప్రత్యేక ప్యాకేజీ అంశం నుంచి రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను రుణాల రూపంలో కాకుండా గ్రాంట్ల రూపంలో మంజూరు చేయాలనే స్థాయి వరకూ చంద్రబాబు తగ్గి (సర్దుకుపోయి?) పదేపదే విజ్ఞప్తులు చేసే పరిస్థితి వచ్చింది. సమన్వయంతో, సహనంతో వ్యవహరిస్తూ సాధ్యమైనన్ని నిధులను రాబట్టుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తుండగా, అసహాయతను బలహీనతగా లెక్కగట్టి కేంద్రం వ్యవహరిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మీకున్నంత సహనం, ఓర్పు ప్రజలకు లేదు... సరైన సమయంలో సరైన బుద్ధి చెబుతారని ఇటీవల ప్రజాప్రతినిధుల సమావేశంలో అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాస్ ఒకింత ఆవేశం, మరొకింత ఆవేదనతో పేర్కొన్న విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. ప్రజల్లో గూడుకట్టుకుంటున్న అసంతృప్తిని కేంద్రం గుర్తించడం లేదన్నదే ఇందులో ముఖ్య విషయం. ఇదెంతవరకూ వెళుతుందన్నది ఆసక్తికరమే. కటీఫ్ చెప్పుకుంటారా? సమీకరణాలు మారతాయా? లేక సర్దుబాటు (సీట్లు!) కుదురుతుందా అన్నది త్వరలోనే తేలనుంది!

ఇక రాష్ట్రంలో పెట్టుబడుల విషయానికి వస్తే, చంద్రబాబు కేవలం తన నల్లడబ్బును దాచుకోవడానికే విదేశీ పర్యటనలు చేస్తున్నారని, పెట్టుబడుల కోసమంటూ ఇప్పటికే రూ.250 కోట్ల ప్రజా ధనాన్ని ప్రత్యేక విమానాలు, లగ్జరీల కోసం చంద్రబాబు బృందం వృధా చేసిందని ప్రధాన ప్రతిపక్షం ఆరోపణ! వాస్తవానికి గత మూడేళ్లలో విశాఖపట్టణం సదస్సులలో రూ.13.5 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరినట్టు ప్రచారంలోకి వచ్చింది. ఇందులో ఎంతమేరకు క్షేత్రస్థాయిలో ప్రతిఫలించాయన్నది సహేతుకమైన ప్రశ్నే! రాష్ట్రానికి ఇప్పటివరకూ 981 పరిశ్రమలు వచ్చాయని, మొత్తం ఏడు లక్షల 25 వేల మందికి ఉపాధి కలిగిందని ఇటీవల ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పెడతామని కూడా చెప్పారు. దీనిపై ప్రతిపక్షాలు నిలదీస్తే నిజం నిగ్గు తేలుతుంది. ఈ గణాంకాలన్నీ ఎలా ఉన్నా, ఆటోమొబైల్ దిగ్గజం కియా నుంచి పలు ప్రఖ్యాత ఐటీ కంపెనీలు ఎన్నో ఇప్పటికే రాష్ట్రంలో కొలువుతీరాయి. మరికొన్ని అదే బాటలో ఉన్నాయి. ఇది కాదనలేని సత్యం. ఏమీలేని స్థాయి నుంచి ఈ స్థాయిలో సాధించడం మెచ్చదగిన విషయమే కదా?! ఇదంతా ఓ నిరంతర ప్రయత్నం. అనువైన వాతావరణం సృష్టించాలంటే అందుకు తగినట్లు ముందుగా కొన్ని ముందస్తు ఏర్పాట్లు తప్పనిసరి. పంట పండించాలంటే అదునుకు దుక్కి దున్నాలి కదా? ప్రయివేటు, కార్పొరేట్ పెట్టుబడులు పెరగాలంటే ముందుగా ప్రభుత్వాలే అందుకు తగిన కృషి చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించాలి. అప్పుడే ప్రయివేటు రంగానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది. అనుబంధ పరిశ్రమలు వస్తాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మౌలిక వసతుల ఏర్పాటువల్లే ఇదంతా సాధ్యం. అందుకు కొన్ని రాయితీలు, ఆకర్షణలను ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఇందుకోసం చేస్తున్న ప్రయత్నాలకు డబ్బు వృధా చేస్తున్నారని ముడి పెట్టి ఆరోపణలు చేయడం రాజకీయ అపరిపక్వత్వానికి నిదర్శనమే! విభజనచట్టంలోని హామీలను నెరవేర్చినట్టయితే, హైదరాబాద్‌తో కోల్పోయిన కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటినీ నవ్యాంధ్రలోనూ స్థాపిస్తే మరింత ఊపు ఇప్పటికే వచ్చి ఉండేది. దీనిపై నోరు మెదపకుండా చంద్రబాబు తన లగ్జరీల కోసం జనం సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని ఆరోపించడం ఎంతవరకూ సబబు?

దావోస్ పర్యటన సందర్భంగా చంద్రబాబును కలిసిన మహీంద్ర, అలీబాబా వంటి దిగ్గజాలు చేసిన కామెంట్లు ఈ ప్రయత్నాలు ఎంతవరకూ ఫలించవచ్చో పరోక్షంగా సూచిస్తున్నాయి! చంద్రబాబు వంటి ప్రభుత్వాధినేత ఒక వాణిజ్య సంస్థ సీఈఓగా, టెక్ కంపెనీ అధినేతగా ఇంత సాంకేతిక, వ్యాపార మెలకువలను ప్రదర్శించడం తమకు ఎంతో స్ఫూర్తిదాయకమని ట్వీట్ చేయడం విశేషం. చేసిన ప్రయత్నాలన్నీ ఫలించకపోవచ్చు... కాని, మళ్లీ పదేపదే ప్రయత్నిస్తూనే ఉండలి కదా? రాష్ట్రాన్ని హేతుబద్ధత లేకుండా విభజించడం వల్లే లోటు బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్, మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఏర్పడ్డాయని, ఇంత భారీగా స్ట్రక్చరల్ (నిర్మాణ) లోటు ఉందని నాడు చంద్రబాబు శ్వేతపత్రం ఇస్తే, రెండు కళ్ల సిద్ధాంతమని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా నియమ నిబంధనల చట్రం నుంచి కేంద్రం బయటికి వచ్చి ఏదో ఒక పరిష్కారం చూపకపోతే జనం మదిలో శాశ్వతంగా కాంగ్రెస్‌కు పడిన ముద్రే బీజేపీ కూడా వేసుకునే ప్రమాదం ఉంది! వాస్తవానికి దూరమై... అవాస్తవాలను నమ్మిస్తూ... గుర్తింపు కోసం తహతహలాడుతూ, ఎదుటివారికి లభిస్తున్న ఆదరణ చూసి అసూయతో రగిలిపోతూ ఆరోపణలు చేస్తే మరింతగా విశ్వసనీయత దెబ్బతింటుంది. ఈ నగ్నసత్యాన్ని రాజకీయనేతలు మరువకూడదు. మరోపక్క మీడియాలో కూడా హ్యాండ్ అవుట్ (ప్రకటనల) జర్నలిజం వర్ధిల్లుతోంది! ప్రభుత్వం కాని, ప్రతిపక్షం కాని, ఎవరేం చెబితే అది, ఏం ప్రకటిస్తే దాన్ని ఏమాత్రం విశ్లేషణ, విచక్షణ, సాధ్యాసాధ్యాల విచారణ లేకుండానే ఊదరగొట్టేస్తూ, జనంలో మరింత గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి.

- గుళ్లపల్లి దివ్వాబాబు
949 2424 829

అన్నీ ఆ తాను ముక్కలేనా?


కాలం కలిసి వస్తోంది కమల దళానికి. కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు 'మోదీ.. షా' ద్వయం తమాషా బాగా నడుస్తోంది. ముస్లిం పునాదుల మీద లేచిన పి.డి.పి (జమ్మూ, కశ్మీర్) నుంచి ద్రవిడ సంస్కృతికి కేంద్రంగా ఉన్న తమిళనాడు వరకు.. ప్రస్తుతానికి 'నమో' మంత్రానికి చింతకాయలు రాలుతున్నాయి. ముందు ముందు మరిన్ని రాలే సూచనలున్నాయి. విదేశీ మూలాలున్న అధినేతలను కూడా ఆలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేయించే శక్తి భాజపాకి 'మోదీ-షా' మంత్రాంగం వల్ల కొత్తగా సిద్ధించింది.

ఇందిర అత్యవసర పరిస్థితి (1975) కాలం నాటికి భాజపా మూల రూపం జన సంఘ్‌ది నామమాత్రపు ఉనికి. జయప్రకాశ్ నారాయణ అప్పటి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కూడగట్టిన జనతా పార్టీలోకి మిగతా అన్ని చిన్న పక్షాల మాదిరే జన్ సంఘ్ అడుగు పెట్టింది. కాకపోతే జన్ సంఘ్ ఆ మిగతా చిన్న పార్టీలకన్నా విభిన్నమైన పోకడలు పోయింది తదనంతరం. తన 'కాంగ్రెస్ వ్యతిరేక' ముద్రను బలంగా కొనసాగించడం వల్ల ఇవాళ్టి మోదీ మార్కు 'భాజపా' రూపం సంతరించుకుంది.

భాజపా వాస్తవ అస్తిత్వం ప్రజాస్వామ్య విలువలలో కన్నా హిందూత్వ సిద్ధాంతాలలోనే కనిపిస్తుంది. 'మతవాద ఫాసిస్టు పారా మిలటరీ'గా వామపక్ష నేత కామ్రేడ్ సుందరయ్య పేర్కొన్న 'రాష్ట్రీయ స్వయం సేవక్' కు ప్రజాస్వామ్య ముసుగు భారతీయ జనతా పార్టీ! ముస్లిముల ప్రాబల్యం అధికంగా గల ప్రాంతాలలో మైనారిటీ హిందువుల హక్కుల పరిరక్షణకు స్థాపించిన జన సంఘ్.. మైనారిటీలే మెజారిటీగా ఉన్న ప్రాంతాలలో సైతం ఇవాళ తన ప్రభంజనాన్ని కొనసాగించడం ఆశ్చర్యం కలిగించే విషయమే! ఒకప్పటి తన మరగుజ్జు రూపాన్ని విసర్జించి.. ప్రస్తుతం తన చుట్టూ గల మరగుజ్జు పార్టీలను క్రమంగా కబళించే ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. ప్రధాన ప్రతిపక్షంగా గతంలో తాను ప్రవచించిన ధర్మపన్నాలన్నింటినీ తానే కాలరాస్తున్నదన్న విమర్శ భాజపా మీద చాలా కాలంగా రాజకీయంగా వెల్లువెత్తుతున్నదే! పార్టీ ప్రజాస్వామ్యంలో రాజకీయ పక్షాల విమర్శలకు ఆట్టే విలువుండదు. ప్రజలు విశ్వసించాలి. అప్పుడే ఏ వాదనకైనా ప్రాణం వచ్చేది.

గతంలోనూ భాజపా కేంద్రకంగా ఎన్ డి యే కూటమి నిండు ఐదేళ్ల పాటు పాలన చేసిన సందర్భం లేకపోలేదు. వాజ్‌పేయి నేతృత్వంలో సాగిన ఆ ప్రస్థానానికి.. మోదీ నాయకత్వంలో ప్రస్తుతం సాగుతున్న ప్రస్థానానికి పోలికే లేదు. అధికారమే పరమావధిగా సాగే రాజకీయ పోరాటాలలో విలువలను గురించి చర్చించడం.. గొంగటి బువ్వలో వెంట్రుకలు ఏరడం వంటిది! గతంలో కాంగ్రెస్ పార్టీ చూపించిన దారుల్లోనే ప్రస్తుతం భాజపా మరింత దూకుడుగా ముందుకు పోతున్నదన్న వాదనా ఉంది. అదీ పూర్తిగా కాదనలేని వాస్తవమేగా!

హిందూ ఆధిపత్య వాదానికి రాజకీయపక్ష రూపం వివిధ ప్రాంతాలలో విస్తరింప చేసే బాధ్యత, నిబద్ధతగల తన పూర్తికాల కార్యకర్తలకు సోపడం ఆరెస్సెస్ మొదటి నుంచి పాటిస్తోన్న నిర్మాణ కార్యక్రమాలలో ఒకటి. ఆ క్రమంలోనే నలభై ఏళ్ల కిందట ఉత్తర భారతంలోని హర్యానా, పంజాబ్, హెచ్.పి రాష్ట్రాల బాధ్యతలు మోదీకి అప్పగించారు. వాజపేయి మొదటి స్వల్ప కాలిక ప్రభుత్వానికి అకాలీ దళ్ మద్దతు కూడగట్టడం అంత ఆషామాషీగా సాగిన వ్యవహారం కాదు అప్పట్లో. అసలు ఉనికిలోనేలేని భాజపాని విస్తృత ప్రజాసంబంధాల ద్వారా చండీగఢ్ ప్రజానీకానికి పరిచయం చేసిన ఘనత మోదీదే. అప్పటి నగర పాలిక ఎన్నికల్లో అకాలీ దళ్ తో పొత్తు సుసాధ్యం చేయడం.. అఖండ విజయం సాధించడం.. తదుపరి లోక్ సభ ఎన్నికల్లోనూ చండీగఢ్‌ను కైవసం చేసుకోవడం వంటి విన్యాసాల వెనకున్న మోదీ పట్టుదలను కొట్టిపారేయలేం. పంజాబ్ రాష్ట్రంలో ఏర్పడిన అకాలీదళ్-బిజెపి సంకీర్ణ ప్రభుత్వం వెనకా మోదీ నిరంతర కృషి దాగుంది. హర్యానాలోనూ అదే విజయగాథ. మోదీ ముఖ్యమంత్రి బాధ్యతలు తీసుకున్న 1995కి నాలుగేళ్ల ముందు లోకసభ ఎన్నికలు జరిగాయి. భాజపా నిలబడిన పది సీట్లలో ఒక్కదానిలో మాత్రమే ధరావత్తు దక్కిన దీన స్థితి. అసెంబ్లీ ఎన్నికల్లో 80 సీట్లకు గాను అతి కష్టం మీద కేవలం రెండు మాత్రమే సాధించిన దయనీయ పరిస్థితి. వాస్తవ పరిస్థితులను వెంటనే ఆకళింపు చేసుకొనే ఇంగితం రాజకీయాల్లో నేతలకి ఎంతో అవసరం. ఆ ప్రత్యేక గ్రాహక సామర్థ్యం పుష్కలంగా ఉండబట్టే పడబోయినప్పుడల్లా మోదీ తట్టుకొని లేచి నిలబెడుతున్నది ఇప్పటి దాకా. అప్పుడూ ఆ ఇంగితం వల్లనే బన్సీలాల్ 'హర్యానా వికాస్ కాంగ్రెస్' తో పొత్తుకు సిద్ధపడి 1996 లోకసభ ఎన్నికల్లో భాజపాకి ఆరింట నాలుగు సీట్లు సాధించి పెట్టింది. అసెంబ్లీలో సైతం సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది భాజపా. రాజకీయ పక్షాలకి అధికారమే పరమావధిగా ఉండితీరాలని గట్టిగా నమ్మే వర్గానికి చెందిన నేత మోదీ. ఆ అధికారం నిలబెట్టుకొనేందుకే బన్సీలాల్‌కు చెయ్యిచ్చి.. చౌతాలాతో చేయి కలిపేందుకు ఇసుమంతైనా జంకలేదు మోదీ. తాజాగా.. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఏర్పాటు ప్రహసనం వెనక మోదీ నిర్వహించిన ప్రచ్ఛన్న కీలకపాత్ర ఆ పాత మోడల్ నుంచి మెరుగు పెట్టినదే!



చిన్న పార్టీలని మింగి బలపడటం జాతీయ పార్టీలకు కొత్తేమీ కాదీ దేశంలో. గతంలో కాంగ్రెసు చూపించిన బాటలోనే భాజపా చురుకుగా అడుగులు వేస్తున్నదిప్పుడు. మతపరంగా హిందూ జనభా అధికం ఈ దేశంలో. మత విశ్వాసులలో భావోద్వేగాలను రెచ్చగొట్టి తద్వారా రాజ్యాధికారం దక్కించుకోవడం అత్యంత సులువైన మార్గం వాస్తవానికి. ప్రజాస్వామిక, లౌకిక పునాదుల మీద మాత్రమే ప్రభుత్వాలను నడిపించుకోవాలని సంకల్పం చెప్పుకున్న లౌకిక దేశం మనది. స్వతంత్ర భారతావని ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పండిట్ వంశానికి చెందినప్పటికీ సోషలిష్టు భావాలు పుణికి పుచ్చుకున్న నేత. అనేక భావజాలాల సంగమ ప్రవాహంగా సాగే కాంగ్రెసును ఒకే తాటి మీద నడిపించే శక్తి ఒక్క 'సెక్యులరిజం'లోనే ఉంటుంది సహజంగానే! హిందువులూ తమను తాము భారతీయులలో ఒక అంతర్భాగంగా అంగీకరించిన నేపథ్యంలో.. మరో తరహా మతవాదానికి ఆధిపత్యం కట్టబెట్టడం అంత సులువు కాదు. 'భారతీయులంటేనే హిందువులు. అందుకు సమ్మతించని వారు ఈ దేశ పౌరులు కాబోరు' అనే మతకోణం నుంచి పుట్టుకొచ్చిన రాజకీయ పార్టీ పూర్వ జన సంఘ్. చాప కింద నీరులా ఆ మతవాదం విస్తరిస్తూ వస్తున్నా అయోధ్యలో 'రామమందిర పునర్నిర్మాణం' ఓ ఉద్యమంలా ఉద్ధృతమయే దాకా జనసామాన్యానికి మతాన్నీ ఒక రాజకీయ కోణంలో చూడాలన్న స్పృహ కలిగింది లేదు. వాజపేయి ఆధ్వర్యంలో ఎన్ డి యే రాజ్యాధికారం అందుకోవడంలో అంతకు ముందు అద్వానీ సారథ్యంలో సాగిన 'రథయాత్ర' ఒక ప్రధాన ప్రేరేపణ. నాడు అద్వానీ బృందం ఆరంభించిన ఆ భావోద్వేగ ప్రధాన ఎత్తుగడలనే నేడు 'మోదీ.. షా' ద్వయం మరింత ఉద్ధృతంగా ముందుకు తీసుకొస్తోంది.

యూపియే కూటమిపై గల వ్యతిరేకత కారణంగా మాత్రమే మరో ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో జనం 2014 సాధారణ ఎన్నికల్లో మోదీ భాజపాకి అధికారం కట్టబెట్టింది. ఎన్ డి యె కేంద్రంలో అధికారానికి వచ్చి మూడున్నరేండ్లు గడిచిపోయాయి. భాజపా ముసుగు మత ఎజెండా సామాన్యుడి అవగాహనలోకి సంపూర్ణంగా రావడమే లేదు. తెర ముందు ఊకదంపుడు ప్రజా ప్రయోజన పథకాల ముమ్మర ప్రచారం. అవి విఫలమైన ఆఖరి క్షణాల్లో గెలుపు కోసం కుల, మత, ప్రాంతాలపరమైన భావోద్వేగాలను సైతం రెచ్చగొట్టేందుకు సిద్ధపడడం! తాజాగా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో చచ్చీ చెడిన మోదీకి చివరికి అపజయాల గండం నుంచి బైట పడవేసింది ఈ తరహా అప్రజాస్వామిక సెంటిమెంటల్ 'పెట్టీ' రాజకీయ ఎత్తుగడలే! ఇప్పటి వరకు సాగిన అన్ని ఎన్నికలలో 'మోదీ-షా'ల బృందం ఈ తరహా వ్యూహాలనే చాప కింద నీరులా అమలు చేసింది. అస్సాం ఎన్నికల్లో విజయానికి ఉపజాతి భావోద్వేగాలను వాడుకొంది. మణిపూర్‌లో అధికారం ఆ దారిలో పోయే చేజిక్కించుకొంది. అదే మార్గంలో మరింత దూకుడుగా పోయి మేఘాలయ, నాగాలాండ్, త్రిపురల్లో కూడా పాగా వెయ్యాలని వ్యూహాలు పన్నుతోంది. అస్సాంలో అస్సాం గణ పరిషద్, బోడో పీపుల్స్ ఫ్రంటులతో కలిపి 'ఈశాన్య ప్రజాస్వామ్య కూటమి' మిషతో కొత్త నాటకానికి తెర లేపింది.

చిన్న పార్టీలకు పెద్ద గండమే!

గతంలో జాతీయ పార్టీలతో కలసి నడిచిన చిల్లర పార్టీలు అనంతర కాలంలో ఉనికిలో కూడా గల్లంతయ్యాయి. హర్యానాలో వికాస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనమై అంతర్థానమైంది. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారాజ్యం పార్టీదీ అదే దుస్థితి. బన్సీలాల్ స్వీయ ప్రయోజనాలకు విఘాతం ఏర్పడిందన్న కినుకతో స్వంత కుంపటి మీద కాంగ్రెసుకి వ్యతిరేకంగా భాజపాకి వండి వార్చబోయాడు. చివరికేమయింది? నస్మరంతిగా కనుమరుగు అయిపోయాడు!

ప్రస్తుతానికి వస్తే..

పంజాబులో అకాలీదళ్‌తో బిజెపి చెలిమి సవ్యంగా సాగడం లేదు. 1984 నాటి సిక్కుల ఊచకోత కేసును తిరగదోడటం వెనక సిక్కుల మనసు దోచుకోవాలన్న మత ఎజెండానే దాగుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈశాన్యంలో బిజెపితో చేతులు కలిపిన చిన్న పార్టీలకు ముందు ముందు ప్రాణ గండం తప్పక పోవచ్చు. కాశ్మీర్‌లో బిజెపితో చేతులు కలిపిన పిడిపి ఇప్పటికే మెజారిటీ ముస్లింల వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం భాజపాతో పడుతున్న తిప్పలు బైటికి చెప్పుకోలేనివి. నాలుగు ఓట్లు రాల్చగలిగిన సత్తా ఉంటే చాలు.. ప్రజాస్వామ్యం, విలువలతో ప్రమేయం పెట్టుకోకుండా ఏ పార్టీతో అయినా అంటకాగేందుకు మోదీ-షా ద్వయం నిత్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తమిళనాడులో అన్నా డిఎంకె, డియంకెలతో భంగపాటు ఎదురైన తరువాత ప్రస్తుతం రజనీ కొత్త పార్టీ వైపు దృష్టిసారిస్తోంది. తెలంగాణాలో పాటించే ఎత్తుగడలని గుప్పిట తెరవకుండా మూసి ఉంచింది. ఢిల్లీ సి.యం కేజ్రీవాల్‌ని ఓ రాజకీయ జోకరుగా అభాసు పాల్జేయడంలో భాజపా దాదాపు సఫలమయింది. పశ్చిమ బెంగాల్ లో ప్రస్తుతం పరిస్థితి కాస్త అటూ ఇటూగా ఉన్నా రాబోయే ఎన్నికల నాటికి మమతా బెనర్జీకి ముచ్చెమటలు పట్టించనుందని కొన్ని సర్వేలు హెచ్చరిస్తున్నాయి!

తాజాగా..

మహారాష్ట్రలో శివసేన ప్రస్తుతం తృణమూల్ బాటే పట్టి భాజపాతో సంబంధాలు పూర్తిగా తెగతెంపులు చేసుకొంది. చిరకాలంగా మిత్రభావంతో నమ్మకంగా మెలిగిన తమని నిర్లక్ష్యం చేస్తోందని శివసేన కినుక. బైటికి 'కాంగ్రెస్ ముక్త భారత్' తమ ధ్యేయంగా చెప్పుకుంటున్నా .. వాస్తవంలో జరుగుతున్నది అందుకు విరుద్ధం. శత్రు మిత్ర బేధం లేకుండా ప్రాంతీయ పార్టీలు అన్నింటినీ హననం చేసి ఆయా స్థానాలలో తమ హిందూ ఆధిపత్య భావజాలాన్ని శాశ్వతంగా సుస్థిర పరచుకోవడమే అంతిమ లక్ష్యంగా 'మోదీ-షా' బృందం వేస్తున్న అడుగులను బట్టి అర్థం చేసుకోవచ్చు. లాభసాటి పదవులను పాత తేదీ నుంచి కొనసాగించవచ్చన్న చట్టాన్ని తెచ్చింది కాంగ్రెస్ హయాం నాటి యూపియే కూటమే కదా! ఆ క్లాజును అడ్డం పెట్టుకుని కేజ్రీవాల్ సర్కారు తెచ్చిన బిల్లు తిరస్కరణకు గురయింది. చట్టబద్ధం కాని పాలన కొనసాగుతున్నప్పుడు.. న్యాయపరంగా నిలవరించే స్వతంత్ర సంస్థ న్యాయవవస్థ, హేతుబద్ధతను బోనులో నిలబెట్టి ప్రశ్నించవలసిన ఆ అత్యున్నత వ్యవస్థే ఇప్పుడు బోనులో నిలబడే పలు ప్రశ్నలకు స్పందించవలసిన అరుదైన దృశ్యం ఆవిష్కృతమవుతోంది! అన్నీ ఆ తానులో ముక్కలుగానే బైటపడుతున్నప్పుడు ఎవర్నని ప్రత్యేకంగా వేలెత్తి చూపడం?

- కర్లపాలెం హనుమంతరావు
81422 83676

సుప్రీంకు బోఫోర్స్

● 2005 ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ పిటిషన్

● హిందుజా సోదరులపై ఆరోపణలు ● రూ.64 కోట్ల కుంభకోణం మరోసారి తెరపైకి



న్యూఢిల్లీ: మూడు దశాబ్దాల నాటి బోఫోర్స్ కేసుపై సీబీఐ ఎట్టకేలకు సర్వోన్నత న్యాయస్థానం తలుపుతట్టింది. 2005 లో ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. బోఫోర్స్ కుంభకోణంలో సీబీఐ అభియోగాలు మోపిన వారందరికీ ఢిల్లీ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో నాడు సీబీఐ మరో అడుగు ముందుకేయలేకపోయింది. అయితే 2005 లోనే ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ నాయకుడు అజయ్ అగర్వాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ..90 రోజుల్లో సీబీఐ స్పందించకపోవడంతో ఆ కేసు మరుగునపడింది. ఈ కేసులో సీబీఐ సుప్రీంకోర్టుకు వెళ్లేముందు ప్రభుత్వ అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ను సంప్రదించగా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేసిన బీజేపీ నాయకుడు అజయ్ అగర్వాల్ ను కూడా సంప్రదిస్తే మరిన్ని వివరాలు తెలియవచ్చని సలహా ఇచ్చారు.న్యాయశాఖ అధికారులను కూడా కలిసిన తర్వాతే సీబీఐ సర్వోన్నత న్యాయస్థానం ముందుకు వెళ్లినట్లు సమాచారం. బోఫోర్స్ వ్యవహారంలో నిర్దోషులుగా తేలిన వారిపై అభియోగాలు మోపేందుకు తమ వద్ద సరైన సాక్షాలు వున్నాయని సీబీఐ పేర్కొనడంతో న్యాయనిపుణులు కూడా ఒకే చెప్పినట్లు తెలుస్తోంది.

అసలేంటీ బోఫోర్స్

భారత సైన్యానికి 410 హోవిట్జర్ గన్ లను సరఫరా చేసేందుకు స్వీడన్ కు చెందిన బోఫోర్స్ కంపెనీ 1986 మార్చి 24న భారత్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి బోఫోర్స్ కంపెనీ ముడుపులు ఇచ్చిందంటూ 1987 ఏప్రిల్ 16న స్వీడిష్ రేడియో చేసిన ప్రకటన భారత్‌లో ప్రకంపనలు సృష్టించింది. అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ సహా పలువురు ప్రముఖులు బోఫోర్స్ కంపెనీ వద్ద ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో 1990 జనవరి 22న బోఫోర్స్ వ్యవహారంపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ ఒప్పందానికి రూ.64 కోట్లు చేతులు మారినట్లు బోఫోర్స్ కంపెనీ ప్రెసిడెంట్ మార్టిన్ ఆర్డోబో, మధ్యవర్తులుగా వ్యవహరించిన హిందూజా సోదరులు,భారత ప్రభుత్వ ఉన్నతాధికారులను ప్రతివాదులుగా చేర్చింది. అయితే 2004 ఫిబ్రవరి 4నఢిల్లీ హైకోర్టు ఈ కేసునుంచి నాటి ప్రధాని రాజీవ్ గాంధీకి విముక్తి కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి కపూర్ తీర్పునిచ్చారు...బోఫోర్స్ కంపెనీపై అభియోగాలు నమోదు చేయాలని ఆదేశించారు.. మరోవైపు యూరప్ కు చెందిన హిందూజ సోదరులపై మోపిన అభియోగాలను 2005 మే 31న ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. అయితే అదే ఏడాది బీజేపీ నాయకుడు, న్యాయవాది అజయ్ కుమార్ అగర్వాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అగర్వాల్ పిటిషన్ ను సుప్రీంకోర్టు స్వీకరించినప్పటికీ 12 ఏళ్ల తర్వాత విచారణకు అంగీకరించడంతో బోఫోర్స్ కుంభకోణంపై సీబీఐ మరోసారి దృష్టిపెట్టింది.

ఆరోగ్య భద్రత పథకం అమలు ఖాయం

● పూర్తిగా నగదు రహితం ● రూ.2 వేల కోట్ల ప్రారంభ నిధితో వచ్చే ఏడాది అమలు చేస్తాం ● ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టీకరణ ● ఆర్థిక ఇబ్బందులు లేవు, ఇతర శాఖలతో కసరత్తు : ఆరోగ్య మంత్రి జె.పి.నడ్డా హామీ

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన జాతీయ ఆరోగ్య భద్రత పథకం (ఎన్‌హెచ్‌పిఎస్) పై సందేహాలను నివృత్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆరోగ్య మంత్రి జె.పి.నడ్డా శుక్రవారం వేర్వేరు ప్రకటనలు చేశారు. ఎన్‌హెచ్‌పిఎస్ పథకం రీయింబర్స్‌మెంట్‌ను ఉద్దేశించింది కాదని, పూర్తిగా నగదు రహితమని జైట్లీ స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, ప్రభుత్వం పథకంపై సమగ్రమైన కసరత్తు చేస్తున్నదని జె.పి.నడ్డా హామీ ఇచ్చారు. ఈ పథకం ద్వారా ఆస్పత్రిలో చేరినవారికి చికిత్స అందుతుంది. దేశంలో ఆయా రాష్ట్రాల్లోని ఆస్పత్రులు, ఎంపిక చేసిన ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్యాష్ లెస్ చికిత్స అందిస్తారని ఆర్థిక మంత్రి తెలిపారు. ఎన్‌హెచ్‌పిఎస్ పథకం బీమా పథకం తరహాలో పనిచేస్తుందని చెప్పారు. దీనిపై నీతి అయోగ్, ఆరోగ్యశాఖ అధ్యయనం చేస్తున్నాయి. ప్రారంభనిధి కింద రూ.2 వేలకోట్లతో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేసేలా కసరత్తు చేస్తున్నామని జైట్లీ తెలిపారు. అయితే పథకం అమలుకు సంబంధించిన వివరాలను ఇప్పటికిప్పుడే ఇవ్వలేమని ఆరోగ్య మంత్రి నడ్డా చెప్పారు. వాటిపై అన్ని ఇతర శాఖలతోనూ తాము పనిచేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే ప్రభుత్వ నిధులతో అమలుకు నోచుకునే అతి పెద్ద ఆరోగ్య భద్రతా పథకంగా పిలుస్తున్న ఈ పథకం ద్వారా 10 కోట్ల పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది. వైద్య చికిత్స నిమిత్తం ప్రతి కుటుంబానికి ఏటా రూ.5 లక్షల కవరేజీ ఉంటుంది.

గతేడాది బడ్జెట్‌లోనే భారీ ఊరట

కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతి వర్గానికి ఉపశమనం ఇవ్వలేదన్న వాదనపై కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ స్పందించారు. మధ్యతరగతి పన్ను చెల్లింపు దారులకు గతేడాది బడ్జెట్ లోనే భారీ ఉపశమనం కలిగించేలా నిర్ణయం తీసుకున్నామని.. ఆర్థిక అవకాశాలను బట్టి భవిష్యత్‌లో మరింత ఊరట కలిగిస్తామని స్పష్టంచేశారు. గత ఒప్పందాలు, సమ్మెతల వల్లే భారత్ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. మీరు గత 4-5 బడ్జెట్‌లను పరిశీలిస్తే చిన్న పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం ఇచ్చేలా ప్రకటనలు చేశా. ప్రతీ బడ్జెట్ లో నూ ఊరట కలిగిస్తూనే ఉన్నా. తాను ప్రవేశపెట్టిన గత బడ్జెట్‌లో ఎన్నో కీలక ప్రకటనలు చేశానని..తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆదాయపు పన్ను పరిమితిని రూ.2 లక్షలకు పెంచామని.. పొదుపుపై అదనంగా రూ.50 వేల మినహాయింపులు కూడా ఇచ్చామని తెలిపారు. కాబట్టి లక్ష రూపాయల మినహాయింపులు, లక్షా యాభైవేలకు చేరాయి. గతేడాది ఇళ్ల రుణాలు తీసుకునే వారు ఏడాదికి చెల్లించే రీపేమెంట్‌ను రూ.50వేల నుంచి రూ.2 లక్షలకు పెంచాం అని అన్నారు. వైద్యులు, లాయర్లు తదితర నిపుణులకు రూ. 50లక్షల వరకు చెల్లించే పన్నులను సులభతరం చేశామన్నారు. మౌలిక వసతుల కల్పనకు, సామాజిక భద్రత వంటి పథకాలకు ఆదాయం కావాలి కాబట్టి ఈ బడ్జెట్‌లో కొన్ని మినహాయింపులు చేయలేకపోవచ్చన్నారు. మీరు జాతి పరిరక్షణకు కృషి చేయకపోవచ్చు..కానీ ప్రభుత్వంపై మాత్రం ఆ బాధ్యత ఉంటుందని అని జైట్లీ చెప్పుకొచ్చారు. దేశంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని అదుపుచేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలను అవలంభిస్తోందని చెప్పారు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసరాల ధరలు పెరిగాయని..వాటిని అదుపుచేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.



అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం

లాస్ ఏంజెల్స్: తరచూ కాల్పులమోతతో వార్తల్లో నిలిచే అమెరికా పాఠశాలలు మరోసారి ఇదే తరహా సంఘటనకు వేదికగా నిలిచాయి. లాస్ ఏంజెల్స్‌లోని మిడ్‌టౌన్‌లోగల సల్వడోర్ బి క్యాస్ట్రో మాధ్యమిక పాఠశాలలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. 12 సంవత్సరాల ఓ బాలిక వద్ద నున్న గన్ పొరపాటున ఓపెన్ అవడంతో ఓ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండగా, మరో నలుగురు గాయాల పాలు అయ్యారు. గాయపడిన వారిని వారి తల్లిదండ్రుల కన్నీటిమధ్య హాస్పటల్‌కు తరలించారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో జరిగిన ఆ సంఘటన వివరాలు వెంటనే అందుకున్న పోలీసులు నిముషాల వ్యవధిలోనే 12సంవత్సరాల బాలికను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను విచారించిన అనంతరం ఆయుధం పట్ల నిర్లక్ష్య వైఖరిపై ఆమెపై కేసు పెడుతున్నట్లు పోలీసులు తెలిపారు. శెలవుల అనంతరం నేటి ఉదయం పాఠశాల తెరవడంతో చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలో దింపి వెళ్ళిన కొద్ది నిముషాలకే ఈ సంఘటన జరిగింది. పోలీసుల విచారణలో విద్యార్థిని యొక్క బ్యాగ్‌కు చెందిన పాకెట్‌లో లోడెడ్ గన్ ఉంది. అనుకోకుండా అది కింద పడిన వెంటనే లాక్ ఓపెన్ అవడంతో ఈ ప్రమాదం జరిగిందని తేలింది.

వర్జీనియాలో ప్రవాస భారతీయురాలు,కుమారుడు హత్య

వర్జీనియాలో ప్రవాసభారతీయురాలు మాలా మాన్వానీ(65)నీ,ఆమె కుమారుడు రిషి మాన్వానీని గుర్తు తెలియని వ్యక్తి ఒకరు వారింట్లో ప్రవేశించి కాల్చి చంపినట్టు పోలీసులు తెలిపారు.ఈ ఘటనకు కారణం తెలియరాలేదు.కాల్పులు జరిపిన వ్యక్తి ఆ ప్రాంతం వాడేననీ, స్థానిక తగాదాలే కారణం కావచ్చని పోలీసులు తెలిపారు..

భారత్ వ్యూహం అద్భుతం

గౌరవప్రదంగా వ్యవహరిస్తున్న భారత్: పెంటగాన్ అధికారిక ప్రతినిధి దానావైట్

వాషింగ్టన్ : భారత్‌పై అమెరికా మరోసారి ప్రశంసలు కురిపించింది. ఉగ్రవాద నిర్మూలనకు భారత్ చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పుకొచ్చింది. ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో భారత్ పాత్ర ఏ మేరకు ఉందన్న విలేకరి ప్రశ్నకు పెంటగాన్ చీఫ్ అధికారిక ప్రతినిధి దానా వైట్ మాట్లాడుతూ.. దక్షిణ ఆసియాలో ఉగ్ర వాద నిర్మూలనకు వ్యూహ రచనలో భారత్ పెద్దన్న పాత్ర పోషిస్తున్నదని చెప్పుకొచ్చారు. డొనాల్డ్ ట్రంప్ సహకారంతో ముందుకు వెళ్తున్నదని ఆమె వివరించారు. ఇద్దరి మధ్య చాలా బలమైన బంధం ఉందని, అన్ని రంగాల్లో సహాయ సహకారాలు అందిపుచ్చుకునే విషయంలో స్పష్టంగా ఉన్నామని చెప్పారు. ఏవియేషన్ మెయింటెనెన్స్ విషయంలో కూడా భారత్ సహకారం ఎనలేనిది అని ఆమె వివరించారు. రక్షణ పరంగా ఎంతో సహాయం అందిస్తున్నదని, ఉగ్రవాద నిర్మూలనకు తాము కూడా భారత్‌కు వెన్నుదన్నుగా నిల్చుంటామని తెలిపారు. భారత్ గౌరవప్రదంగా దక్షిణాసియా వ్యూహానికి భారత్ సాయం చేస్తోందని, దీని అభివృద్ధి కోసం గొప్ప నిధి కేటాయించిందని ఆమె వివరించారు. ఉగ్రవాదాన్ని ఎలా నిర్మూలించాలన్న విషయంలో భారత్‌నే ఉదాహరణగా తీసుకోవచ్చు అని చెప్పారు. దక్షిణాసియాలో తమ వ్యూహం విజయవంతం కావడానికి భారతే కారణం అని ఆమె పేర్కొన్నారు.

పాకిస్థాన్ ఉగ్రదాడులకు పాల్పడినందుకు ఇస్లామాబాద్ చర్యలు తీసుకుంటున్నట్టు యూనైటెడ్ స్టేట్స్ స్పష్టం చేసింది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్ పర్యటన నుండి తిరిగి వచ్చిన రాష్ట్ర విదేశాంగ కార్యదర్శి జాన్ జేసుల్లివాన్ మాట్లాడారు. పాకిస్థాన్ శాశ్వతంగా శాంతి స్థాపనకు దోహదం చేయాలని కూడా అమెరికా భావిస్తోందని చెప్పారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్‌తో చర్చల ద్వారానే ఇది సాధ్యం అవుతుందని భావిస్తున్నామని తెలిపారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదాన్ని సమూలంగా తొలగించేందుకు ఇప్పటికే స్పష్టంగా చెప్పడం జరిగింది. ఉగ్రవాద నిర్మూలనకు ఒత్తిడి పెంచడంతో పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్‌పై విరుచుకుపడుతోందని సుల్లీవాన్ అభిప్రాయపడ్డారు.

ఆఫ్ఘనిస్తాన్‌తో మంచి సంబంధాలు ఉన్నాయని, ఇవి ఇలాగే కొనసాగుతాయని అభిప్రాయపడ్డారు. ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అశ్రఫ్ ఘని, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ అబ్దుల్లా, విదేశాంగ మంత్రి సలావుద్దీన్ రబ్బానీతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులతో సమావేశమైనట్టు సుల్లీవాన్ తెలిపారు. తాలిబన్లు ఇప్పటికే రెచ్చిపోతూనే ఉన్నారని, అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లను చూస్తే శాంతి స్థాపనకు సహకారం అందించేలా లేరని ఆయన అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ఆఫ్ఘనిస్తాన్‌కు అమెరికా ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటుందని అన్నారు. ఇరు దేశాల రక్షణ చర్యలకు సంబంధించి సహాయ సహకారాలు అందించేందుకు చర్చలు జరిపినట్టు వివరించారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్‌ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత జాత్యాంహకార దాడులు పెరిగినట్టు సాల్ట్(ఎస్ఏఎల్‌టీ) రిపోర్టులో వెల్లడైంది.

ఏడాది చివరకు ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ

జూన్ మాసాంతానికి బిడ్డర్ ఖరారు!



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ ఈ సంవత్సరాంతానికి పూర్తి కావాలని ప్రభుత్వం ఆశిస్తున్నట్టు కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా శుక్రవారం తెలిపారు. జూన్ మాసాంతానికి విజేత బిడ్డర్ ఎవరో తెలిసే అవకాశం ఉందని విలేకరులతో అన్నారు. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి పన్ను చెల్లింపుదార్ల నగదుతో కొసప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న ఎయిర్ ఇండియాను నాలుగు వేర్వేరు సంస్థలుగా విక్రయిస్తారు. ఎయిర్ ఇండియాలో ప్రైవేట్ భాగస్వాముల వాటా కనీసం 51 శాతం ఉంటుందని మంత్రి వివరించారు. ఎయిర్ ఇండియాకు సంబంధించి ప్రతిపాదిత వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ కోసం సమాచార వినతిపత్రాన్ని వచ్చే కొద్ది వారాల్లో జారీ చేస్తామని ఆయన చెప్పారు. మేం ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరిస్తున్నాము. దాని అర్థం 51 శాతానికి పైగా ఎయిర్ ఇండియా యాజమాన్య హక్కు ప్రయివేట్ రంగానికి బదలీ అవుతుంది. ప్రభుత్వ యజమాన్యం 49 శాతం లేదా అంతకు తక్కువ ఉంటుందని సిన్హా తెలిపారు. బ్రిటీష్ ఎయిర్‌వేస్, అమెరికన్ ఎయిర్‌లైన్స్, లుఫ్తాన్సా,ఖాంటాస్ తరహాలో ప్రైవేట్ రంగానికి ఎయిర్ ఇండియా బదలీ అవుతుందని చెప్పారు.

రైల్వే ఛార్జీల సడలింపుపై పునరాలోచన



న్యూఢిల్లీ: రైల్వే మంత్రిత్వశాఖ ఛార్జీల సడలింపుపై పునరాలోచన చేస్తోందని, ఆదాయాన్ని పెంచుకునేందుకు సాయపడగలిగే విధంగా కొనసాగుతున్నామని శుక్రవారం రైల్వే మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యసభలో పలువురి సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ తన అధీనంలో ఉన్న రైల్వేశాఖలో ప్రస్తుత ఉపయోగిస్తున్న సిగ్నలింగ్ వ్యవస్థలో తాజా సాంకేతికతను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తామన్నారు. సీజన్, డిమాండ్ తదనుగుణంగా సరఫరా ప్రకారం ఛార్జీలు నిర్ణయించబడతాయన్నారు. రైల్వే టికెట్ల ధరలను ఎలా నిర్ణయించాలో ఒక కమిటీ నివేదిక సమర్పించిందని అయితే ఈ నివేదిక లాభదాయకంగానే ఉందని రైల్వేమంత్రి పీయుష్ గోయల్ స్పష్టం చేశారు. బీజేపీ సభ్యుడు రామ్‌విచార్ ధరలు చాలా ఎక్కువ స్థాయిలో ఉన్నాయనగా ప్రతిస్పందించిన మంత్రి గోయల్ ఒక కమిటీ రైలు టికెట్ల ధరలపై నివేదిక సమర్పించిందని, ఈ నివేదిక లాభాలను మెరుగుపర్చుకోవడానికి కూడా దోహదపడుతుందని ఆయన తెలిపారు. డైనమిక్ ధరల విధానం కింద ఆఫ్ సీజన్లో డిస్కౌంట్లను ఇవ్వొచ్చని మంత్రి అన్నారు. సీజన్, డిమాండ్ ప్రకారం రైల్వే ఛార్జీలు నిర్ణయింపబడతాయన్నారు. కొన్నిసార్లు రైల్వే ప్రయాణికులు చౌకగా టికెట్లు పొందవచ్చు, మరికొన్నిసార్లు టికెట్ల ధరలు కొంచెం ఎక్కువగా ఉండొచ్చు అన్నారు.

మోడీకేర్‌కు ఏడాదికి రూ.11వేల కోట్లు

బీమా కంపెనీల ద్వారా అదనపు నిధుల సేకరణ

న్యూఢిల్లీ: మోడీ కేర్‌గా పేరు తెచ్చుకున్న జాతీయ ఆరోగ్య భద్రత పథకం అమలుకు ఏడాదికి రూ.11 వేల కోట్లు అవసరమవుతుందని అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. దేశంలో దాదాపు సగం జనాభాకు వైద్య చికిత్స అందించడం ఈ పథకం ముఖ్యోద్దేశ్యం. ప్రభుత్వం ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ.2,000 కోట్లు కేటాయించింది. కానీ పథకం అమల్లోకి వచ్చిన ఏడాది తర్వాత మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయని సంబంధిత అధికారులు అంటున్నారు. ప్రస్తుతం అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కొంతమేరకు ఆరోగ్య బీమా అందిస్తున్నాయి. కానీ పరిమాణంలో చిన్నవిగా ఉన్న సదరు పథకాలు పేలవంగా అమలవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం కింద ప్రతి కుటుంబానికి బీమా రూపేణా దాదాపు రూ.1,100 చెల్లించాల్సి ఉంటుందని ఒక అంచనా. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య భద్రత పథకంగా పేరు తెచ్చుకున్న ఈ పథకానికి రూ.2,000 కోట్ల బడ్జెట్ కేటాయింపు ఎంతవరకు సరిపోతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రతి యేటా ప్రీమియంల రూపేణా చెల్లించాల్సిన రూ.11 వేల కోట్లలో కేంద్ర ప్రభుత్వం వాటా దాదాపు రూ.7 వేల కోట్లు ఉంటుంది. మిగిలిన వాటాను 29 రాష్ట్రాలు భరిస్తాయని అధికార వర్గాలు వివరించాయి. రానున్న మాసాల్లో పథకంపై మరింత కసరత్తు చేసిన తర్వాత బడ్జెట్‌లో కేటాయించిన రూ.2,000 కోట్లకు అదనంగా రూ.5,000 కోట్లను కేంద్ర ప్రభుత్వం సమకూర్చే అవకాశం ఉందని తెలిపాయి. ప్రభుత్వ ఆరోగ్య బీమా కంపెనీలు పథకానికి నిధులు సమకూర్చడానికి ఇప్పటికే అంగీకరించాయని వెల్లడించాయి.



అమెరికన్ మార్కెట్లోకి రెడ్డీస్ జనరిక్ 'టెట్రాబెనాజైన్

న్యూఢిల్లీ : మందుల తయారీ రంగంలో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన డాక్టర్‌రెడ్డీ స్ ల్యాబొరేటరీస్ అమెరికా మార్కెట్‌లోకి మరో కొత్త మాత్రలను ప్రవేశ పెట్టింది. శుక్రవారం సంస్థ ఈ విషయాన్ని ప్రకటించింది. తమకంపెనీకి సంబంధించి తాజాగా విడుదల చేసిన ఈ 'టెట్రాబెనాజైన్' మందుకు అమెరికా దేశానికి చెందిన యునైటెడ్ స్టేట్స్ ఫుడ్అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్ఎఫ్‌డిఎ) అనుమతి కూడా ఉందని పేర్కొంది. లక్సెంబర్గ్‌కు చెందిన వలియంట్ ఫార్మాస్యూటికల్స్ వారి ఎస్ఏఆర్ఎల్ క్సెనాజైన్ మెడిసిన్‌కు తమ 'టెట్రాబెనాజైన్' జనరిక్ వెర్షన్‌గా డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. గత సంవత్సర కాలంలో దాదాపు 322 మిలియన్ డాలర్ల వ్యాపారాన్ని సాగించినట్లు నివేదికలు తెలియ జేస్తున్నాయని, తమ ఉత్పత్తి 12.5 ఎంజీ, 25 ఎంజీలలో లభ్యం అవుతుందని కంపెనీ పేర్కొంది.



గృహ, ఆటో రుణాలకు బడ్జెట్ మోత

- ఈఎంఐలు పెరిగే అవకాశం
- వచ్చే వారం ఆర్బీఐ ద్రవ్య విధానం
- పెరగనున్న వడ్డీ రేట్లు
- ప్రతిష్ఠాత్మక పథకాలకు రుణాలే శరణ్యం






న్యూఢిల్లీ: నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వం సరికొత్త హామీలతో సాధారణ బడ్జెట్‌ను తీసుకువచ్చింది. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈ ఏడాది ఎనిమిది రాష్ట్రాలకు ముంచుకొస్తున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలకు భారీ కేటాయింపులు ప్రకటించారు. మరీ ముఖ్యంగా గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో రూ.14.34 లక్షల కోట్లు కేటాయించారు. 2019లో లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చివరి పూర్తి సంవత్సరపు బడ్జెట్ ద్రవ్యోల్బణానికి చోదకంగా వ్యవహరిస్తుంది. భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్‌బీఐ) త్వరలో వడ్డీ రేట్లను పెంచడానికి అది దారి తీస్తుందని కొందరు విశ్లేషకులు అన్నారు. అదే జరిగిన పక్షంలో శైశవ దశలో ఉన్న ఆర్థిక వ్యవస్థ కోలుకుంటున్న ప్రక్రియ దెబ్బ తింటుందని తెలిపారు.

ఆర్థిక స్వస్థత కష్టతరం

పెరిగిన వడ్డీ రేట్ల వాతావరణంలో పూ ర్తి స్థాయిలో స్వ స్థత పొందిన ఆర్థిక వ్యవ స్థను సాధించడం కష్టమవుతుంది. ఆర్బీఐ ఈ నెల ఏడవ తేదీన వచ్చే ద్రవ్య విధానాన్ని ప్రకటిం చనుంది. ఆ సందర్భంగా గిరాకీని సృష్టించేందుకు వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా వృద్ధికి ఊతమివ్వడంపై దృష్టి పెట్టడా నికి బదు లుగా దూకుడుతో కూడుకున్న ద్రవ్య వైఖ రిని ఎంచుకునే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు తెలిపారు. అధిక వడ్డీ రేట్ల హ యాం సాకారమైన పక్షంలో అది ఆటో, ఇల్లు, తదితరాలపై ఇఎం ఐల (సమా నస్థాయిలో నెలసరి వాయి దాలు)ను పెం చుతుంది.

ఆహారం, చమురు ధరలతో ద్రవ్యోల్బణానికి రెక్కలు

ఆర్బీఐ గత ఏడాది ఆగస్టు నుంచి వడ్డీ రేట్లపై యథా తథ స్థితిని కొనసాగిస్తున్నది. ప్రస్తుతం ఆర్బీఐ ప్రాధాన్యం ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం. ద్రవ్యోల్బణం ఇప్పటికే నాలుగు శాతం సౌకర్యవంతమైన స్థానాన్ని దాటి పోయింది. ఇందుకు ప్రధానంగా ఆహార పదార్థాల ధరల్లో పెరు గు దలే కారణం. రానున్న రోజుల్లో ముడి చమురు ధరలు పెరిగే అవకా శం ఉంది. ఆ ప్రభా వంతో ద్రవ్యో ల్బణం గత డిసెం బర్‌లో 17 మాసాలకు గరిష్ఠంగా 5.21 శాతాన్ని సైతం అధిగమిం చవచ్చు.వృద్ధి పట్ల పెరుగుతున్న అంచనాలు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆర్థిక దిగజా రుడుకు పొంచి ఉన్న ముప్పులు ఇవ్వన్నీ క ాడా ఈ ఏడాది కఠినతరమైన ద్రవ్య విధానం వైపు వేలెత్తి చూపుతున్నాయి అని సింగపూర్‌కు చెందిన ప్రముఖ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్బీఐ అప్ర మత్త వైఖరి రానున్న ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉంది. అది ప్రభుత్వం, ఆర్బీఐ మధ్య ఉద్రిక్తతలను పెంచ వచ్చు. ద్రవ్యోల్బణం పెరుగుదలపై ఆందోళన చెందుతున్న ఆర్బీఐ.. వృద్ధికి ఊతమివ్వడానికి వడ్డీ రేట్లపై కోత కోసం పెరుగుతున్న ఒత్తిళ్ళను వ్యతిరేకిస్తున్నది.ఆర్బీఐ వచ్చే వారం వడ్డీ రేట్లను పట్టి ఉంచవచ్చునని అనేక మంది పరిశీలకులు విశ్వసిస్తున్నారు. బడ్జెట్ ఆర్బీఐ స్వరాన్ని కఠినతరం చేయవచ్చు. రైతులకు కనీస మద్దతు ధర పెంపుదలను తప్పనిసరి చేస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రత్యక్ష ద్రవ్యోల్బణ ప్రభావాన్ని చూపుతుందనే భావనలో పరిశీలకులు ఉన్నారు.మోడీ ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 3.3 శాతం ద్రవ్య లోటును లక్ష్యంగా చేసు కుంటుంది. జీడీ పీలో లక్షిత 3.2 శాతంతో పోల్చి నప్పుడు 2017 -18 ఆర్థిక సంవ త్సరానికి ద్రవ్య లోటు 3.5 శాతం వద్ద అధికంగా ఉండవ చ్చు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక మంత్రి ఆర్థిక పతనాన్ని చక్కగా కట్టడి చేశారు.





జైట్లీని కట్టడి చేసిన జీఎస్టీ, నోట్ల రద్దు

ఇటీవలి వారాల్లో అంతర్జాతీయంగా చమురు ధరలదే ఇష్టారాజ్యం కావడంతో చమురు ద్వారా రాబ డులు పొందే శకం ముగిసిపోనుందని అనేక మంది ఆర్థికవేత్తలు అన్నారు. దీనికి తోడు ముడి చమురు ధరలు, వస్తు, సేవల పన్ను(జీఎస్టీ), నోట్ల రద్దు తదనం తర ప్రభావాలు బ్యాం కింగ్ సంస్కరణలతో జట్టు కట్టాయి. కేటాయింపులు జరపడంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధికారాలను అడ్డుక న్నాయి. ద్రవ్య లోటు లక్ష్యాన్ని సవరించుకునేలా చేశాయి. అయితే మోడీ ప్రభుత్వం ఈ సంవత్సరపు ద్రవ్య లోటు లక్ష్యం నుంచి జారిపోవడానికి జీఎస్టీ రెవెన్యూ వసూళ్ళు తక్కువగా ఉండటమే ప్రధాన కారణం. అంతే కాక చూడబోతే బడ్జెట్‌లో ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పథకా లకు భారీ ఎత్తున రుణాలు తీసుకురావాల్సి ఉంటుంది. అయితే బడ్జెట్ ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందనే ఒక విస్తృ తమైన ఏకాభిప్రాయానికి ఆర్థికవేత్తలు చేరుకున్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చే బడ్జెట్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరిచేలా ఉందని, వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేసి రైతాంగానికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చే విధంగా రూపకల్పన చేశారని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ గణేష్ బాలకృష్ణన్ చెప్పారు. మౌలికసదుపాయాల కల్పన, విద్యా, ఆరోగ్యం రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని చెప్పారు. వాణిజ్య, పారిశ్రామిక రంగంపై కేంద్ర బడ్జెట్ ప్రభావం అన్న అంశంపై శుక్రవారం ఎఫ్‌ట్యాప్సీ ఈ మేరకు ఒక సదస్సు నిర్వహించింది. ఎఫ్‌ట్యాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, జిఎస్‌టి చీఫ్ కమిషనర్ బిబి అగర్వాల్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణన్ మాట్లాడుతూ, అనావృష్టి, మద్దతు ధర లేకపోవడం, ఇతర సమస్యలతో రైతాంగం ఆర్థికంగా ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. రైతన్నకు దన్నుగా నిలువాలన్న లక్ష్యంగా ప్రభుత్వం మద్దతు ధర అమలు చేసేందుకు ఒక కమిటీని వేయాలని నిర్ణయించిందని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఉత్పత్తుల రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు భారీగా నిధులు కేటాయించిందన్నారు. అలాగే గ్రామాల్లో పేదలు, మధ్య తరగతి వర్గాలకు ఆరోగ్య బీమా కల్పించడంతో పాటు వారి పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు డిజిటల్ విద్యకు ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పల్లెలకు అందించే లక్ష్యంతో డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని విస్తరిస్తున్నారని ఆయన చెప్పారు.ఎంఎస్ఎంఈలను మరింతగా ప్రోత్సహించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఎంఎస్ఎంఈలకు కార్పొరేట్ ట్యాక్స్ పరిధిని రూ.250 కోట్లకు ఎంతో మంచి నిర్ణయమని బాలకృష్ణన్ అన్నారు. రైతులు కష్టాలు ఎదుర్కొంటూ ఏడాదికి ఒక్కరోజున సంక్రాంతి జరుపుకుంటున్నారని, వారిని సుఖ సంతోషాలతో ముంచెత్తి రోజూ సంక్రాంతి జరుపుకోవాలన్న ఆకాంక్షతోనే ప్రభుత్వం గ్రామీణ భారతంవైపు దృష్టి సారించి అధిక నిధులు కేటాయించిందని అన్నారు.

జిఎస్‌టి రిటర్న్స్ దాఖలు చేయకుంటే చర్యలు : బిబి అగర్వాల్

కేంద్ర ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో రూపొందించిన చారిత్రాత్మక బడ్జెట్ అని బిబి అగర్వాల్ అభివర్ణించారు. జిఎస్‌టి అమలు తర్వాత మొదటిసారిగా ప్రతిపాదించిన ఈ బడ్జెట్ అభివృద్ధి దిశగా ఉందన్నారు. దేశ ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రెవెన్యూ వసూళ్ళు అవసరమని, దీనికి వాణిజ్య, పారిశ్రామిక రంగాలు సహకరించాలని అన్నారు. జులై చివరి నాటికి రాష్ట్రంలో 92 శాతం జిఎస్‌టి రిటర్న్స్ దాఖలు చేశారని, మిగిలిన 8శాతం మంది ఎందుకు నిర్లక్ష్యం చేశారో తెలియాల్సి ఉందన్నారు. జిఎస్‌టి రిజిస్ట్రేషన్ పూర్తయిందని, రిటర్న్స్ దాఖలు చేయకుంటే చర్యలు తీసుకుంటామని అగర్వాల్ హెచ్చరించారు.

ఇది జనాకర్షణ బడ్జెట్ : గౌర శ్రీనివాస్

కేంద్ర బడ్జెట్ వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచు కుని జనాకర్షణ బడ్జెట్ రూపొందించారని ఎఫ్‌ట్యాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్ అన్నారు. ఎక్కువ మంది ప్రజలకు వ్యాపార కార్యకలాపాల్లో అవకాశం కల్పించేందుకు ముద్రా రుణాల మంజూరుకు నూతన మార్గదర్శకాలు ప్రకటిం చడం మంచి పరిణామమని అన్నారు. జీతాలపై ఆధారప డిన ఉద్యోగులకు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిల్చిందని శ్రీనివాస్ అన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగం ప్రత్యక్ష పన్నుల్లో ఎలాంటి ప్రయోజనం పొందలేదని, అయితే ఎంఎస్ఎం ఈల కార్పొరేట్ ట్యాక్స్ పరిధిని రూ.250 కోట్లకు పెంచడా న్ని స్వాగతిస్తున్నామని ఆయన చెప్పారు. ఈక్విటీపై 10 శాతం క్యాపిటల్ గెయిన్స్ పన్ను విధించడం, ఇన్‌ఫ్రా, విద్యుత్ కంపెనీల పబ్లిక్ ఇష్యూలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని శ్రీనివాస్ ఆందోళన వ్యక్తంచేశారు. దేశీయ ఉత్పత్తులను పెంచేందుకు కొన్ని వస్తువులపై దిగు మతి సుంకం పెంచడం, మేక్ ఇన్ ఇండి యా, డిజిటల్ ఇండి యా కార్యక్రమాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం ఉపాధి పెంచేందుకు దోహద పడతాయని ఆయన అన్నారు.

ఆధార్‌కు రూ.1,375 కోట్లు

న్యూఢిల్లీ: ఆధార్ జారీ చేసే యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ)కి బడ్జెట్ కేటాయింపులో భాగంగా 1,375కోట్ల రూపాయలను కేటాయించారు. గతేడాది బడ్జెట్లో 900కోట్లరూపాయలను యూఐడీఏఐకి కేటాయించినా అనంతరం దానిని 1200కోట్లకు సవరించారు. బడ్జెట్ పత్రాల ప్రకారం 2018-19 సంవత్సరానికి 1,375 కోట్ల రూపాయలు కేటాయించారని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ పాండే విలేఖరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఆధార్ సాంకేతిక, హార్డ్‌వేర్ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. ఆయా ఖాతాలుకు ఆధార్ ప్రమాణీకరణకు డిమాండ్ పెరిగిందన్నారు. ఆధార్‌ను తమ తమ వ్యక్తిగత, సంస్థాగత ఖాతాలతో అనుసంధానం చేసేందుకు ప్రజల నుంచి విపరీతమైన స్పందన వచ్చిందన్నారు. ప్రస్తుతం రోజువారీ ధ్రువీకరణలు సగటున నాలుగు కోట్లకు చేరిందని ఆయన వెల్లడించారు. గురువారం పార్లమెంటులో ఆర్థికమంత్రి జైట్లీ బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంగా ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన ఐడీ అవసరమని, ఆధార్ ప్రతి భారతీయుడికి ఒక గుర్తింపునిచ్చిందని అన్నారు. ఆధార్ ప్రమాణీకరణ కోసం ఐరీస్, వేలిముద్రల గుర్తింపుతోపాటు ముఖాకృతిని కూడా గుర్తించే కొత్త విధానాన్ని త్వరలో ప్రవేశ పెట్టనున్నారు. ఈ కొత్త విధానం వల్ల బయోమెట్రిక్ ప్రమాణీకరణలో సమస్యలను ఎదుర్కొనేవారికి, వేలిముద్రల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారికి ముఖాకృతి గుర్తింపుతో ఉపశమనం లభించనుంది.



బిట్‌కాయిన్ మదుపర్లకు ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ: బిట్ కాయిన్ల ట్రేడ్‌లో మదుపు చేసిన లక్షలాది మంది మదుపుదార్లకు ఆదాయపు పన్ను శాఖాధికారులు నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా సిబిడిటి చీఫ్ సుశీల్ చంద్ర విలేఖరులతో మాట్లాడుతూ చాలామంది పెట్టుబడిదారులు పన్ను చెల్లింపులో భాగంగా చెల్లించాల్సిన అడ్వాన్స్ ట్యాక్స్‌ను చెల్లించలేదన్నారు. మరికొంతమంది ఐటి రిటర్న్‌లను దాఖలు చేసినా వాటిలో ఎటువంటి వివరణ ఇవ్వలేదన్నారు. గత ఏడాది డిసెంబర్లో తమ డిపార్ట్‌మెంట్ ఒకసర్వే నిర్వహించిందన్నారు. చాలామంది పెట్టుబడిదారులకు నోటీసులు జారీ చేయగా వారంతా ట్యాక్స్ చెల్లించేందుకు అంగీకరించారన్నారు. బిట్ కాయిన్ల లో పెట్టుబడి పెట్టిన వారందరి నుంచి ఖచ్చితంగా పన్ను వసూలు చేస్తామన్నారు. అదేవిధంగా ఐటీ రిటర్నులను దాఖలు చేసినవారు సైతం ఎటువంటి వివరణ ఇవ్వకపోయినా వారినుంచి కూడా పన్ను తప్పకుండా వసూలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎంతమందికి నోటీసులు అందజేశారని విలేఖరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ కొన్ని లక్షలమందికి నోటీసులు అందజేశామన్నారు. గతేడాది ఆర్థికశాఖ మంత్రి పార్లమెంటులో మాట్లాడుతూ వర్చువల్ కరెన్సీకి ఎటువంటి ప్రభుత్వ గుర్తింపులేదని, రిజర్వ్‌బ్యాంక్ సైతం వీటికి ఎలాంటి లైసెన్స్ జారీ చేయలేదని తెలిపారు. గురువారం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో మాట్లాడుతూ బిట్ కాయిన్స్‌తో సహా అన్నిరకాల క్రిప్టో కరెన్సీ వినియోగించటం అక్రమం అని, ప్రభుత్వం అటువంటివారిపై తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేసిన సంగతి విదితమే. ఆదాయపు పన్నుశాఖ మార్చి 31లోగా 9.8లక్షల కోట్లు ఆదాయాన్ని డైరెక్ట్ ట్యాక్స్ రూపం రాబట్టేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు సిబిడిటి చీఫ్ సుశీల్ చంద్ర వెల్లడించారు.



ఇది ఎన్నికల బడ్జెట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్ పూర్తిగా ఎన్నికల ముందు పాలకపక్ష మార్క్ బడ్జెట్‌గా ఉందని పల్సస్ గ్రూప్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు అన్నారు. ఈ బడ్జెట్‌లో పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ప్రయోజనం లేదనీ, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదని ఆయన అన్నారు. వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాలకు చాలా ప్రకటనలు చేశారనీ, కొన్ని కేటాయింపులు, రాయితీలు గ్రామీణ ప్రాంతానికి మేలు చేసేలా ఉన్నా అవి వాస్తవ రూపం దాల్చేసరికి ఈ ప్రయోజనాలు ఎంతమేరకు అందుతాయో, అమలు ఎలా ఉంటుందో చూడాల్సి ఉంటుందన్నారు. కార్పొరేట్ పన్ను తగ్గించడం కొంత ఊరటనిచ్చినా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సేవా రంగానికి ఎగుమతులు నిరాశ పరిచాయని శ్రీనుబాబు చెప్పారు.

4జీ ఆప్‌లోడ్‌లో జియోటాన్



న్యూఢిల్లీ : 4వ జనరేషన్ టెలికం సేవలను వేగంగా అందించడంలో జియో తనదైన శైలిని చూపించింది. గత నవంబర్ మాసానికి సంబంధించి టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) శుక్రవారం తన నివేదికలో ఈ విషయాన్ని పేర్కొంది. ఈ నెలలో డౌన్‌లోడింగ్‌లో 25.6 ఎంబీపీఎస్ వేగాన్ని సాధించి జియో మొదటి స్థానంలో నిలిచింది. 10 ఎంబీపీఎస్ వేగంతో వోడాఫోన్ ద్వితీయస్థానాన్ని పొందగా, 9.8 ఎంబీపీఎస్ వేగంతో మూడో స్థానంలో నిలిచింది. 7 ఎంబీపీఎస్ వేగంతో ఐడియా 4వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ప్రతి సంవత్సరం ట్రాయ్ తన 'మై స్పీడ్' అనే యాప్ ద్వారా టెలికాంసంస్థల యొక్క సేవలను పర్యవేక్షిస్తూ ఉంటుంది. అలాగే అప్‌లోడ్ స్పీడ్ కేటగిరీలో వోడాఫోన్ గత నవంబర్ నెలలో 6.9 ఎంబీపీఎస్ వేగంతో ముందు వరుసలో నిలవగా, ఐడియా 6.6తో రెండ స్థానం, జియో 4.9తో మూడో స్థానం, 4.0తో ఎయిర్‌టెల్ నాలుగో స్థానంలో నిలిచాయి. అక్టోబర్ నెలలో 7.1 ఎంబీపీఎస్ వేగంతో ఐడియా సెల్యులార్ మొదటిస్థానంలో నిలిచింది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యం

ఫిక్కీ ఏపీ కౌన్సిల్ చైర్మన్ ప్రభాకరరావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగంపై దృష్టిపెట్టి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సముచిత ప్రాధాన్యత ఇచ్చారని, దానిద్వారా సంపూర్ణ అభివృద్ధికి దృష్టి పెట్టినట్లయిందని ఫిక్కీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ ఎం.ప్రభాకరరావు పేర్కొన్నారు. ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని పరిగణనలోకి తీసుకోలేదని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై ఎలాంటి ప్రకటన చేకపోవడం చాలా నిరాశపరిచిందని అన్నారు. వార్షికంగా రూ.250 కోట్లు టర్నోవర్ కలిగిన కంపెనీలకు కార్పొరేట్ పన్ను 25 శాతం తగ్గించడం ఎంఎస్ఎంఈలకు లబ్ధి చేకూరుతుందని ప్రభాకర్‌రావు అన్నారు. జనాభాలో మూడవ వంతు మందికి వార్షికంగా రూ.5 లక్షల వరకు ఆరోగ్యబీమా పథకం వర్తింపజేయాలని బడ్జెట్‌లో ప్రధానంగా ప్రకటించడం ఆహ్వానించదగ్గ విషయమని ఆయన అన్నారు. బ్యాంకింగ్ రంగాన్ని పటిష్టపరించేందుకు ఎలాంటి రోడ్‌మ్యాప్ ప్రకటిం చనప్పటికీ ప్రభుత్వ రంగంలోని బీమా సంస్థలకు మార్గదర్శకాలు ప్రకటించి ఈ రంగాన్ని బలోపేతం చేసే ప్రయత్నం ప్రతిపాదించారని ప్రభాకర్‌రావు పేర్కొన్నారు.

1.75 లక్షల కోట్ల పనులకు టెండర్ల ఆహ్వానం

న్యూఢిల్లీ: భారత్‌మాల పరియోజన ప్రాజెక్ట్‌కింద దేశ వ్యాప్తంగా జాతీయ రహదారుల అభ్రివృద్ధిని పరుగులు పెట్టించడానికి భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) తన కృషిని మరింతగా పెంచనుంది. తాజాగా మరో 10,460 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం కోసం 1.75 లక్షల కోట్ల రూపాయల పనులకు టెండర్లను ఆహ్వానించింది. ఈ మేరకు రోడ్డురవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. రాబోయే 15 రోజుల్లో మరో 1,000 కిలోమీటర్ల రహదారి పనులను కూడా చేపట్టబోతున్నట్లు అందులో పేర్కొన్నారు. గత అయిదు సంవత్సరాల్లో ఎన్‌హెచ్ఏఐకి 2,860 కిలోమీటర్లు రహదారుల పనులు అప్పగించగా, 2016-17 సంవత్సరానికి గాను 4,335 కిలోమీటర్లు అప్పగించబడింది. రోడ్డు రవాణా, జాతీయరహదా రులు, నౌకాయాన, జల వనరులు, నదుల అభివృద్ధి, గంగానది పునర్వైభవ శాఖల మంత్రి నితిన్‌గడ్కరీ ఈ సంవత్సరం 10,000 కిలో మీటర్లను తమకు లక్ష్యంగా పెట్టినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మహారాష్ట్రలో 1,900 కి.మీ, రాజస్థాన్ 1, 150కి.మీ, ఉత్తర ప్రదేశ్ 1,020 కి.మీ, ఒడిస్సా 880 కి.మీ, ఆంధ్రప్రదేశ్ 745 కి.మీ, మధ్యప్రదేశ్ 740 కి.మీ, గుజరాత్ 650 కి.మీ, కర్ణాటక 620 కి.మీ, తమిళనాడు 570 కి.మీ, బీహార్ 500 కి.మీ, జార్ఖండ్ 430 కి.మీ, తెలంగాణ 365 కి.మీ, హర్యాణా 350, పశ్చిమబెంగాల్ 280 కి.మీ, ఛత్తీస్‌ఘడ్ 270 కి.మీ మీటర్లు ఉన్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.



రేటింగ్ ఏజెన్సీలు హడల్

3.5శాతానికి పరిమితంపై 'క్రిసిల్' విమర్శలు

CRISIL
A STANDARD & POOR'S COMPANY

ముంబై : క్రిసిల్ నేతృత్వంలోని రేటింగ్ ఏజెన్సీల ఆర్థిక లోటును 3.5 శాతానికి పరిమితం చేయడంతో మూల ధనం వ్యయంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అత్యధిక లక్ష్యాలకు ఇబ్బందులతో పాటు రానున్న మూడేళ్లు ఆర్థిక స్థిరీకరణ ప్రక్రియను ఆలస్యం చేస్తాయని ఏజెన్సీలు హెచ్చరించాయి. ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదక వ్యయం రాజీ పడుతుందని, ఆదాయ వ్యయానికి దారి తీస్తుందని క్రిసిల్ కంపెనీ చెప్పుకొచ్చింది. ఏజెన్సీ గత ఆర్థిక సంవత్సరం రెండోసారి ఆర్థికలోటు లక్ష్యాన్ని ఉల్లంఘిస్తోందని సంస్థపేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి 3.5శాతం ఎఫ్‌డీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అయినా 3.2 శాతం నుంచి 3.3 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నట్టు కంపెనీ పేర్కొంది. మూల ధన వ్యయం తగ్గించడం అంటే 2018 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న క్యాపెక్స్‌లో ఇబ్బందుల పాలవుతుందని తమ అర్థం అని కంపెనీ వివరించింది. క్యాపిటలర్ వ్యయం 2018 ఆర్థిక సంవత్సరానికి గాను 2.7 ట్రిలియన్ నుండి రూ.40వేల కోట్లకు తగ్గించింది. గ్రామీణ రంగంపై బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని, కనీస మద్దతు ధర, మౌలికసదుపాయాల పునరుద్ధరణ, వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం, ఎగుమతి వంటి అంశాలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఎక్కువగా దృష్టిసారించారని గుర్తు చేశారు. ఏది ఏమైనప్పటికీ బడ్జెట్ నుండి వ్యవసాయ రంగానికి లాభం చేకూరుతున్నది అనే విషయంలో సందేహం లేదని క్రిసిల్ కంపెనీ అభిప్రాయపడింది. హెల్త్‌కేర్ స్కీంపై ప్రకటన తమను ఎంతో సంతోష పెట్టిందని, ఆరోగ్య భారతం కోసం కేటాయించిన నిధులు, పథకాలు బాగున్నాయని క్రిసిల్ వివరించింది.





వేచి చూద్దాం... తప్పకపోతే పోరు సాగిద్దాం!

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చినప్పుడు మిత్రపక్షమైన ఆంధ్రప్రదేశ్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని చంద్రబాబునాయుడు ఆక్షేపించారు. అయినప్పటికి ఇప్పటికి మిత్రపక్షంగా బిజెపీని చూస్తేనే మరోవైపు ఎన్డీయే ప్రభుత్వం పట్ల వేచి చూసే ధోరణిని అవలంభించాలని పేర్కొన్నారు. మొదటి నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదురౌతున్నప్పటికి సంయమనం పాటిస్తూనే ఉన్నామని ఇప్పుడు కూడా ఘర్షణ వైఖరిని అవలంభించలేదని ముఖ్యమంత్రి వివరించారు. సాక్షాత్తు తాను ప్రధానమంత్రికి రాష్ట్ర సమస్యల చిట్టాపై వినతి పత్రం ఇచ్చానని ప్రభుత్వం తరుపున మంత్రులు, ప్రధాన కార్యదర్శి కూడా నివేదించినా ఛీత్కార ధోరణే అవలంభిస్తున్నారనే వాపోయారు. కేంద్రంతో తలపడడం కంటే వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉందని అన్నారు. అయినా బడ్జెట్‌తో నిమిత్తం లేకుండానే రాష్ట్రానికి నేరుగా సహాయ సహకారాలు అందించేఅవకాశాలు ఇప్పటికీ ఉన్నాయని, ఇప్పటికిప్పుడు ఈ విషయంలో తొందరపడరాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ నెల 4న కేంద్రంలోని టీడీపీ మంత్రులు, ఎంపీలతో జరిగిన భేటీలో అభిప్రాయ సేకరణ జరపడం జరుగుతుందని పేర్కొన్నారు. అప్పటిదాకా ఎవ్వరూ కూడా ఘాటుగా స్పందించరాదని అన్నారు. రాష్ట్ర, కేంద్ర మంత్రులు, సీనియర్ నేతలు, ఎంపీల అభిప్రాయం కీలకమైందని రాజకీయ నిర్ణయం తీసుకున్నప్పుడు తాను ఏకాభిప్రాయానికే కట్టుబడి ఉంటానని చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. బడ్జెట్‌లో కేంద్రం చూపిన వివక్ష మనసును గాయపరిచిందని వ్యాఖ్యానించారు. కేంద్ర కేబినెట్‌లో ఇద్దరు మంత్రులను పెట్టుకొని ఉద్యమాలు నిర్వహించడం సరైన పద్దతి కాదని అంటూ ఏ నిర్ణయమైన రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తీసుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. కేంద్ర వైఖరిని నిరసించడంలో తప్పు లేదని, కానీ ఒకేసారి తెగదెంపులు చేసుకోవాలనడం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. కేంద్రంతో సంబంధాల విషయంలో అడుగు ముందుకు వేసే ముందు మరోసారి సమావేశమై సమిష్టి నిర్ణయం తీసుకుందామని ఆయన పేర్కొన్నారు.

వాడి వేడిగా సమావేశం

వాడివేడిగా జరిగిన తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం మంత్రులు, టీడీపీ నాయకులు కేంద్రం తీరుపై ధ్వజమెత్తారు. తమ అభిప్రాయాలను నిర్మోహమాటంగా వెల్లడించారు. భారతీయ జనతా పార్టీ వల్ల తెలుగుదేశం పార్టీకి నష్టం జరుగుతుందని రాష్ట్రంలో బిజెపి ఉనికి కూడా తక్కువని అన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా రోజు కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఇంత జరిగిన టీడీపీ పంథాను మార్చుకోకపోతే పార్టీకే నష్టమని అన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ముఖ్యమంత్రి మరోసారి ప్రధానమంత్రితో భేటీ కావాలని సూచించారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు మాట్లాడుతూ పార్టీలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కేడర్ ఆవేదన ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుసునని అయితే రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా సంయమనం కూడా పాటించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. పలువురు మంత్రులు, సీనియర్ నేతలు కూడా బీజేపీతో తెగదెంపులు చేసుకొని స్వతంత్ర్యంగా వ్యవహరించాలని కేంద్రంపై ఆధారపడాల్సిన అవసరం అంతకన్నా లేదని అన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో ఇంత దిగజారుడుగా వ్యవహరిస్తే ఎలా అని వారు ప్రశ్నించారు.

విడిపోవాల్సిందే ..

సమన్వయ కమిటీ జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి పలువురు జిల్లా అధ్యక్షులతో ఫోన్‌లో మాట్లాడారు. పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీజేపీతో తెగదెంపులు చేసుకోవాలని కొన్ని జిల్లాల అధ్యక్షులు డిమాండ్ చేశారు. మరికొందరు మాత్రం ఇప్పటికిప్పుడు తొందరపడి తుది నిర్ణయం తీసుకోరాదంటూ వ్యాఖ్యనించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం సహకారం అవసరమని అన్నారు. అయితే బిజెపితో మైత్రి విషయంలో అధినేతదే నిర్ణయమని గుంటూరు జిల్లా అధ్యక్షులు జివి.ఆంజనేయులు అన్నారు. కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్ విషయంలో కేడర్‌లో తీవ్ర అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. ఇతర జిల్లాల అధ్యక్షులు కూడా దాదాపుగా ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని వారు ప్రకటించారు.

ఛలో హస్తినా

మారిన తాజా పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రితో పాటు ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం తుది ప్రయత్నంగా మరోసారి ఢిల్లీకి వెళ్ళాలనే డిమాండ్ వ్యక్తమైంది. ఎన్నికలకు కలిసే వెళ్ళామని రాష్ట్ర సమస్యల పరిష్కార విషయంలో భారతీయ జనతా పార్టీకి కూడా బాధ్యత ఉందని ఈ విషయంలో రాష్ట్రానికి చెందిన బిజెపి నాయకులు కూడా ఎందుకు చొరవ తీసుకోరనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇతర రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా రాష్ట్ర విభజన చట్టానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని, పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్ళాలని కేంద్రంతో తాడోపేడో అనే విధంగా గట్టిగా వ్యవహరించాలని పలువురు నేతలు కోరారు. అయితే మరికొందరు మాత్రం 2019లో కూడా మళ్ళీ కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్నందువల్ల టిడిపి రాజకీయ నిర్ణయం తీసుకునే ముందు ఆచితూచి వ్యవహరించాలని కొందరు నేతలు సూచించారు.

వైఎస్సార్‌సీపీపై మండిపాటు

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసే విధంగా ఉన్నప్పటికీ ప్రధాన ప్రతిపక్ష నేత వైఎస్సార్‌సీపీ ద్వంద్వ వైఖరిని అవలంభిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రయోజనాల రీత్యా ప్రతిపక్షం కూడా పాలకపక్షంతో ఎందుకు కలిసి రావడం లేదని ప్రశ్నించారు. ఇది ఒక విధంగా కష్టాల్లో ఉన్న రాష్ట్ర ప్రజలను మోసగించడం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రజలు కూడా గమనిస్తున్నారని అన్నారు. కాగా రాష్ట్రానికి బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడంపై వైఎస్సార్‌సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు తొలుత నిరసన వ్యక్తం చేశారని, ఆయనను వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆ పార్టీ తీరును ప్రజలు ఎండగట్టక్క తప్పదని, కేంద్రంతో లాలూచి పడే రీతిలో ప్రతిపక్షం ఉందని పేర్కొన్నారు.

ఉఊరట!

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం ఇచ్చిన హైకోర్టు తీర్పు ఈ సమస్య పరిష్కారానికి మార్గం సగమమం చేసింది. గత మూడేళ్లుగా నడుస్తున్న ఈ వివాదంలో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఏపీ స్థానికత ఆధారంగా ఉద్యోగులను రిలీవ్ చేయడాన్ని తప్పు పట్టింది .ఈ విధంగా ఉద్యోగులను రిలవ్ చేయటం రాజ్యాంగ విరుద్ధం అని హైకోర్టు వ్యాఖ్యానించింది. అంతకు ముందు ఈ కేసుపై సుదీర్గ వాదనలు విన్న హైకోర్టు ఉద్యోగుల రిలీవ్‌ను తప్పు పట్టింది. దీంతోపాటు ఉద్యోగులకు వేతనంగా చెల్లించిన మొత్తాన్ని కూడా ఏపీకి తిరిగి చెల్లించాలని పేర్కొంది. ఉద్యోగుల వివాదంపై కమిటీని ఏర్పాటు చేయాలని పేర్కొంది. నాలుగు నెలల్లో విద్యుత్ ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది.

లఘు చిత్ర దర్శకుడికి జాతీయ అవార్డు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సామాజిక స్పృహ, సమాచారంలోని దురాచారాలపై సందేశాత్మక లఘు చిత్రాలు తీస్తున్న ఢిల్లీకి చెందిన దర్శకుడు డాక్టర్ ఆనంద్‌కు జాతీయ అవార్డు దక్కింది. బాలికా విద్య మీద రూపొందించిన ప్రజాహక్కు, శతాబ్దాలుగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న సామాజిక రుగ్మత అయిన అంటరానితనం మీద తీసిన అంటురానితనం, గిరిజన కుటుంబం నుంచి వచ్చిన ఓ ఆడపిల్లలో ఉన్న సూపర్ పవర్‌పై తీసిన చిరుతేజ్ సింగ్ అనే షార్ట్ ఫిల్మ్‌లకుగానూ ఆయనకు ఈ అవార్డు దగ్గింది. హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో జరిగిన జాతీయ మహిళా సదస్సు-2017 కార్యక్రమంలో ఆనంద్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టాలీవుడ్ నిర్మాతలు రాజ్ కందుకూరి, సుదర్శన్ రెడ్డి, కెమెరామ్యాన్ సెంథిల్, ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు, రచయిత జొన్నవిత్తుల తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ భాషల్లో మహిళా సాధికారత, బాలికా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలపై నిర్మితమైన లఘు చిత్రాలను ఓ కమిటీ పరిశీలించి ఉత్తమ చిత్రాలకు ఈ జాతీయ అవార్డును అందజేస్తుంది. ఆడపిల్లల జీవితాలను ప్రభావితం చేసే వరుసగా మూడు సందేశాత్మక షార్ట్ ఫిల్మ్‌లు తీసినందుకుగానూ ఈ ఏడాది డాక్టర్ ఆనంద్‌కు జాతీయ అవార్డు వచ్చింది. అవార్డు గ్రహీతకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నుంచి అభినందన పత్రం లభించడం మరో విశేషం. నల్గొండ జిల్లాలోని నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టిన ఆనంద్ ఎన్నో కష్టానష్టాలకోర్చి వైద్య రంగంలో ఎండీ పూర్తి చేసి ఢిల్లీలో ప్రభుత్వ డాక్టర్‌గా స్థిరపడ్డారు. అయితే సినిమా రంగం మీద ఉన్న ఆసక్తి ఆయనను షార్ట్ ఫిల్మ్స్ నిర్మాణం వైపు నడిపించింది. సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచారాలు, మహిళలకు ఏదైనా మంచి చేయాలనే తపనతో తన వంతుగా లఘు చిత్రాలు నిర్మిస్తున్నానని డాక్టర్ ఆనంద్ చెప్పారు.

ప్రేమ్‌సాగర్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్,ఆంధ్రప్రభ: మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు కు ఎస్టీ కేటగిరీ నుంచి లంబాడాల ను తొలగించాలని జరుగుతున్న ఆదివాసీల ఉద్యామానికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారనే ఆరోపణలతో తనపై పోలీసులు నమోదు చేసిన మొత్తం 25 కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థిస్తూ కాంగ్రెస్‌పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు దాఖలు చేసిన 25 క్రిమినల్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజనీ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా, ఉట్నూర్ గ్రామంలో గత డిసెంబర్ మాసంలో జరిగిన ఘటనలో ప్రేమ్ సాగర్ రావు తో పాటు పలువురిపై వివిధ పోలీసు ఠాణాల్లో పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ రెడ్డి వాదనలు వినిపిస్తూ...ప్రేమ్ సాగర్ రావు సన్నిహితులు ఓ బహిరంగసభలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, ఆదివాసీలకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు తమ వద్ద తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయని విన్నవించారు. అందువల్ల పిటిషనర్ కు బెయిలు మంజూరు చేయరాదని అభ్యర్థించారు. పీపీ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి బెయిలు పిటిషన్లను కొట్టివేశారు.

చిన్నారి శవాన్ని పీక్కుతిన్న ఎలుకలు

• నర్సాపూర్ ఆసుపత్రిలో వెలుగు చూసిన వైనం

మెదక్, ప్రభన్యూస్: ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చనిపోయిన చిన్నారి మృతదేహాన్ని ఎలుకలు పీక్కుతున్న ఘటన మెదక్ జిల్లా, నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రిలో జరిగింది. వివరాల్లోకి వెళ్ళితే..కౌడిపల్లి మండలం బతుకమ్మ తండాకు చెందిన కిషన్‌కు సురేఖాతో గత ఏడాది వివాహం జరిగింది. మూడు నెలల క్రితం సురేఖకు ఆడ కూతురు జన్మించింది. కానీ పసికందుకు అనారోగ్యంతో బాధపడుతుండగా గురువారం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు ఉండడంతో సురేఖ భర్త కిషన్‌పై అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పసికందు మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మార్చురీలో శవాన్ని ఉంచి డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో మార్చురీలో ఉన్న ఎలుకలు చిన్నారి మృతదేహాన్ని పీక్కుతిన్నాయి. చిన్నారి నోరు, తొడ, వేలు భాగాలను కొరికివేశాయి. శుక్రవారం విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు. నర్సాపూర్ ఆసుపత్రిలో మార్చురీ గది శిథిలావస్థకు చేరడంతో అక్కడ మృతదేహాలకు భద్రత లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. పసికందు మృతదేహాన్ని ఎలుకలు కొరికివేయడంతో డాక్టర్ల, సిబ్బంది నిర్లక్ష్యానికి సాక్ష్యంగా నిలుస్తోంది.

ఫేస్‌బుక్ పరిచయంతో

థియేటర్లో యువతిపై అత్యాచారం

హైదరారబాద్, ఆంధ్రప్రభ: ఫేస్‌బుక్‌లో రెండు నెలల క్రితం పరిచయమైన యువతితో ఓ యువకుడు థియేటర్‌లోనే లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. విషయం బయటకు చెబితే పరువు తీస్తానని బాధితురాలిని నిందితుడు హెచ్చరించడంతో ఆమె ఈ విషయాన్ని బయటకు చెప్పలేదు. చివరకు తల్లిదండ్రులకు చెప్పడంతో నిందితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు కారణమైన నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియా జీవితంలో బాగంగా మారుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా నర్మెట్ట గ్రామానికి చెందిన భిక్షపతికి ఫేస్‌బుక్ ద్వారా సికింద్రాబాద్‌కు చెందిన ఓ యువతితో పరిచయమైంది. ఇంటర్ పూర్తి చేసిన ఆ యువతి ఇంట్లోనే ఉంటోంది. రెండు నెలల క్రితం భిక్షపతితో ఆ యువతికి పరిచయమైంది. పది రోజులుగా వారిద్దరూ ఫేస్‌బుక్ ద్వారా ఛాటింగ్ చేస్తున్నారు. పెళ్లి చేసుకుంటానని భిక్షపతి ఆ యువతికి మాటిచ్చాడు. దీంతో ఇద్దరూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఫేస్‌బుక్ పరిచయమే కొంప ముంచిందని ఆ యువతి ఆలస్యంగా గుర్తించింది. థియేటర్‌లో బాధితురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు భిక్షపతిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సినిమా నడుస్తున్న సమయంలోనే యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో థియేటర్ యాజమాన్యంపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు స్పష్టపర్చారు.

టీఎస్‌ఆర్టీసీలో ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు

• మెట్రో మార్గాల్లో నడిపేందుకు చర్యలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టిఎస్‌ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను ప్రవేశపెట్టబోతుంది. తొలి దశలో అద్దె ప్రాతిపాదికన 40 బస్సులను సేకరించాలని సంకల్పించింది. సాధ్యమైనంత త్వరగా ఎలక్ట్రిక్ బస్సులను రోడెక్కించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండవ విడత మరో 60 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను అద్దెకు తీసుకొనేందుకు సమాయత్తమైంది. ఆసక్తిగలిగిన సంస్థల నుండి ఈ నెల 16 నాటికి ఆర్టీసీకి ప్రతిపాదనలు అందే విధంగా టెండర్లను ఆహ్వానించింది. హైదరాబాద్‌లో 100 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను తిప్పడంతో ఇంధన మార్పు ప్రక్రియకు శ్రీకారం చుట్టబోతున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇప్పటికే నగరంలో ఏసీ బస్సుల ప్రయోగం విజయవంతమైందన్నారు. మెట్రో రైలు మార్గాల్లో ఈ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను తిప్పాలని ప్రతిపాదించారు. సీఎన్‌జీ బస్సులను తిప్పడంలో ఉత్పన్నమవుతున్న సమస్యలను అధిగమించడంతో పాటుగా హైదరాబాద్‌లో వాహన కాలుష్యం తగ్గించాలనే సంకల్పంతో ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను ప్రతిపాదించామని తెలిపారు. తొలి దశలో సొంతంగా కొనుగోలు చేయబోమని, అద్దె బస్సులను తిప్పిన అనుభవాన్ని పరిగణలోకి తీసుకొని సొంత ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను కొనుగోలు చేసే అంశంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

అద్దె బస్సులను వ్యతిరేకిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్

ఆర్టీసీలో అద్దె బస్సుల సంఖ్యను పెంచడాన్ని ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. సొంత బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తుంది. పరిమితికి మించి అద్దె బస్సులను సమకూర్చుకోవడంతో ఆర్టీసీని దశల వారిగా బలహీన పరిచే కుట్ర జరుగుతుందని ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అద్దె బస్సుల సంఖ్య పెరిగిందని, అవసరమైన మేరకు సొంత బస్సులను సమకూర్చుకోలేక పోతున్నామని వెల్లడించారు.

హెలికాప్టర్ల ఢీ... ఐదుగురి మృతి

పారిస్: ఫ్రాన్స్‌లోని సెయింట్ ట్రోపెజ్ ఉత్తరాన రెండు మిలటరీ హెలికాప్టర్లు ఢీకొని ఐదుగురు మరణించారు.ఈ పైలట్లలో ఉన్న వారు శిక్షణలో ఉన్న పైలట్లనిఅధికారులు తెలిపారు. కాబస్సీ ,కార్సెస్సీ పట్టణాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది.పోలీసులు ఆ ప్రాంతానికిచేరుకుని శిథిలాల నుంచి మృత దేహాలను వేరు చేస్తున్నారు. ఆ ప్రాంతానికి ఎవరూ రాకుండా వలయాకారంలో ఏర్పడి భద్రత కట్టుదిట్టం చేశారు.

సీడ్ దొరక్క డీలా! ఆక్వా సాగు ఎలా?

• సిండికేట్‌గా మారిన హేచరీలు • భారీగా పెరిగిన ధర • సాగుకు ఎదురుచూస్తున్న లక్షల ఎకరాలు • మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ శూన్యం • ఆందోళన చెందుతున్న రైతాంగం

అమరావతి, ఆంధ్రప్రభ: మ్త్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆక్వా పరిశ్రమ సంక్షోభంలో పడుతోంది. ఎప్పటికప్పుడు ఆక్వా రైతులతో సమన్వయం చేసుకుంటూ వారికి చేదోడువాదోడుగా ఉండాల్సిన సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు తీవ్రస్థాయిలో వ్యక్తమౌతున్నాయి. ఉన్నత స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని పలువురు ఆక్వా రైతులు వాపోతునారు. రొయ్యల సాగుకు సీజన్ ప్రారంభమైనప్పటికీ సకాలంలో సీడ్ అందక ఆక్వా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆక్వా విభాగం పర్యవేక్షించే కీలక అధికారి నిర్లక్ష్యవైఖరి కారణంనే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో అందని సీడ్


నానాటికీ పెరుగుతున్న ధరలతో ఆక్వాసాగు చేయలేక అయోమయంలో పడుతున్నారు. రొయ్యల సాగు కష్టతరమవుతుందని ఆక్వా రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగు చేసేందుకు గుంతలు సిద్ధం చేసుకున్నా సకాలంలో రొయ్య పిల్లలు హేచరీల నుంచి సరఫరా కావడం లేదు. సీజన్ ప్రారంభమైనా రొయ్య పిల్లలు పూర్తి స్థాయిలో దొరక్క ఆక్వా రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉత్తరాంధ్రలోని కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, విశాఖ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో లక్షలాది ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ మాసంలోనే రొయ్యల సాగుకు రైతులు ఏర్పట్లు చేసుకుంటారు. జనవరి మాసానికల్లా పిల్లలను చెరువుల్లో వదులుతారు. అయితే ఈ ఏడాది జనవరి నెల దాటినప్పటికీ రైతులకు సీడ్ అందలేదు. దీంతో రొయ్య పిల్లలు అందక ఆక్వా రైతులు అష్టాకష్టాలు పడుతున్నారు.

ఒక్కసారిగా పెరిగిన సీడ్ ధరలు

హేచరీలు మాత్రం రొయ్యల పిల్లలను సకాలంలో అందచేస్తామని చెప్పి రోజులు గడుపుతున్నారు. పిల్ల ఒక్కింటికీ 40 పైసల చొప్పున డబ్బులు కట్టించుకుంటున్నారు. అయితే ఈసారి రైతులు సాగుకు ఎక్కువ మొగ్గు చూపడంతో డిమాండ్ బాగా పెరిగింది. దీంతో హేచరీలు సీడ్ ధర 10 నుంచి 20 పైసలు పెంచేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేసున్నారు. రాష్ట్రంలో ఉన్న హేచరీలు అన్ని మూకుమ్మడిగా ధరలు పెంచడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

సాధారణంగా ఎకరాకు లక్ష వరకు పిల్లలను రైతులు చెరువులలో వదులుతారు. కానీ ప్రస్తుతం ఉన్న ధర పెరుగు దల, డిమాండ్ రీత్యా 60 నుంచి 70 వేల వరకు వదలాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని హేచరీలు డిమాండ్ సృష్టించి సరిగ్గా సీడ్ సరఫరా చేయకపోవడంతో చెరువులలో నీరు పట్టిన రైతులు పిల్లల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాగే చెరువులో ఎక్కువ రోజులు పిల్లలను వదలకుండా ఉంటే చెరువులలో పాచి పడుతుందని, తర్వాత పిల్లలను వదిలితే వాటికి జబ్బులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> రొయ్యల సాగు చేస్తున్న రైతులు పెరిగిన ధరలతో అతలాకుతలం అవుతున్నారు. సీడ్, ఫీడ్ ధరలకు పెరిగిపోవడంతో పాటు తాజాగా చెరువులలో చల్లే బ్లీచింగ్ ధరలు, సున్నం
>
> **పెరిగిన ఖర్చులు**
>
> ధరలు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. బ్లీచింగ్ ధర ఒక్కసారిగా బస్తాకు రూ150 పెరిగిందని వారు చెబుతున్నారు. ఇట్లాగే కనుక కొనసాగితే రొయ్యల సాగు చేయడం కష్టసాధ్యమంటున్నారు.



సిండికేటైన హేచరీలు

రైతులతో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం అనుకున్న ధరలకు సీడ్ సరఫరా చేయల్సిన హేచరీలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. ఎంత ధరకు సీడ్ సరఫర చేస్తామన్నారో అంత కాకుండా ఒక్కసారిగా ధరలు పెంచేశారని రైతులు వాపోతున్నారు. డబ్బులు ముందుగా తీసుకుని కూడా హేచరీలు సీడ్ సరఫరా చేయడం లేదని కృత్రిమ డిమాండ్ సృష్టించి తమలు ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని మత్స్యశాఖ ఆక్వా అధికారులు

ఇంత జరుగుతున్నా మత్స్యశాఖ అధికారులకు తమ సమస్యలు పట్టడం లేదని ఆక్వా రైతులు మండి పడుతున్నారు. పిల్లలను సరఫరా చేయడంలో కానీ, ధరల నియంత్రించడంలో కానీ చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. హేచరీల నుంచి ముడుపులు అందటం వల్లే అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, సీడ్ అందుబాటులోకి తీసుకురావాలని, సబ్సిడీని పెంచి తమను ఆదుకోవాలని ఆక్వా రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇ-వేకు బ్రేక్!

(మొదటిపేజీ తరువాయి)

జీఎస్టీ నెట్‌వర్క్(జీఎస్టీఎన్)ను ఆదేశించింది. జీఎస్టీకి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విషయంలో వెన్నుదన్నుగా నిలుస్తున్న జీఎస్టీఎన్ పన్ను ఎగవేతలకు చెక్ పెట్టేందుకు ఈనెల 1వ తేదీన ఇ-వే బిల్లు వ్యవస్థను అమలులోకి తీసుకువచ్చింది. అయితే ప్రారంభంలో ఎదురౌతున్న ఇబ్బందులు, వాహనదారులు లేవెనెత్తుతున్న సమస్యల నేపథ్యంలో ఇ- వే బిల్లులను తాత్కాలికంగా నిలిపివేసి మళ్లీ అమలు చేయాలని ఆర్థిక శాఖ భావిస్తోంది. ఈనేపథ్యంలో ఇ -వే బిల్లు వ్యవస్థకు సంబంధించిన పూర్థి వివరాలు ఇవ్వాలని ఆర్థిక శాఖ కార్యదర్శి హస్ముఖ్ అధియా జీఎస్టీ నెట్‌వర్క్ ను ఆదేశించారు. ఇ- వే బిల్లు చెల్లించిన వాహనదారులు వాటిని వెంట తీసుకువెళ్లేలా కొత్త విధానాన్ని అమలు చేయాలని ఆర్థిక శాఖ యోచిస్తోంది. అయితే పన్ను ఎగవేత దారులకు చెక్ పెట్టేందుకు ఆయుధం లాంటి ఇ-వే బిల్లుపై ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని.. వ్యవస్థ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాక తిరిగి ప్రవేశపెడతామని స్పష్టం చేశారు. జీఎస్టీ కింద అమలులోకి తెచ్చిన ఇ-వే బిల్లులు 50వేల రూపాయలకు మించిన సరకురవాణా చేసే వాహనదారుల నుంచి వసూలు చేస్తారు. ఈ బిల్లును జీఎస్టీనెట్‌వర్క్ ద్వారా జనరేట్ చేస్తారు. ఇ-వే బిల్లు అమలుపై స్పందించిన అధియా పారిశ్రామిక వర్గాల డిమాండ్ల మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సరకు రవాణా చేసే వారుకూడా ఇబ్బందులు పడకుండా ఇ-వే వ్యవస్థను అమలు చేయాలనే బిల్లులను కొన్ని రోజుల పాటు నిలిపివేస్తున్నామన్నారు. ఇ-వే బిల్లుల చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు ఎదురౌతున్నాయో.. ఎన్నిరోజుల్లో సమస్య పరిష్కారమౌతుంది అనే అంశాలపై నేను జీఎస్టీఎన్ ఛైర్మన్ ఏపీ పాండేతో చర్చించా.ఇ-వే బిల్లులకు సమర్థవంతమైన వ్యవస్థ వచ్చిన తర్వాత అమలు చేద్దామని చెప్పా. అని అధియాఅన్నారు. ఇ- వే బిల్లులను సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని రాష్ట్రాలు కూడా పట్టుబట్టిన నేపథ్యంలో ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి తీసుకురాగా.. సర్వర్‌పై ఎక్కువ లోడ్ పడటంతో బిల్లుల చెల్లింపు ప్రక్రియ నెమ్మదిగా సాగిందని తెలిపారు. ఈనేపథ్యంలో సమర్థవంతమైన వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇ-వే బిల్లులను అమలు చేయాలని ఆర్థిక శాఖ భావిస్తోందని అధియా తెలిపారు. ఇ-వేబిల్లు పోర్టల్‌ను నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ రూపొందిచగా.. జీఎస్టీఎన్ దాన్ని తాత్కాలికంగా లాక్ చేసింది.

మోడీ బడ్జెట్ దెబ్బ మార్కెట్లకు ఫ్లైడే!



• ఒక్క రోజులో రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి • దారుణంగా దెబ్బతిన్న సెంటిమెంట్ • సెన్సెక్స్ 840 పాయింట్ల పతనం • ఐటీ తప్ప అన్ని షేర్లూ కుదేలు

ముంబై: బెంచ్‌మార్క్ సెన్సెక్స్ రెండేళ్ళకు పైబడిన కాలంలో అత్యంత దారుణమైన పతనాన్ని శుక్రవారం చవిచూసింది. ఈక్విటీలపై పన్ను విధిస్తూ బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలు ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. 30 షేర్ల ఇండెక్స్ 840 పాయింట్లకు పతనమైపోయింది. 2015, ఆగస్టు 24 తర్వాత ఒక్క రోజులో భారీ పతనాన్ని నమోదు చేసుకుంది. నిఫ్టీ 250 పాయింట్లకు పైగా పతనంతో 10,800 మార్కుకు దిగువన ముగిసింది. స్టాకులు పేక ముక్కలా పడిపోవడంతో ఇన్వెస్టర్లు రూ.4.75 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. ప్రభుత్వంపై భారీగా రుణ భారం పడుతుందని ఫిచ్ రేటింగ్స్ వెల్లడించడంతో మార్కెట్‌లో మరోసారి ప్రకంపనలు చోటు చేసుకున్నాయి.

దేశీయ మదుపర్ల విక్రయాలు.. విదేశీ మదుపర్ల కొనుగోళ్ళు


ప్రతిష్ఠాత్మక సెన్సెక్స్ 839.91 పాయింట్లు లేదా 2.34 శాతం నష్టంతో 35,066.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 256.30 పాయింట్లు లేదా 2.33 శాతం నష్టంతో 10,760.60 వద్ద ముగిసింది. ఇంట్రా డే వద్ద కనిష్టంగా 10,736.10 నమోదు చేసుకుంది. ఒక వారం ప్రాతిపదికగా చూసినప్పుడు సెన్సెక్స్ 983.69 పాయింట్లు లేదా 2.72 శాతం తగ్గుముఖం పట్టింది. నిఫ్టీ 309.05 పాయింట్లు లేదా 2.79 శాతంతో పతనం చవిచూసింది. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.358.50 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల నెట్ రూ.1,099.780 కోట్ల విలువైన షేర్లను గురువారం కొనుగోలు చేశారు.

బిత్తరపోయిన బజాజ్ ఆటో

సెన్సెక్స్‌లో 4.90 శాతం పతనంతో బజాజ్ ఆటో భారీగా దెబ్బ తిన్నది. 4.62 శాతం నష్టంతో భారతీ ఎయిర్‌టెల్ తర్వాతి స్థానానికి చేరుకుంది. యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి, రియలన్స్ ఇండస్ట్రీస్, టాటా స్టీల్, ఎం అండ్ ఎం, హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్, ఐసిఐసిఐ బ్యాంక్, హీరో మోటోకార్ప్, కోటక్ బ్యాంక్, ఎల్ అండ్ టి, ఎస్‌బిఐ, టాటా మోటార్స్, యస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టిపిసి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 4.28 శాతం నష్టపోయాయి. అన్ని రంగాల సూచీలు తిరోగమనం పొందాయి.

బావురుమన్న బీఎస్ఇ రియాల్టీ

బీఎస్ఈ రియాల్టీ 6.28 శాతం నష్టపోయింది. ఆ తర్వాతి స్థానాల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(4.03 శాతం), పవర్(3.94 శాతం), కేపిటల్ గూడ్స్(3.59 శాతం), ఆటో(3.47 శాతం), కన్జ్యూమర్ డ్యూరబుల్స్(3.37 శాతం), ఫైనాన్స్(3.23 శాతం), పిఎస్‌యు(3.11 శాతం) , ఆయిల్ అండ్ గ్యాస్(3.04 శాతం) నష్టపోయాయి. విస్తృతమైన మార్కెట్లు సైతం జావగారిపోయాయి. స్మాల్ కేప్ ఇండెక్స్ 4.65 శాతం పతనం కాగా, మిడ్ కేప్ ఇండెక్స్ 4.03 శాతం దిగజారింది.



బడ్జెట్‌పై సెన్సెక్స్ అవిశ్వాస తీర్మానం

మార్కెట్ల పతనంపై రాహుల్ ట్వీట్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బడ్జెట్‌కు సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీపై శుక్రవారం వ్యంగ్య ట్వీట్ చేశారు. సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా పతనమైన నేపథ్యంలో స్టాక్ మార్కెట్ బడ్జెట్‌పై అవిశ్వాస తీర్మానం ఇచ్చిందని అన్నారు. పార్లమెంటరీ భాషలో చెప్పాలంటే మోడీ బడ్జెట్‌పై సెన్సెక్స్ ఘనమైన 800 పాయింట్ల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిందని రాహుల్ ట్వీట్ చేశారు. అలాగే మోడీ ప్రభుత్వానికి మరో ఏడాది కాలం మాత్రమే ఉందనే అర్థం వచ్చేట్టుగా తన ట్వీట్‌కు బస్‌ఏక్‌అవుర్‌సాల్ అనే హ్యాష్‌టాగ్ వాడారు.

రాష్ట్రంలో నకిలీ మద్యం మాఫియా!

- ఖరీదైన సీసాల్లో నాసిరకం మద్యం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో దందా
- రెండు ముఠాల గుట్టురట్టు
- ప్రాణాంతకమంటున్న అధికారులు
- వివరాలు వెల్లడించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో నకిలీ మద్యం మాఫియా విజృంభిస్తోంది. జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలను ఆవాసంగా చేసుకున్న వ్యవస్థీకృత ముఠాలు కల్తీ, నకిలీ(డూప్లికేట్) మద్యం తయారు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడంతో పాటు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. కల్తీ మద్యం ముఠాను పట్టుకున్న రోజుల వ్యవధిలోనే ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాల్లో నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్న రెండు ముఠాలను ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఖరీదైన మద్యం సీసాల్లో నాసిరకం మద్యం నింపి పరిసర ప్రాంతాల్లోని బెల్టు షాపులకు సరఫరా చేస్తున్న వ్యక్తులతో పాటు మద్యం షాపు నిర్వహకుడు, నకిలీ మద్యం కోసం మూతలు తయారు చేసి లేబుల్ ముద్రిస్తున్న వ్యక్తులను, వీటిని నకిలీ మద్యం విక్రేతలకు చేరవేస్తున్న ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నిర్వహకుడు సహా ఐదుగురిని అరెస్టు చేశారు. గత నెలలో ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు అరెస్టు చేసిన రేపల్లే కల్తీ మద్యం కేసులో మూతలు సరఫరా చేసిన వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో విశాఖజిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన తనకాల అనంత రామ నరసింగరావు అలియాస్ అనంత్, హైదరాబాద్ బాలానగర్‌లోని స్వాతి ఇండస్ట్రీస్ యజమాని గంజి శ్రీనివాస్, హైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన చల్లా చంద్రశేఖర రెడ్డి, బాలానగర్ శ్రీలక్ష్మీ రోడ్‌వేస్ యజమాని వోడేపల్లి సూర్యనారాయణ, హైదరాబాద్ చింతల్‌బస్తీకి చెందిన కాముని నాగరాజు ఉండగా, రేపల్లే కేసులో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లికి చెందిన పైబోర్న వెంకట కిరణ్ ఉన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం విజయవాడలోని ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. గత నెల 29వ వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు శ్రీకాకుళం ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల, పాలకొండ ఎక్సైజు అధికారులు శ్రీకాకుళం ఎఇఎస్ బి.శ్రీనివాస్ నేతృత్వంలో శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండల కేంద్రంలోని మీసాల తిరుమలరావు ఇంటిపై దాడి చేశారు. ఇతనితో పాటు మీసాల ఈశ్వరరావు, లావేటి వెంకట రత్నంను అదుపులోకి తీసుకొని నాసిరకం మద్యంను ఖరీదైన సీసాల్లో నింపుతున్నట్లు గుర్తించి వివిధ రకాల బ్రాండ్లకు చెందిన సీసా మూతలను స్వాధీనం చేసుకున్నారు. గోల్డ్ రిబండ్ పేరిట 15వేల మూతలు, ఇంపీరియల్ బ్లూ పేరిట 583, ఆఫీసర్స్ చాయిస్ పేరిట ఉన్న 757 నకిలీ మూతలతో పాటు కొన్ని ఖాళీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే వీరఘట్టం మండలం విక్రమ్‌పురం గ్రామంలోని మెస్సర్స్ జనతా వైన్స్‌పై దాడి చేసి మాచర్ల అనిల్ బాబును అరెస్టు చేశారు. తదుపరి దర్యాప్తులో విశాఖ జిల్లా గుండాల వీధికి చెందిన అడారి సూరిబాబు ద్వారా తిమ్మరాజుపేటకు చెందిన అనంత్‌కు నకిలీ మూతలు సరఫరా చేసి మద్యం తయారు చేయిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారాలను చక్కబెట్టినందుకు సూరిబాబుకు అనిల్ పెద్ద మొత్తంలో కమిషన్ ముట్టచెపుతున్నట్లు అధికారులు గుర్తించారు. అనంత్‌ను తమదైన శైలిలో విచారించిన ఎక్సైజు అధికారులు ఒక వాహనంలో టాటా వాహనంలో ఉన్న 60వేల నకిలీ మూతలు స్వాధీనం చేసుకున్నారు. సమగ్ర దర్యాప్తులో భాగంగా స్టేట్ టాక్స్‌ఫోర్స్ డీఎస్పీ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశం, ఎస్ స్వామినాధన్ సిబ్బందితో కలిసి హైదరాబాద్‌లో మూతలు తయారు చేస్తున్న గంజి శ్రీనివాస్, మూతలపై లేబుల్ ముద్రిస్తున్న చంద్రశేఖర రెడ్డి, వీటిని ముఠాకు అందించడంలో సహకరిస్తున్న ట్రాన్స్‌పోర్టు యజమాని సూర్యనారాయణ, కల్తీ మద్యం రాకెట్ ప్రధాన సూత్రధారికి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న కాముని నాగరాజును అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో భాగంగా మెస్సర్స్ జనతా వైన్స్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ తెలిపారు.

దందా ఇలా..

ముందుగా ఖరీదైన బ్రాండ్ల పేరిట ఉన్న ఖాళీ క్వార్టర్‌బాటిల్స్‌ను సేకరిస్తుంటారు. అనంతరం నాసిరకం మద్యం పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి ఖాళీ బాటిళ్లలో నింపడంతో పాటు ముందుగానే సిద్ధం చేసుకున్న మూతలను బిగిస్తారు. అనంతరం వీటిని మారుమూల ప్రాంతాల్లోని బెల్టు షాపులకు సరఫరా చేయడం ద్వారా లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నట్లు అధికారుల విచారణలో వెలుగు చూసింది. రేపల్లో పట్టుబడిన నకిలీ మద్యం వ్యాపారంలో వెయ్యి లీటర్ల రెక్టిఫైడ్ స్పిరిట్‌ను తీసుకొచ్చి రూ.4లక్షలు ఖర్చు చేస్తే రూ.16లక్షలు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. విశాఖ జిల్లాలో పట్టుబడిన 60వేల నకిలీ మూతల ద్వారా సరఫరా చేసే మద్యంతో అన్ని ఖర్చులు పోను రూ.25లక్షలు లాభంగా ఆర్జిస్తుంటారని అధికారులు చెపుతున్నారు.

ప్రాణాంతకం..

అనధికారికంగా తయారు చేసి విక్రయించే ఇలాంటి మద్యం కారణంగా ప్రాణాపాయ పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. తగిన అవగాహన లేకుండా ఇష్టమొచ్చినట్లు తయారు చేయడం, కల్తీ చేయడం వలన ఉన్న అనర్థాలను దృష్టిలో ఉంచుకొని మద్యం కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ తరహా మద్యం తయారీ, అమ్మకాలపై సమాచారం ఉంటే ఎక్సైజు అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు. నకిలీ, కల్తీ మద్యం కేసుల్లో ముఠాల గుట్టు వెలికితీసి నిందితులను అరెస్టు చేసిన అధికారులు, సిబ్బందికి రివార్డులు ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు.

సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న కాంగ్రెస్

- రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ల నియామకం
- ప్రజా సమస్యలపై ప్రధాన దృష్టి

అమరావతి, ఆంధ్రప్రభ: తెలుగు ప్రజలను విడదీసేలా..రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి మూల్యం చెల్లించుకున్న కాంగ్రెస్ పార్టీ, మళ్లీ ప్రజల్లోకి వెళ్లేందుకు, వారితో మమేకమయ్యేం దుకుగాను వ్యూహరచన చేస్తోంది. కాంగ్రెస్ పార్టీలో తలపండిన నాయకుల సూచనలు, సలహాలను స్వీకరిస్తూ, అదే క్రమంలో పార్టీలో యువతకు ప్రాధాన్యం కల్పించే దిశలో ఆ పార్టీ అడుగులు వేస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ ఎంపికయ్యాక పార్టీలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టే ప్రక్రియ దాదాపుగా ప్రారంభమయినట్లేనని నాయకులు భావిస్తున్నారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలి నియామకంతో రాహుల్ పార్టీలో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ పార్టీలో పార్టీ అనుబంధ సంఘాల్లో ముఖ్యంగా సోషల్ మీడియాలో యువతకు అత్యధిక ప్రాధాన్యత కల్పించాలన్నది రాహుల్ యోచనగా ఉందని కాంగ్రెస్ పార్టీ లోని సీనియర్ నాయకులు అభిప్రాయపడ్తున్నారు. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుం టున్నాయి. ఒక నియోజక వర్గంలో ప్రజలు పలానా సమస్యను ఎదుర్కొంటున్న సందర్భాన్ని సోషల్ మీడియా యాక్టివిస్టులు ఆ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు పార్టీ కేంద్ర కార్యాలయానికి నేరుగా పంపిస్తారు. అక్కడ కేంద్ర కార్యాలయం నుంచి అందే సూచనల ప్రకారం పార్టీ క్యాడర్ కార్యాచరణ ప్రణాళికకు సమాయత్తమ వుతుంది. ఇదంతా జరగాలంటే సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరించే యువతకు ప్రాధాన్యత కల్పించాల్సి ఉంది. ఈ మేరకు రాహుల్ ఆదేశాలు, సూచనలతో ఏపిసిసి అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి శుక్రవారం 13 జిల్లాలకు ఐటి సెల్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లను నియమిం చారు. ఆయా జిల్లాల, నగరాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోషల్ మీడియా కో- ఆర్డినేటర్లకు సహకారం అందించాలని అదే మాదిరిగా అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ల నియామకాలకు సంపూర్ణ సహకారం అందించాలని రఘువీరా నియామకపు ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ప్రకారం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు డాక్టర్ బి సతీష్, విశాఖపట్టణం అర్బన్,రూరల్‌కు మనోహర్ గంగిరెడ్డి, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు తాళ్లూరి విజయకుమార్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఎస్‌కె మౌలాలి, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు అంబెటి రామకృష్ణ, అనంతపురం, కర్నూల్, చిత్తూరు, కడప జిల్లాలకు పిఎస్ అహ్మద్ హుస్సేన్‌ను సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లుగా నియమించారు. నియోజకవర్గాల వారీగా కో-ఆర్డినేటర్ల నియామకానికి గాను త్వరలో ఏపిసిసి సమావేశం కానుందని తెలిసింది.

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టారు: బొలిశెట్టి



విశాఖపట్నం: ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కొందరు ఢిల్లీలో మంటకలిపారని, నాలుగేళ్లుగా తప్పుడు సమాచారంతో రాష్ట్ర ప్రజలను మోసం చేశారని కాంగ్రెస్ నాయకుడు, సామాజిక ఉద్యమకారుడు బొలిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో బొలిశెట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీ కంభంపాటి హరిబాబులు తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసం చేయగలిగారన్నారు. ముఖ్యమంత్రి నిరంతరం అనేక ప్రకటనలు చేశారన్నారు. రాజధాని అమరావతి పేరిట పెట్టుబడులు, పోలవరం కోసం ప్రత్యేక హోదా అక్కరలేదు, ప్రత్యేక ప్యాకేజీ కేంద్రం ఇస్తుందని, అది రాష్ట్రాభివృద్ధికి సరిపోతుందని చెప్పుకొచ్చారన్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లోనూ, ఆర్థికంగానూ పూర్తిగా వెనుకబడిం దన్నారు. ప్రారంభంలోనే హోదా కోసం పట్టుబట్టి ఉంటే రాష్ట్రానికి ఈ గతి పట్టేది కాదన్నారు. కమీషన్ల కక్కుర్తితో హక్కుగా రావల్సిన ప్రత్యేక హోదా వదిలి ప్రత్యేక ప్యాకేజీ వలలో పడి రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టిన చంద్రబాబును పెట్టుబడి దారులు క్షమించిన రాష్ట్ర ప్రజలు క్షమించబోరన్నారు. ఇదే సమయంలో పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన బీజేపీని కూడా ప్రజలు క్షమించే అవకాశం లేదన్నారు. 2018 బడ్జెట్‌తో రాష్ట్రప్రజలకి బీజేపీ , టీడీపీ ఇన్నాళ్లు కలిసి ఆడిన డ్రామా తెలుసుకోగ లిగారన్నారు. ప్రపంచంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 130 నుంచి వందవస్థానానికి ఎగబాకినందుకు పార్లమెం ట్‌లో కేంద్ర ఆర్థిక శాఖామంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించగానే అంతా బల్లలు చరిచారని, ఇదే సమయంలో పర్యావరణ పరిరక్షణ సూచిలో 141 నుంచి 177కు దిగజారినందుకు ఏం సమాధానం చెబుతారన్నారు. ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని, రాహుల్ నాయకత్వంలో అది ఖచ్చితంగా రాష్ట్రానికి వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కేంద్రానికి ముఖ్యమంత్రి ఎందుకు భయపడుతున్నారు?

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుగ్గన

ప్యాపిలి, ప్రభ న్యూస్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు భయపడుతున్నారో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని, కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారారేగానీ ఆంధ్రప్రదేశ్‌కు నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలం చెందారని, అలాంటప్పుడు వారితో మిత్రబంధం ఎందుకని డోన్ నియోజకవర్గం శాసన సభ్యుడు, పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రాచర్ల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యకర్తలతో కలిసి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు రాకపోవడం కారణమేమిటని, ఓ వైపు మిత్రబంధం అంటూ, టీడీపీ శాసనసభ్యులు, మంత్రులు కేంద్రంపై ఘాటుగా స్పందిస్తే వెంటనే వారిని అదుపు చేస్తున్నారని, కేంద్రాన్ని నిలదీసేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు సాహసించలేకపోతున్నారన్నారు. కేంద్రం ప్రభుత్వానిగానీ, తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్‌ను గానీ, పవన్‌కళ్యాణ్‌ను గానీ ఒక్క మాట కూడా అనవద్దని శాసనసభ్యులను సీఎం హెచ్చరించడం వెనుక ఉన్న రహస్యం ఏమిటన్నారు. పోలవరం ప్రాజెక్టు మధ్యలోనే నిర్మాణ పనులు ఆగిపోయే పరిస్థితి ఉన్నప్పటికీ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో రైల్వే విషయంలో కూడా ఏపీకి నిరాశే ఎదురైందని, రాష్ట్రప్రజలు ఎంతో అనుభవం ఉందని అనుకుని చంద్రబాబును సీఎంను చేస్తే నాలుగేళ్ళు లక్షలు ఖర్చులు చేసి విదేశాలకు తిరగడమే పనిగామారిందన్నారు. రాష్ట్రంలోని పలు అభివృద్ధి పథకాలలో కూడా భారీగా అవినీతి చోటుచేసుకుందని, ప్యాపిలి మండలంలోని జలదుర్గం, ఊటకొండ, చంద్రపల్లె, మాధవరం, పిఆర్.పల్లె తదితర గ్రామాలలో వ్యక్తిగత మరుగుదొడ్లలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటిపై ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేశామన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలు టీడీపీ ప్రభుత్వ పాలనపై విసుగుచెంది, అధికార పార్టీపై ప్రజలు నేరుగా ఆయనకు సమస్యలు విన్నవించుకుంటున్నారన్నారు. 2019 ఎన్నికలలో వైసీపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ జడ్పీటీసీ శ్రీరాములు, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు సీమసుధాకర్‌రెడ్డి, కమతం భాస్కరరెడ్డి, బోరెడ్డి కృష్ణారెడ్డి, రాచర్ల రామచంద్రారెడ్డి, దివాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బూరుగల తులసిరెడ్డి, శంకర్‌రెడ్డి, నేరేడుచెర్ల చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఊటకొండ గోపాల్‌రెడ్డి, గార్లదిన్నె రామసుబ్బయ్యయాదవ్, బోయిన్‌చెరువుపల్లె ఎంపీటీసీ కృష్ణానాయక్, మాజీ ఎంపిటిసి జలదుర్గం శీను, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలోనే కొనసాగుతున్నా

- విజయవాడ సెంట్రల్ టిక్కెట్ రాధాకే అని జగన్ చెప్పారు
- ఆయనతో కలిసి పనిచేయడానికి నాకేమీ అభ్యంతరం లేదు: గౌతంరెడ్డి



మాట్లాడుతున్న గౌతమ్ రెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: తాను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని ఆ పార్టీ నుండి సస్పెండ్ అయిన నేత పూనూరు గౌతమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన విజయవాడలోని తన కార్యాలయంలో తన అనుచరులతో సమావేశం నిర్వహించారు. జగన్ పాదయాత్రలో చెప్పిన విషయాలను వారితో చర్చించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాలా కాలం తరువాత తాను ఇటీవల పాదయాత్ర చేస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని కలిశానని చెప్పారు. తన మనోగతాన్ని ఆయనకు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి తనను పార్టీలో కొనసాగమని చెప్పారన్నారు. అయితే, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టిక్కెట్‌ను వంగవీటి రాధాకృష్ణకు ఇవ్వడం జరిగిందని తెలిపారన్నారు. ఆయనతో కలిసి పనిచేయాలని సూచించినట్లు వివరించారు. విజయవాడ నగంలో తాను కార్పొరేటర్‌స్థాయి నుండి అంచెలంచెలుగా తన స్వశక్తితో ఎదిగానని చెప్పారు. ఆదినుండి కమ్యునిష్టు భావజాలంతో పనిచేసిన తాను వైయస్‌రాజశేఖర రెడ్డి స్ఫూర్తితో పార్టీ మారానని తెలిపారు. అయితే, ఆమధ్యకాలంలో తన వ్యాఖ్యలను తప్పుదోవ పట్టించారని ఆవేదన వ్యక్తంచేశారు. తాను రాజకీయంగా వైయస్ కుటుంబాన్ని వీడే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. వంగవీటి రంగా కథనం ముగిసిన అధ్యాయమన్నారు. ఆయన భౌతికంగా మన మధ్యలేనందున ఆయనపై వ్యాఖ్యలు చేయడం తగదని చెప్పారు. పార్టీ గెలుపుకోం తాను కృషి చేస్తానని చెప్పారు. ప్రస్తుతం రాజకీయాలు కులాల కంపులో కొట్లాడుకుంటున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులు మారాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. కుల రాజకీయాలు ఎవరు చేసినా, ఏ రాజకీయ పార్టీ చేసినా తప్పకుండా వ్యతిరేకించాల్సిందేనన్నారు. మిమ్ములను పార్టీనుండి సస్పెండ్ చేశారు కదా అని విలేకరులు ప్రశ్నించగా తనకు ఇప్పటి వరకూ పార్టీ నుండి ఎటువంటి లేఖ అందలేదన్నారు. అయినా అధినేతను కలిసి తన అభిప్రాయాన్ని చెప్పానని, ఆయనే స్వయంగా పార్టీలో కొనసాగమన్నారని తెలిపారు. త్వరలోనే బెటర్ ఆంధ్రప్రదేశ్ అనే స్వచ్ఛంధ సంస్థను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈసంస్థ ద్వారా కులాల రొచ్చుపై పోరాడతానని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జగన్ తనకు ఒక సీటు కేటాయిస్తానని చెప్పారన్నారు.

రాష్ట్ర ప్రజల గుండెకోసిన కేంద్ర బడ్జెట్: పార్థసారథి

కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజల గుండె కోసేసినట్లుగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి అన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బిజెపి, టిడిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. విభజన చట్టంలోని అంశాలను ఎందుకు పట్టించుకోలేదనే విషయంపై టిడిపి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బాగుందా లేదా అనే దానికంటే విభజన నేపథ్యంలో మిగిలి ఉన్న ఆంధ్రప్రదేశ్ ను మరింత వెనకబడిన రాష్ట్రంగా మిగిల్చేలా బడ్జెట్ కేటాయింపులు చేశారన్నారు. కేంద్రం ఎన్నికల కోసమే ఈ బడ్జెట్ రూపొందించిందన్నట్లుగా ఉందేమో తెలియదు కాని ఏపీకు మాత్రం మొండిచెయ్యి చూపిందన్నారు. చంద్రబాబు రాష్ట్ర విభజన నుండి ఈ రోజు వరకు కూడా ఏ విధంగా ప్రజలను మోసం చేస్తున్నారో ప్రజలందరూ గమనిస్తున్నారని, రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించారు అని ఏపీలో, నాలేఖ వల్ల తెలంగాణా వచ్చిందని ముఖ్యమంత్రి చెప్పుకుంటున్నారన్నారు. గత నాలుగేళ్ళగా కేంద్రం తనకు అన్నివిదాలా సహకరిస్తుందని చెప్పి నేడు అన్యాయం జరిగిందని చెప్పడం చంద్రబాబుకే చెల్లిందన్నారు.

చంద్రబాబు చేతగానితనం వల్లే ఏపీకి అన్యాయం: బొత్స

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతగానితనం వల్లనే కేంద్రబడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్కు అన్యాయం జరుగుతోందని వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ నుంచే రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని ప్రతిపక్ష వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ పోరాటాలు చేస్తుంటే , కేంద్రంతో సఖ్యతగా ఉండాలని , ప్రతిపక్షాలు బీజేపీతో జతకట్టేందుకు ఇలాంటివి చేస్తున్నాయని చంద్రబాబు బురద చల్లారన్నారు. కేంద్రంతో సఖ్యతగా ఉండి ఇప్పటివరకూ ఏంసాధించాలో చంద్రబాబు చెప్పాలన్నారు. తన అనుభవంతో, ఢిల్లీలో తనకున్న పరిచయాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల సందర్భంలో ప్రకటనలు చేసిన చంద్రబాబు ఇప్పటిదాక తన అనుభవంతో ఏం అభివృద్ధి చేశారని నిలదీశారు. తన వ్యక్తిగత స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను బాబు ఢిల్లీలో తాకట్టు పెట్టారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని ప్రజలు కోరుతుంటే 14వ ఆర్థిక సంఘం ఒప్పుకోవటం లేదని కేంద్రం కంటే ముందుగానే చంద్రబాబు గొంతు చించుకుని , ప్యాకేజీ బ్రహ్మాండంగా ఉందన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఓటుకు కోట్లు కేసులో దొరికిపోయి ముద్దాయిగా మారిన తరువాత ఆర్భాటంగా ఏపీకి వచ్చిన ప్రయోజనాలన్నింటినీ చంద్రబాబు తాకట్టు పెడుతున్నారన్నారు. ఇంత చేతగాని సీఎం ఉండబట్టే బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరుగుతోందని బొత్స పేర్కొన్నారు.

ఆహారశుద్ధి రంగంలో అవకాశాలపై రేపు సదస్సు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆహార శుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామి చేసేందుకు మరో ముందడుగు పడుతోంది. రాజమహేంద్రవరంలో శనివారం నాడు జరిగే సదస్సు ఇందుకు కీలకం కానున్నది. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా నిర్వహించే ఈ సదస్సుకు అనేక మంది పారిశ్రామికవేత్తలు హాజరవుతున్నారు. ఆహార శుద్ధి రంగంలో అవకాశాలు అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో ఆహార శుద్ధి రంగంలోని నిపుణులు, ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులు పాల్గొంటున్నారు. ఆహార శుద్ధి రంగంలో ఉన్న అపార అవకాశాలు, ప్రభుత్వ విధానాలపై సదస్సులో ప్రధానంగా చర్చ జరుగుతుందని ఇండస్ట్రీస్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యదర్శి గిరిజా శంకర్ విలేకరులకు తెలియజేశారు. రాజమహేంద్రవరం హోటల్ రివర్ బేలో ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం

అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి చూపారని నిరసిస్తు ఏపిసిసి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రమంతటా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పలు జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. కొన్ని చోట్ల రోడ్లపైకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెండు ప్రభుత్వాల తీరుని నాయకులు తమ ప్రసంగాల్లో ఎండగట్టారు. ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక హోదా కల్పిస్తామని తొలుత చెప్పి తర్వాత ప్యాకేజీ పేరిట డ్రామాలు ఆడి కల్లబొల్లి మాటలతో ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగించారని పేర్కొన్న నాయకులు ప్రభుత్వాలను దుమ్మెత్తి పోశారు. పోలవరానికి నిధులు, దుగరాజ పట్నం పోర్ట్, విశాఖకు రైల్వేజోన్ వంటి అంశాలను కాంగ్రెస్ నాయకులు ప్రస్తావించారు. ఏపిసిసి కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో పిసిసి ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి మస్తాన్‌వలీ నిరసనకు నాయకత్వం వహించారు. శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి కిల్లి కృపారాణి, విశాఖలో డిసిసి అధ్యక్షుడు పసుపులేటి బాలరాజు, నగర అధ్యక్షుడు బెహరా భాస్కర్, కాకినాడలో పంతం నానాజీ, ఏలూరులో రజీవుల్లా బేగ్, నెల్లూరులో పనబాక కృష్ణయ్య, అనంతపురంలో దాదా గాంధీ, మడకశిరలో సుధాకర్, కర్నూల్‌లో కోట్ల సూర్యప్రకాశరెడ్డి, కడపలో మాజీ మంత్రి సి రామచంద్రయ్య నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు జరిగాయి.

సందడిగా రాష్ట్రస్థాయి వృషభరాజాల బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

కోడుమూరు, ప్రభ న్యూస్: కర్నూలు జిల్లా కోడుమూరులో శుక్రవారం రాష్ట్రస్థాయి వృషభరాజముల బండలాగుడు పోటీలను కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. కోడుమూరులోని శ్రీ చౌడేశ్వరిదేవి తిరునాళ్ల సందర్భంగా స్థానిక శ్రీ భూమాత రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వృషభరాజముల బండలాగుడు పోటీలను రెండురోజుల పాటు రాత్రి సమయాల్లో ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో నిర్వహిస్తున్నారు. శుక్రవారం పాలపండ్ల సైజు వృషభరాజముల బలప్రదర్శన పోటీలను కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డితోపాటు కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట్ల హర్షవర్దన్‌రెడ్డిలు ప్రారంభించి, మొదటి జతకు మెమెంటోను అందజేశారు. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుండి 17 జతల వృషభరాజములు వచ్చాయి. కాగా శనివారం న్యూ కేటగిరీ (సేద్యపు ఎద్దులు) వృషభరాజముల బలప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండవ బహుమతిగా రూ.20వేలు, మూడవ బహుమతిగా రూ.12వేలు, నాల్గవ బహుమతి రూ.8వేలు, ఐదవ బహుమతి రూ.5వేలను అందజేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎంపీపీ బి రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ సిబి లత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె. హేమాద్రిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు కె. మధుసూదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు లక్కసాగరం లక్ష్మీరెడ్డి, డీసీసీ కార్యదర్శులు ఆర్. చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, జెఎండి రఫిక్‌బాషా, శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎం ఆదిశేషులు, రాముడు, ప్రవీణ్, రమేష్‌నాయుడు, జగధీష్, వస్త్రభారతి వెంకటేశ్వర్లు, లింగన్న, రాఘవేంద్ర, లింగమయ్య, పరమేష్, వెంకటేశ్వరాచారి, వెంకట్రాముడు, సో మన్న, సవారి రాముడు, శివరాముడు, తేనేశ్వరరెడ్డి, వేమారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు చేపట్టిన దక్షిణ మధ్య రైల్వే నిఘా విభాగం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దక్షిణ మధ్య రైల్వే నిఘా విభాగం గత రెండు రోజుల నుండి రైల్వే బుకింగ్ కార్యాలయాలు, రిజర్వేషన్ కేంద్రాలు, పార్శిల్ కార్యాలయాలు, రైళ్ల వద్ద ఎటువంటి అవకతవకలు, అక్రమాలు జరగకుండా విస్తృతమైన తనిఖీలు నిర్వహిస్తున్నారు. వివిధ విభాగాల ఉన్నతాధికారులు అన్ని ముఖ్యమైర రైల్వే స్టేషన్ల వద్ద, పలు రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీని కోసం విస్తృతమైన ప్రచారం చేయడం ద్వారా నిఘా విభాగం సహాయ కేంద్రం నెంబర్ 155210ను ప్రజలు ఉపయోగించుకొనే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజా సంచారం గల ప్రదేశాల్లో ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ఈ నెంబర్‌ను ప్రదర్శించడం జరుగుతుంది. అనౌన్స్‌మెంట్ల ద్వారా కూడా సమాచారం తెలియచేయడం జరుగుతుందని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది. గత రెండు రోజుల్లో నిఘా విభాగం అధికారులు 93 తనిఖీలను నిర్వహించారు. పలు అక్రమాలు, అవకతవకలను గుర్తించారు. రైల్వే బుకింగ్ కార్యాలయాలు, రిజర్వేషన్ కేంద్రాలతో పాటు రైళ్లలో తనిఖీలు జరిపారు. ప్రయాణికులు తమ దృష్టికి వచ్చిన అక్రమాలు, అవకతవకలను 155210 నెంబర్‌కు తెలియచేయాలని కోరారు.

రైల్వే ఉద్యోగుల మహాధర్నా


అమరావతి, ఆంధ్రప్రభ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం విజయవాడలోని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయం ఎదుట అన్ని ఏరియాల రైల్వే ఉద్యోగులు పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించారు. అన్ని ప్రధాన రైల్వే కేంద్రాలకు చెందిన ఉద్యోగులు ఈ మహాధర్నాలో పాల్గొన్నారు. రైల్వే బడ్జెట్‌లో రాష్ట్ర రైల్వే ఉద్యోగులకు ఎటువంటి ప్రాధాన్యత లేకుండా పోయిందని యూనియన్ నేతలు పేర్కొన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలను కోరారు.

సీఆర్డీఏ ఓపెన్ ఫోరంలో 14 దరఖాస్తులకు అనుమతి

అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీసీఆర్డీఏలో లేఅవుట్లు, మార్ట్‌గేజ్ క్లియరెన్స్‌లకు సంబంధించి అనుమతుల పరంపర కొనసాగుతోంది. ఓపెన్ ఫోరంల పేరిట ఈ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. ఏపీసీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారంనాడు ఓపెన్ ఫోరం నిర్వహించారు. భవనాలు, లేఅవుట్ల దరఖాస్తులను అధికారులు స్వయంగా పరిశీలించి నిబంధనలు సక్రమంగా పాటించిన వారికి అప్పటికపుడే ప్రాథమిక అనుమతులు మంజూరు చేశారు. మొత్తం 19 దరఖాస్తులు రాగా నిబంధనలకు అనుగుణంగా ఉన్న 14 దరఖాస్తులకు అప్పటికపుడే ప్రాథమిక అనుమతి పత్రాలు చేశారు. నాలుగు దరఖాస్తులకు గాను అదనపు సమాచారం కోరిన అధికారులు ఒక దరఖాస్తును పూర్తిగా తిరస్కరించారు. లే అవుట్ల కోసంరెండు దరఖాస్తులు రాగా నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఒక దరఖాస్తును ఆమోదించారు. మరొక దరఖాస్తుకు అదనపు సమాచారాన్ని అధికారులు కోరారు. రిలీజ్ ఆఫ్ మార్ట్‌గేజ్ ఏరియా, ఫైనల్ లేఅవుట్ కోసం అందిన రెండు దరఖాస్తుల్లో ఒక దరఖాస్తును ఆమోదించి మరొక దరఖాస్తుకు అదనపు సమాచారాన్ని కోరారు. పరిశ్రమ స్థాపన కోసం వచ్చిన ఒక దరఖాస్తును ఆమోదించారు. ఆక్యుపెన్సీ, రిలీజ్ ఆఫ్ మార్ట్‌గేజ్ ఏరియా కోసం అందిన తొమ్మిది దరఖాస్తుల్లో ఎనిమిది దరఖాస్తులను ఆమోదించారు. ఎక్స్‌టెన్షన్ ఆఫ్ లేఅవుట్ డెవలప్‌మెంట్ కోసం అందిన మూడు దరఖాస్తు లను ఆమోదించారు. ఎన్వోసి దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. ఏపిసిఆర్డీఏ డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ కె నాగసుందరి, జడజోనల్ జాయింట్ డైరెక్టర్ జిఎస్వీ ప్రసాద్ తదితరులు ఓపెన్ ఫోరంలో పాల్గొన్నారు.

దద్ధరిల్లిన రాజ్యసభ

●హెల్ప్ ఆంధ్రప్రదేశ్ అంటూ కేవీపీ నిరసన ●వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కురియన్ ●బీసీలకు రిజర్వేషన్లపై వైఎస్సార్‌సీపీ ప్రైవేటు బిల్లు ●సుబ్రమణ్యస్వామి గోరక్షణ ప్రైవేటు బిల్లుపై చర్చ ●గోవధ చేసే వారికి ఉరిశిక్ష వేయాలన్న స్వామి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఉత్తరప్రదేశ్ మత ఘర్షణలు, ఢిల్లీ దుకాణాల సీలింగ్ అంశాలపై రాజ్యసభ దద్దరిల్లింది. శుక్రవారం రాజ్యసభ సమావేశం ప్రారంభం కాగానే పశ్చిమబెంగాల్ బసు ప్రమాదంలో చనిపోయిన 42మంది మృతికి సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం జీరో అవర్ చేపట్టేందుకు డిప్యూటీ చైర్మన్ పిజె.కురియన్ సమాయత్తం కాగా, యూపీ కాస్‌గంజ్ మత ఘర్షణల అంశాన్ని సమాజ్‌వాదీ పార్టీ లేవనెత్తింది. కాస్‌గంజ్‌లో మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని, అధికారుల అండదండతో జరుగుతున్నాయని సమాజ్‌వాదీ పార్టీ నేత రాంగోపాల్ యాదవ్ అన్నారు. అయితే ఈ అంశంపై నోటీసు ఇచ్చిన తర్వాతే మాట్లాడాలని డిప్యూటీ చైర్మన్ పిజె.కురియన్ సూచించారు. ఓ వైపు ఘర్షణలు జరుగుతుంటే నోటీసు ఇవ్వాలని అడగడంలో ఔచిత్యమేమిటని రాంగోపాల్‌యాదవ్ వాదనకు దిగారు. మైనారిటీల ఇళ్లలోకి చొరబడి దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు వెల్‌లోకి దూసుకువెళ్లి యూపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో గందరగోళం చెలరేగింది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ సైతం రాజ్యసభలో ఢిల్లీలో దుకాణాల సీలింగ్ అంశాన్ని లేవనెత్తింది. వ్యాపారులపై బీజేపీ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని ఆ పార్టీ ఎంపీ సంజయ్‌సింగ్ ఆరోపించారు. నియంతృత్వం నశించాలి అంటూ వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. వ్యాపారులకు సరైన అవకాశం ఇవ్వకుండా ఢిల్లీలో పెద్ద ఎత్తున ఎంసీడీ సీలింగ్ డ్రైవ్ చేపట్టిందని ఆరోపణలు చేశారు. వ్యాపారులంతా దుకాణాలు బంద్ చేసి నిరసన తెలుపుతున్నారని, పెద్ద ఎత్తున లావాదేవీలు ఆగిపోయాయని చెప్పారు. సభలో గందరగోళం చెలరేగడంతో సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు తమ నిరసన కొనసాగించారు. ప్రభుత్వ వైఖరి వల్ల వ్యాపారులంతా రోడ్డున పడ్డారని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ వెల్‌లోకి దూసుకెళ్లి వాదనకు దిగారు. అయితే దీనిపై నోటీసు ఇవ్వాలని డిప్యూటీ చైర్మన్ కురియన్ సూచించారు. అయినా ఆప్ ఎంపీలు ముగ్గురు వినకుండా నినాదాలు కొనసాగించారు. ఢిల్లీ ప్రతి ఎంపీకి రెండవ ఇల్లులాంటిదని, కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యపై ప్రేక్షకపాత్ర వహించొద్దని, సమస్యను పరిష్కరించాలని ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ డిమాండ్ చేశారు.

ఏపీకి న్యాయం చేయాలని కేవీపీ నిరసన

హెల్ప్ ఆంధ్రప్రదేశ్ అంటూ ఏపీ కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు వెల్ లో డిప్యూటీ చైర్మన్ కుర్చీ సమీపంలో ప్లకార్డు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఎటువంటి నినాదాలు చేయకుండా మౌనంగా నిలబడ్డారు. దీనిపై డిప్యూటీ చైర్మన్ పిజె.కురియన్ ఆవేశంతో ఊగిపోయారు. ప్లకార్డుతో నిరసన తెలపవద్దని పదేపదే విజ్ఞప్తి చేశారు. సభ్యుడిని వెనక్కి పిలిపించాలని గులాంనబీ ఆజాద్‌క ు సూచించారు. నోటీసు ఇవ్వాలని కోరినా, కేవీపీ అవేమి పట్టించుకోకుండా ప్లకార్డు పట్టుకుని నిరసన కొనసాగించారు. దాంతో ఆయనకు పిచ్చి పట్టిందా అంటూ కురియన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ అభ్యంతరవ్యక్తం చేయడంతో ఆ పదాలను పార్లమెంటు రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు కురియన్ ప్రకటించారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లపై ప్రైవేటు మెంబర్ బిల్లు

బీసీలకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్‌సిపి ఎంపీ విజయసాయిరెడ్డి రెండు ప్రైవేట్ మెంబర్ బిల్లులను ప్రవేశపెట్టారు. దేశంలో 55శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో 18శాతం మాత్రమే దక్కుతోందని, వారికి న్యాయం చేసేందుకు రాజ్యాంగాన్ని సవరణ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల్లాగానే జనాభా దామాషా పద్ధతిలో పార్లమెంటు, అసెంబ్లీలో సీట్లు కేటాయించాలన్నారు. అలాగే విద్యా, ఉద్యోగాల్లో కూడా జనాభా నిష్పత్తి మేరకు రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు.

గోరక్షణ ప్రైవేటు బిల్లుపై చర్చ

బీజేపీ ఫైర్‌బ్రాండ్ ఎంపీ సుబ్రమణ్యస్వామి ప్రవేశపెట్టిన గోరక్షణ బిల్లుపై రాజ్యసభ చర్చ చేపట్టింది. చర్చను ప్రారంభిస్తూ సుబ్రమణ్యస్వామి, మొఘల్ పాలకుడు బహదూర్‌షా సైతం గోవధను నిషేధించారని చెప్పారు. ఆంగ్లేయుల పాలన కాలంలో గోవధను ఫ్యాషన్‌గా మార్చారని అన్నారు. ఆధునిక సైన్స్ సైతం గోవు వల్ల ఎన్నో శాస్త్రీయ ప్రయోజనాలున్నాయని చెపుతోందన్నారు. గోమూత్రాన్ని ఆలోపతిక్ మదుల్లో సైతం వాడుతున్నారని వెల్లడించారు. అమెరికా సైతం గోమూత్రానికి పేటెంట్ ఇచ్చిందని తెలిపారు. పురాతన కాలంలో రుషులు సైతం గోవు మహత్యాన్ని వివరించారని చెప్పారు. గోవును కాపాడుకోవానికి అనేక న్యాయమైన కారణాలున్నాయన్నారు. ప్రతి గ్రామంలోనూ గోశాలను ఏర్పాటు చేయాలని అన్నారు. గోమాంసం వల్లే ఎగుమతుల పెరిగిన నేపథ్యంలో, గోవును కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గో వధ చేసిన వారిని ఉరిశిక్ష విధించేలా కఠిన చట్టాలు రావాలని అన్నారు. గోవును రాజకీయ పశువుగా మార్చొద్దని కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్ అన్నారు. అధికార పార్టీ సభ్యుడిగా ఉన్న సుబ్రమణ్య స్వామి గోరక్షణపై ప్రైవేటు బిల్లు పెట్టే బదులు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించవచ్చని సూచించారు. ఆవును కామధేనులాగా గౌరవించాలని, రాజకీయ పశువుగా మార్చొద్దని అన్నారు.



బీసీల హక్కులు, రిజర్వేషన్ల కోసమే... ప్రైవేట్ బిల్లులు: ఎంపీ విజయసాయిరెడ్డి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బీసీల హక్కులను పరిరక్షించేందుకు, రాజ్యాంగబద్ధత కల్పించేందుకు రాజ్యసభలో రెండు ప్రైవేట్ మెంబర్ బిల్స్ ప్రవేశపెట్టానని వైఎస్సార్సీపీ పార్లమెంట్ సభ్యులు విజయసాయిరెడ్డి తెలిపారు. 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇప్పుడున్న సభలో 20 శాతం మాత్రమే బీసీలు ఉన్నారని ఆయన అన్నారు. తాను ప్రవేశపెట్టిన రెండు ప్రైవేట్ మెంబర్ బిల్లుల గురించి పార్లమెంట్ సమావేశాల అనంతరం ఆయన విజయ్ చౌక్ ప్రాంతంలో పాత్రికేయులకు వివరించారు. రాజ్యాంగంలోని 330 ఏ, 332ఏ ప్రకారం రెండు సవరణలను ప్రవేశపెట్టి రాజ్యాంగబద్ధత కల్పించేలా పార్లమెంట్‌లోనూ, అసెంబ్లీల్లోను జనాభా ప్రాతిపదికపై బీసీలకు రిజర్వేషన్ కల్పించడం ఈ బిల్లు ఉదేశమని చెప్పారు. ఈ సమావేశాలలో ఓబీసీ బిల్ ఆమోదం పొందుతుందని ఎంపీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించేందుకు వైసీపీ మద్దతిస్తోందని తెలిపారు.

రేషన్ షాపులు ప్రైవేట్ పరం

ఏపీలో ఉన్న 28 వేల రేషన్ షాపుల్లో 6 వేల రేషన్ షాపులను ప్రైవేట్ షాపింగ్ మాల్స్‌గా మార్చడం చంద్రబాబు ప్రభుత్వ ఉద్దేశమని విజయసాయిరెడ్డి విమర్శించారు. వాటిని ఫ్యూచర్, రిలయన్స్ గ్రూపునకు కట్టబెడతారని జోస్యం చెప్పారు. ఫ్యూచర్ గ్రూపులో చంద్రబాబు కుటుంబానికి వాటాలున్నాయని ఆయన తెలిపారు. టీడీపీ నాలుగేళ్లు కళ్లు మూసుకుందని, ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజనచట్ట హామీలను నెరవేర్చకుండా కేంద్రం వ్యవహరిస్తుంటే అకస్మాత్తుగా టీడీపీకి ఇవాళ గుర్తొచ్చిందని విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు. టీడీపీ వైఖరి చూసి జనం నవ్వుకుంటున్నారని విమర్శించారు.



తులాభారం తూగుతున్న ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ సీఎం కేసీఆర్

మేడారం జాతరకు ఉపరాష్ట్రపతి, తెలంగాణ సీఎం

●తల్లులకు మొక్కుల చెల్లింపు ●నిలువెత్తు బంగారం తులాభారం ●వెంకయ్యనాయుడు 84, కేసీఆర్ 52 కేజీలు



వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : మరో కుంభమేళా మేడారం వనదేవతల జాతరకు భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు , రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావులు హాజరయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక హెలికాప్టర్లో హైదరాబాద్ నుంచి బయలుదేరి మేడారం చేరుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులతో వచ్చి సమ్మక్క -సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 11.30 గంటలకు వెంకయ్య నాయుడు ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం జాతర ప్రాంగణానికి చేరుకున్నారు. రక్షణశాఖకు చెందిన ప్రత్యేక హెలికాప్టర్లో మేడారం వచ్చారు. మరో రెండు హెలీకాప్టర్లలో వెంకయ్యనాయుడు భద్రత సిబ్బంది వచ్చారు. మేడారం హెలీప్యాడ్‌లో వెంకయ్యకు రాష్ట్రప్రభుత్వం తరుపున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు మేడారం సమ్మక్క - సారలమ్మల గద్దెల వద్దకు చేరుకున్నారు. వెంకయ్య నాయుడు నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) తులాభారం తూగి మొక్కులు చెల్లించారు.

అనంతరం సమ్మక్క -సారలమ్మ గద్దెల పై పసుపు , కుంకుమ చల్లారు. అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయన నిలువెత్తు బంగారం 84 కిలోలుగా తూగి సమర్పించారు.భారత ఉప రాష్ట్రపతి హోదాలో మేడారం జాతరకు తొలిసారి వెంకయ్య రావడంతో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. రాష్ట్రప్రభుత్వం తరుపున ఆయనకు సన్మానం చేశారు. వెంకయ్య నాయుడు మేడారంకు చేరుకోగానే బీజేపీకి చెందిన పలువురు మాజీఈ ఎమ్మెల్యేలు, నాయకులు స్వాగతం పలికారు.ఈ సందర్బంగా మీడియాతో మాట్లాడుతూ మేడారంలో జాతరలో అద్భుత దృశ్యం కనిపించిందన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారం కొనసాగింపులో భాగంగానే మేడారం జాతర దేశవ్యాప్తం కావాలని ఆకాంక్షించారు. అనంతరం గంట సేపు మేడారంలో గడిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి హెలికాప్టర్లో మేడారం వచ్చారు. ఆయన వెంట సతీమణి శోభ , కూతురు కవిత, మనువడు హిమాంషు ఉన్నారు. హెలీప్యాడ్ వద్ద కేసీఆర్‌కు పలువురు మంత్రులు , ఎమ్మెల్యేలు , అధికారులు స్వాగతం పలికారు. మేడారం గద్దెల వద్దకు చేరుకున్న ఆయన సమ్మక్క - సారలమ్మలకు సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెల వద్ద కూడా కేసీఆర్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేసీఆర్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద నిలువెత్తు బంగారాన్ని తులాభారం వేయగా 52 కిలోలుగా నమోదైంది. అమ్మవారికి బంగారాన్ని (బెల్లం) సమర్పించుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం కేసీఆర్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. తల్లులను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధంచాలని ఉద్యమ సమయంలో తాను మేడారం సమ్మక్క -సారలమ్మలకు మొక్కుకున్న విషయాన్ని గుర్తు చేశారు. గత జాతర సందర్భంగా అనారోగ్యం కారణంగా రాలేకపోయానన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులకు అవాంతరాలు తొలగిపోవాలని తల్లులను మొక్కుకున్నట్లు తెలిపారు.

ఏపీలో 804 మంది రైతుల ఆత్మహత్య

●ఆహార ధాన్యాల సేకరణకు కేంద్ర కొత్త పథకం ●రాజ్యసభలో కేంద్ర మంత్రుల వెల్లడి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వ్యవసాయ రంగంలోని ఒడిదుడుకులను తట్టుకోలేక ఆంధ్రప్రదేశ్‌లో 2016 సంవత్సరంలో 804 మంది రైతులు, రైతు కూలీలు బలవన్మరణానికి పాల్పడిన మాట వాస్తవమేనని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి పరషోత్తమ రూపాలా వెల్లడించారు. రాజ్యసభలో వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరుస్తూ ప్రతిఏటా నివేదికలు సమర్పిస్తోందని ఆయన తెలిపారు. 2015లో ఎన్సీఆర్బీ ప్రచురించిన నివేదిక ప్రకారం దివాలా, అప్పుల ఊబిలో కూరుకుపోవడం, వ్యవసాయంలో సంభవించే నష్టాలు ఆత్మహత్యలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. వ్యవసాయమనేది రాష్ట్రానికి సంబంధించిన అంశమైనప్పటికీ 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని రూపాలా వివరించారు. ఈ లక్ష్య సాధనలో వ్యవసాయ, సహకారం రైతు సంక్షేమ విభాగాలు ఒక అంతర్ మంత్రిత్వ శాఖ బృందాన్ని ఏర్పాటు చేసి రైతుల ఆదాయానికి సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించి సముచితమైన వ్యూహాన్ని సిఫారసు చేస్తుందని మంత్రి లేఖలో తెలిపారు.

ఆహార ధాన్యాల సేకరణకు కొత్త పథకం

రైతులు పండించిన ఆహార ధాన్యాల సేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం మార్కెట్ హామీ పథకం (ఎమ్ఏఎస్) పేరిట ఒక కొత్త పథకాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆహార, ప్రజా పంపిణీ శాఖల మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ శుక్రవారం రాజ్యసభలో ప్రకటించారు. రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా జవాబు చెప్పారు. ఈ కొత్త పథకానికి సంబంధించిన కాన్సెప్ట్ పేపర్‌ను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిశీలనకు పంపినట్టు పాశ్వాన్ వెల్లడించారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో కేంద్ర బృందాలు రెండు దఫాలుగా జరిపిన చర్చల ద్వారా సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరిస్తూ వ్యవసాయ, సహకార, రైతు సంక్షేమ విభాగాలు సవరించిన కాన్సెప్ట్ పేపర్‌ను రూపొందించినట్టు మంత్రి తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే భద్రతా విభాగంలో వేల పోస్టులు ఖాళీ

దక్షిణ మధ్య రైల్వేలోని రక్షణ, భద్రతా విభాగాల్లో దాదాపు 10 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నట్టు రైల్వే శాఖ సహాయ మంత్రి రంజన్ గోహెయిన్ తెలిపారు. విజయ సాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ దక్షిణ మధ్య రైల్వేలోని రక్షణ విభాగంలో 784, భద్రత విభాగంలో 9,372 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో రిటైర్మెంట్లు, ప్రమోషన్లు, మరణాలు, రాజీనామాల వంటి కారణాలతో ఏర్పడిన ఈ ఖాళీలను బహిరంగ నియామకాల ద్వారా పూరించనున్నట్టు పేర్కొన్నారు. విశాఖ పట్నంలో రైల్వే వ్యాగన్ నిర్మాణానికి ఈ ఏడాది బడ్జెట్‌లో 150 కోట్ల రూపాయలు కేటాయించినట్లు రంజన్ గోహెయిన్ వెల్లడించారు. వ్యాగన్ వర్క్ షాప్ నిర్మాణ పనులలో ఎలాంటి జాప్యం జరగడంలేదని 201516 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు దీని నిర్మాణం కోసం 265 కోట్ల రూపాయలు కేటాయించినట్లు మంత్రి వివరించారు. మరోవైపు పోస్టల్ శాఖ ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో మల్టీ టాస్కింగ్ సిబ్బంది, పోస్ట్ మ్యాన్, పోస్టల్ అసిస్టెంట్, సార్టింగ్ అసిస్టెంట్, పోస్ట్ మాస్టర్ గ్రేడ్, ఇన్‌స్పెక్టర్ పోస్టులు మొత్తం కలిపి 1922 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా శుక్రవారం విజయసాయిరెడ్డి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

విశాఖలో ఫొటో ట్రేడ్ షో ప్రారంభం

పాల్గొన్న ఆరు రాష్ట్రాల నుంచి 200 సంస్థలు



విశాఖపట్నం, ప్రభన్యూస్: ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఫొటో ట్రేడ్‌షో శుక్రవారం ఇక్కడ విశాఖలో ప్రారంభమైంది. మధురవాడ వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎడిట్‌పాయింట్ సంస్థ , బాలు ఇమేజ్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ఫొటో ట్రేడ్‌షోను వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. వైజాగ్ కన్వెన్షన్స్ అధినేత నర్సింహారావు, విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కళాశాల డైరెక్టర్ రాజశిఖామణిలు గౌరవ అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ విశాఖలో ఇటువంటి ఫొటో ట్రేడ్‌షోను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫొటో ట్రేడ్‌షోలో 200 సంస్థలు పాల్గొంటున్నాయి.

ఇటువంటి షోల వల్ల ఆయా రాష్ట్రాలలో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని మార్చుకునే అవకాశంతో పాటు అనేక నూతన ఉత్పత్తులను ప్రదర్శించే అవకాశం కలుగుతుందని శ్రీనుబాబు అన్నారు. వ్యాపార రంగంలో అభివృద్ధికి సంబంధించిన అంశాలను తెలుసుకోవచ్చునన్నారు. ఎడిట్‌పాయింట్ సంస్థ అధినేత రమేష్, బాలు ఇమేజ్ అధినేత వెంకటేష్‌లు మాట్లాడుతూ ముంబాయి తరువాత విశాఖలో అతిపెద్ద ఫొటో ట్రేడ్‌షో తాము ఏర్పాటు చేయడం తమకు ఆనందంగా ఉందన్నారు. ఫొటోగ్రఫీలో శిక్షణ, డ్రోన్‌ల వినియోగంలో అవగాహన కల్పించడంతో పాటు అనేక సాంకేతిక పరమైన అంశాల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ట్రేడ్‌షోను విజయవంతం చేయాలని వైజాగ్ కన్వెన్షన్స్ అధినేత నర్సింహారావు ఆకాంక్షించారు. విశాఖ అఫీషియల్ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరావు, లోకేష్‌కుమార్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

లాభదాయకంగా నాటుకోళ్ల పెంపకం



● ఆసక్తి చూపుతున్న రైతాంగం ● తక్కువ శ్రమ, పెట్టుబడి.. అదనపు ఆదాయ మార్గం

అమరావతి, ఆంధ్రప్రభ: గ్రామీణ ప్రాంత రైతుల ప్రధాన వృత్తులైన వ్యవసాయం, పశుపోషణ తరువాత ప్రాధాన్యత సంతరించుకున్న మరో వృత్తి నాటు కోళ్ళ పంపకం. కొద్దిపాటి పెట్టుబడి, తక్కువ శ్రమతో అదనపు ఆదాయాన్ని ఆర్జించేందుకు రైతులు నాటు కోళ్ళ పెంపకాన్ని చేపడుతుంటారు. గ్రామల్లో పోషకాహార లోపం ఎక్కుగా ఉండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నాటు కోళ్ళ పెంపకాన్ని పోత్సహిస్తున్నాయి. వీటి నుంచి ఉత్పత్తి ఆయ్యే గుడ్లు , మాసం నాణ్యంగా ఉండటమే కాకుండా మార్కెట్లో ఎంతో డిమాండ్ కలిగి ఉన్నాయి. నాటు కోడి ధరకు బ్రయిలర్ కోడి ధరకు రెట్టింపు వ్యత్యాసం ఉంటుంది. నాటు కోళ్ళ పెంపకం ఖర్చు తక్కువ లాభాలు ఎక్కువగా ఉంటా యి. వీటికి వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉండటం తో రోగాలు కూడా తక్కువగా ఉంటాయి. నాటు కోడిలో అన్ని రకాల పోషక విలువ లు ఎక్కుగా ఉంటా యి. ప్రస్తు తం నాటుకో డి మాసం మార్కెట్లో లభ్యత త క్కువగా ఉండ టంతో రైతు లు వీటి పెంపకం వైపు మొగ్గు చూపుతున్నారు. నాటుకోళ్ళ పెంపకానికి దాణాపై ఎక్కువ ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. సహజ సిద్ధమైన మేత , ఆకుకూరలు, సజ్జలు, బియ్యం, మొక్కజొన్నలు వంటివి వాటికి ఆహా రంగా తీసుకుంటాయి. వీటితో పాటు కీటకాలు, వ్యర్థాలు, కిచెన్ వ్యర్థాలను ఆహారంగా ఇవి తీసుకుంటాయి.

నాటు కోళ్ళ రకాలు

నాటు కోళ్ళలో ఇప్పటి వరకు పలు రకాలు మార్కుట్ లో అందుబాటులో ఉన్నాయి. గోదావరి, రాయలసీమ, కడక్ మధ్యప్రదేశ్, కర్నాటక, తమిళ నాడు, గుజరాత్ వీటితో పాటు టర్కీ, గిన్నెకోడి, క్వయిల్ పక్షులు, అన్ని రకాల నాటు కోళ్ళు పెంపకం చేస్తున్నారు.

మార్కుట్ ధరలు..

మార్కెట్లో కిలో నాటు కోడి ధర రూ200 నుంచి 300 వరకు ఉంటే మాసం ధర రూ400 నుంచి 500 వరకు ఉంటుంది. ఎలాంటి యాంటీబయాటిక్స్ లేకపోడం వల్ల రుచి కూడా బాగా ఉంటుంది. నాటు కోడి నెలకు 100 నుంచి 150 గ్రాముల బరువు పెరుగుతుంది. 8 నుంచి 12 వారాలలో బరుకు వస్తుంటాయి. 16 నుంచి 20 వారాల కు యుక్త వయస్సుకు వచ్చి గుడ్లు పెడుతాయి. పుంజులైతే 3 నెలలకు కోతకు వస్తాయి. పెట్టలు అయితే 6 నెలలకు గుడ్లు పెడతాయి.ఇవి 4నెలల, 6నెలలకు, 1సంవత్సరానికి కోతకు వచ్చే వివిధ రకాలైన కోళ్ళ జాతులు మార్కుట్ లో అందుబాటులో ఉన్నాయి.

వ్యాధులు..

వీటిలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువ ఉంటుంది కాబట్టి ఎక్కువగా వ్యాధులు దరి చేరవు. కాకాపోతే వీటిలో వాతావరణ మార్పుల ఫలితంగా అప్పుడప్పుడు వ్యాధుల బారిన పడుతుంటాయి. వీటిలో కోక్కర వ్యాధి, మచూచి వ్యాధులకు గురవుతూఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ముందు జాగ్రత్తగా టీకాలు వేయిస్తే మంచిది. ప్రభుత్వ పశువైద్యాశాలలో వీటిని ఉచితంగా వేస్తారు. ఎండా కాలం, చలి కాలం ప్రారంభ సమయంలో పశు వైద్యాధికారులు గ్రామాలలో పర్యటించి టీకాలు అందజేస్తారు.

వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ..

గతం నాటు కోళ్ళు ఎప్పుడు బతుకుతాయే, ఎప్పుడు చనిపోయేది తెలిసేది కాదు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్నా కోళ్ళ జాతులు వైరస్‌ను తట్టుకుని నిలబడున్నాయి. రైతుల ఎంతో లాభాన్ని చేకూర్చుతున్నాయి. ఈ రకం కోళ్ళు 1000 పిల్లలను పెంపకం చేపడితే వాటిలో 990,980 వరకు బతుకుతున్నాయి. సరైన పద్దతిలో క్రసింగ్ చేసి పెంపకం చేయడం వల్ల కోళ్ళు నిలబడుతున్నాయి. ఏడాదికి 300 గుడ్లు పెట్టే కోళ్ళు ఉన్నాయి, ఒక్కోక పిల్ల ధర రూ150, వ్యాధులు సోకని నాటు కోళ్ళ పెంపకం

పెంపకంలో జాగ్రత్తలు..

వీటి పెంపకంలో ముఖ్యమైనది బ్రీడ్ ఎంపిక. సరైన బ్రీడ్ ఎన్నుకోగలిగితే రైతు ఆశించినంతగా ఆదాయం అందుకోవచ్చు. పర్ల, అసిలు, బరసా కోడి పుంజులతో పెట్టలకు క్రసింగ్ చేయించడం ద్వారా కోడి గుడ్లు పెడుతుంది. తక్కువ విస్తీర్ణంలో 10 పిల్లల నుంచి వీటి పెంపకం ప్రారంభించ వచ్చు. ఎక్కువ స్థల విస్తీర్ణం ఉంటే 50 పిల్లల నుంచి 100 వరకు కూడా వీటిని పెంచవచ్చు. మొదటి నెల వరకు బ్రూడింగ్ చేయాల్సి ఉంటుంది. అలాగే రాత్రిళ్ళు కుక్కలు, పిల్లుల నుంచి రక్షణ కల్పించాలి.

రైతుకు రెండు విధాలుగా లాభాలు..

నాటు కోళ్ళ పెంపకం ద్వారా రైతులకు రెండు విధాలుగా లాభాలు కలుగుతాయి. ఒకటి ఆదనపు ఆదాయం వస్తుంది. రెండవది పోషక అవసరాలు తీరతాయి. నాటు కోడి గుడ్లు, మాసం ఆహారంలో తీసుకోవడం వల్ల వారికి పోషకాహర లోపం ఉండదు. పిల్లలు, వృద్ధులకు, బాలింతలకు సమతుల్యా ఆహారం అందుతుంది. వీటి పెంపకానికి షెడ్లతోపాటు అవి బయట తిరిగే విధంగా ఖాళీ స్థలం కూడా ఏర్పాటు చేసుకోవాలి.

జస్టిస్ రోహిణికి ఏపీ మహిళా కమిషన్ సన్మానం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మహిళా సాధికారికతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి కోరారు. జాతీయ మహిళా కమిషన్ రజతోత్సవాల్లో పాల్గొనేందుకు నాలుగు రోజుల కిందట ఢిల్లీ వచ్చిన ఏపీ మహిళా కమిషన్ సభ్యులు ఏలూరు పార్లమెంటు సభ్యులు మాగంటి వెంకటేశ్వరరావు (మాగంటి బాబు) నివాసంలో సమావేశమయ్యారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు పర్వీన్ భాను, శ్రీవాణి, రమాదేవి, డాక్టర్ రాజ్యలక్ష్మి సిరిగినేని, జిల్లా పరిషత్ మహిళా సభ్యులు, ఎంపీపీ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, ప్రస్తుతం ఓబీసీ రిజర్వేషన్ల వర్గీకరణ కమిషన్ ఛైర్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న జస్టిస్ రోహిణిని సన్మానించారు. అనంతరం మాగంటి బాబు మాట్లాడుతూ... దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళల కృషి అనితర సాధ్యమని అభిప్రాయపడ్డారు. మన భాష, సంస్కృతి పరిరక్షణలో మహిళల పాత్ర ప్రధానమని తెలిపారు. నిర్భయ చట్టం అమలులోకి వచ్చాక కూడా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగడం బాధాకరని నన్నపనేని రాజకుమారి అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నా వారికి రక్షణ కరవవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఆర్థిక, స్వశక్తి రంగాలలో మహిళలు మరింత అభివృద్ధి సాధించాల్సిన ఆవశ్యకత ఉందని జస్టిస్ రోహిణ్ చెప్పారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్కే జైస్వాల్‌కు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్కే జైస్వాల్ పదవీ విరమణ సందర్భంగా హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. జస్టిస్ జైస్వాల్ పదవీ కాలం ఆదివారంతో ముగియనుంది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలో 1వ కోర్టు హాలులో శుక్రవారం మధ్యాహ్నం న్యాయమూర్తులందరూ (ఫుల్ కోర్టు) సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ జస్టిస్ జైస్వాల్ అందించిన న్యాయసేవలు యువన్యాయవాదులకు స్ఫూర్తిని ఇస్తాయని కొనియాడారు. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ప్రసంగిస్తూ..జస్టిస్ జైస్వాల్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. హైకోర్టు పరిపాలనా పరమైన నిర్ణయాల్లో తనకు అండగా నిలిచారని, కష్టించి పనిచేసే తత్వం ఆయన సొంతమని కొనియారు.

జస్టిస్ ఎమ్మెస్కే.జైస్వాల్ మాట్లాడుతూ ..తన న్యాయప్రస్తానంలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. తనకు ప్రోత్సాహాన్ని అందించినకుటుంబ సభ్యులను గుర్తు చేసుకున్నారు. ఈ వీడ్కోలు సమావేశంలో జస్టిస్ జైస్వాల్ కుటుంబసభ్యులతో పాటు ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, సహాయ సోలిసిటర్ జనరల్ లక్ష్మణ్ , ప్రభుత్వ న్యాయవాదులు, న్యాయవాదులు కోర్టు సిబ్బంది, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘాల ఆధ్వర్యంలో జస్టిస్ ఎమ్మెస్కే.జైస్వాల్ దంపతులను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్, తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘాల అధ్యక్షులు జల్లి.కనకయ్య, చల్లా.ధనంజయ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రీడాప్రభ

ద్రవిడ్ శిష్యులు చరిత్ర సృష్టిస్తారా..

నేడే ప్రపంచకప్ ఫైనల్ వార్

ఆస్ట్రేలియాతో తలపడనున్న భారత్ యువ జట్టు



అండర్-19 ప్రపంచకప్‌లో ఫైనల్ చేరే దశలో వరుస విజయాలను నమోదుచేసిన భారత యువజట్టు కోచ్ ద్రవిడ్ శిక్షణలో మరింత రాటుదేలింది. ఫైనల్లో సమవుజ్జీగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టుతో అమీతుమీకి సిద్ధమైంది. బౌలింగ్, బ్యాటింగ్‌లో పటిష్ఠంగా ఉన్న భారత్ ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేయకుండా పటిష్ఠ వ్యూహంతో బరిలోకి దిగనుంది. న్యూజిలాండ్‌లోని మౌంట్‌మవుంగాన్యూ బే ఓవల్ మైదానం వేదిక గా తలపడుతున్న ఇరు జట్లు సీనియర్ జట్లకు తీసిపోని ఆటతో అభిమానులను రంజింప చేయనున్నాయి. ద్రవిడ్ శిక్షణలో రాటుదేలిన భారత జట్టు ఆటగాళ్లు ఈ ట్రోఫీని నాలుగోసారి గెలిచి చరిత్ర సృష్టిస్తారని ఆశిద్దాం

మౌంట్‌మవుంగాన్యూ(న్యూజీలాండ్): స్థానిక బే ఓవర్ మైదానంలో నేడు జరుగనున్న ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్లో భారత యువ కిశోరాల జట్టు అస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. పృథ్వీషా నేతృత్వంలోని భారత యువ జట్టు నాలుగోసారీ ఈ కప్‌ను సాధిస్తుందని భారత అభిమానులు ఆశిస్తున్నారు. మరోవైపు భారత జట్టుకు కోచ్‌గా ఉన్న రాహుల్ ద్రవిడ్ యువకిశోరాలకు విజయం సాధించడానికి అవసరమైన నిర్దేశకత్వాన్ని అందించి జట్టులో ఆత్మ విశ్వాసాన్ని నింపాడు. భారత్, ఆస్ట్రేలియాలు రెండూ చెరి మూడేసిసార్లు ఈ ట్రోఫీని గెలుచుకున్నాయి. గతంలో భారత్ ఈ ట్రోఫీని మహ్మద్ కైఫ్ సారథ్యంలో 2000లో, రెండోసారి 2008లో విరాట్ కోహ్లీ సారథ్యంలో, మూడోసారి 2012లో ఉన్ముక్త్ చాంద్ సారథ్యంలో మూడోసారీ కైవసం చేసుకుంది.

ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే భారత్‌కే విజయావకాశాలున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచుల్లో భారత్ గెలిచి మంచి ఊపు మీద ఉంది. కాగా ఆస్ట్రేలియా తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓటమి చవి చూసింది. ఫైనల్‌కు చేరేదశలో ఆసీస్ ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగింటిలో గెలిచింది. భారత్ తన చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై సెమీఫైనల్లో 203 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది. ఆస్ట్రేలియాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో 100 పరుగుల తేడాతో ఆ జట్టును మట్టి కరిపించింది. బ్యాటింగ్‌లో భారత ఆటగాళ్లు శక్తివం తంగా ఉన్నారు. పృథ్వీషా, మన్జోత్ కర్లా ఓపెనర్లుగా మంచి భాగస్వామ్యాన్ని ఇప్పటివరకు నమోదు చేశారు. శుబ్‌మాన్ గిల్ మూడో స్థానంలో నిలకడగా రాణిస్తున్నాడు. అయితే గిల్ ఒక్కడే టోర్నమెంట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. అందరీ చూపులు అతనిపైనే ఉన్నాయి.

గిల్ సెమీస్‌లో పాక్‌పై సెంచరీచేసి నాటౌట్‌గా నిలిచాడు. ఫైనల్లో కూడా తన తడాఖా చూపెట్టడానికి గిల్ సిద్ధంగా ఉన్నాడు. బౌలింగ్ విభాగంలో శివం మావి, కమలేష్ నాగర్‌కోటి కీలకంగా ఉన్నారు. లీగ్ మ్యాచుల్లో బంతులను గంటకు 140 కిలోమీటర్ల వేగంతో విసురుతూ ప్రత్యర్థులకు చుక్కలు చూపించారు. అయితే బలమైన ఆసీస్ జట్టుపై తమ ప్రతిభను చూపాల్సి ఉంది. అభిషేక్ శర్మ, అనుకుల్ రాయ్ స్పిన్నర్లు ఆసీస్ బ్యాట్స్‌మన్ల బలహీనతను గెలుపుగా మార్చడంలో కీలకం కానున్నారు. శర్మ బౌలింగ్‌లోనే కాక, దాటిగా బ్యాటింగ్ చేయగల ఆటగాడు. ఇక ఫీల్డింగ్‌లో కూడా భారత కిశోరాలు పేరుగాంచారు. క్విక్ సింగిల్స్ తీయడంలో నైపుణ్యం పెంచుకున్నారు.

అండర్-19 టోర్నీ సీనియర్ జట్టుకు రావడానికి మంచి మార్గంగా మారింది. ప్రస్తుతం సీనియర్ జాతీయ జట్టులో ఉన్న ఆటగాళ్లలో ఈ టోర్నీలో రాణించినవారే. ఈ అవకాశం భారత యువకిశోరాలకు ప్రేరణగా ఉండనుంది.

ఆస్ట్రేలియా కూడా గట్టిదే..

టోర్నీలో నాలుగు మ్యాచ్‌లు గెలిచి ఫైనల్‌కు చేరిన ఆసీస్ యువ జట్టు కప్‌ను సొంతం చేసుకునేందుకు తన శక్తులన్నింటిని ఉపయోగించనుంది. తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో పొందిన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవడానికి జాసన్ సంగా నేతృత్వంలోని ఆసీస్ జట్టు ఉత్సుకతతో ఉంది. ఆసీస్ సెమీస్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఇంగ్లండ్‌పై 127 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది.

జట్లు:

భారత్ అండర్-19: పృథ్వీ షా(కెప్టెన్) శుబ్‌మాన్ గిల్, మన్‌జోత్ కర్లా, హిమాన్షు రాణా, అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్,హార్విక్ దేసాయ్. శివం మావి, కమలేష్ నాగర్‌కోటి, ఇషాన్ పోరెల్, అనుకుల్ రాయ్, శివ సింగ్, అర్యన్ జుయల్, అర్షదీప్ సింగ్, పంకజ్ యాదవ్

ఆస్ట్రేలియా అండర్-19: జాసన్ సంగా(కెప్టెన్), విల్ సూదర్‌లాండ్, గ్జేవియర్ బార్ట్ లెట్, మ్యాక్స్ బ్రియాంట్, జాక్ ఎడ్వర్డ్స్, జ్యాక్ ఇవాన్స్, జర్రోడ్ ఫ్రీమన్, ర్యాన్ హెడ్లీ, బాక్సటర్ జె హోల్ట్, నాథన్ మెక్ స్వీనె, జొనాథన్ మెర్లో, లాయడ్ పోప్, పరం ఉప్పల్, ఆస్టిన్ వా.



దేవిస్ కప్‌లో జర్మనీ-ఆస్ట్రేలియా పోటాపోటీ

తొలి రౌండ్‌లో 1-1తో టై

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాలో జరుగుతున్న డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ టెన్నిస్ మ్యాచుల్లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి రౌండ్‌లో భాగంగా రెండు సింగిల్స్ మ్యాచ్‌లు జరుగాయి. జర్మనీ, ఆసీస్‌లు చెరో మ్యాచ్‌ను గెలవడంతో గ్రూప్‌లో 1-1తో రెండు టీంలు సమానంగా ఉన్నాయి. తొలి మ్యాచ్‌లో జర్మనీ జట్టు కెప్టెన్, వరల్డ్ నంబర్ 5 ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ ఆస్ట్రేలియాకు చెందిన అలెక్స్ డి మినౌర్‌పై గెలిచి 1-0 ఆధిక్యంను తన దేశానికి సంపాదించి పెట్టాడు. జ్వెరెవ్ గెలుపుకోసం తన సర్వ శక్తులను దారాపోశాడు. 18ఏళ్ల డి మినౌర్ గట్టి పోటీని ఇచ్చాడు. తొలి సెట్‌ను జ్వెరెవ్ 7-5 పాయింట్ల తేడాతో గెలుచుకోగా రెండు, మూడు సెట్లను మినౌర్ 4-6,4-6 తేడాతో గెలుచుకున్నాడు. నాలుగో సెట్లో జ్వెరెవ్ పుంజుకొని 6-3 తేడాతో గెలిచాడు. దీనితో నిర్ణాయక మ్యాచ్‌లో 7-6(7/4) జ్వెరెవ్ దక్కించుకొని మ్యాచ్‌ను గెలిచాడు. మినౌర్ ఆటతీరు పట్ల జ్వెరెవ్ సంభ్రమాశ్చర్యాలను వ్యక్తం చేశాడు. ఒక దశలో మ్యాచ్ తన చేతుల్లోంచి పోతున్నదనిపించిందని జ్వెరెవ్ అనుకున్నాడు. కాని చివరికి చివరి సెట్‌ను తన అనుభవాన్నంతా ఉపయోగించి గెలుపొందాడు. మరో సింగిల్స్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు నిక్ కీర్జియోస్(వరల్డ్ ర్యాంక14), జర్మనీ ఆటగాడు జాన్-లెన్నార్డ్‌ను వరుస సెట్లలో 6-4, 6-4, 6-4 తేడాతో ఓడించి జర్మనీ ఆధిక్యాన్ని లెవల్ చేశాడు. దీనితో తొలిరౌండ్ ముగిసే సరికి ఇరుజట్లు 1-1 స్కోర్‌తో సమంగా ఉన్నాయి. శనివారం జరిగే డబుల్స్‌లో ఆస్ట్రేలియా తన ఆధిక్యాన్ని 2-1కు పెంచుకోవాలని భావిస్తోంది. అస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డన్, జాన్ పీర్స్ జంట జర్మనీ ఆటగాళ్లు పీటర్ గొజొవెజుక్, టిమ్ ప్యూట్జ్‌తో ఆడనుంది.

శీతాకాల ఒలింపిక్స్‌కు కేశవన్, జగదీష్

న్యూఢిల్లీ: దక్షిణా కొరియాలో జరుగనున్న శీతాకాల ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ తరపున లుగర్ శివ కేశవన్ ,స్కెయర్ జగదీప్ సింగ్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఫిబ్రవరి 9న ప్యాంగ్‌చాంగ్ పట్టణంలో శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభం కానున్నాయి. 36 ఏళ్ల కేశవన్ దేశంలోనే నైపుణ్యమున్న శీతాకాల క్రీడల ఒలింపియన్. 1998లో ఈ క్రీడల్లోకి ప్రవేశించారు. 2002, 2006, 2010లో జరిగిన శీతాకాల ఒలింపిక్స్‌లో కేశవన్ పాల్గొన్నాడు. జగదీష్ తొలిసారిగా ఈ క్రీడల్లో పాల్గొంటున్నాడు.

ఓటమికి కారణం బ్యాట్స్‌మెన్ల వైఫల్యమే

సఫారీల కెప్టెన్ డుప్లెస్సిస్

డర్బన్: తొలి వన్డేలో దక్షిణాఫ్రికా ఓటమికి తమ బ్యాట్స్‌మన్ల వైఫల్యమే కారణమని ఆజట్టు కెప్టెన్ డు ప్లెస్సిస్ అన్నాడు. కెప్టెన్‌గా ప్లెస్సిస్ బాధ్యాతాయుతంగా ఆడి 120 పరుగులు చేశాడు. ఇది వన్డేల్లో అతనికి తొమ్మిదవ సెంచరీ. దీర్ఘమైన భాగస్వామ్యం నెలకొల్పడానికి తనకు సరైన తోడు దొరకలేదని ప్లెస్సిస్ వాపోయాడు. గురువారం మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్లెస్సిస్ మేము సరిగా బ్యాటింగ్ చేయలేదు. మరో 60 పరుగులు సాధిస్తే విజయం దక్షిణాఫ్రికాకు విజయం దక్కేది. తమ జట్టులో రెండో టాప్ స్కోర్ 30 లేదా 40 మధ్య ఉంటుంది. సుదీర్ఘ భాగస్వామ్య లోపించింది.

యాదవ్, చాహల్‌లను తమ బ్యాట్స్‌మన్లను కట్టడి చేశారన్నాడు. వారి మణికట్టు మాయాజాలం బాగా పనిచేసిందన్నాడు. సరైన లక్ష్యంను నిర్దేశించడం బ్యాట్స్‌మన్ల విధి. అప్పుడే బౌలర్లు జట్టును గెలిపించగలుగుతారు అని వ్యాఖ్యానించారు. ఈ పిచ్‌పై 300 పరుగులు చేయాల్సి ఉంది. 260 సరిపోవని నాకు తెలుసు. ఇక్కడ రెండుసార్లు



ఇక్కడ ఆడిన మ్యాచుల్లో భారీ పరుగులు సాధించాము. 370 పరుగులను కూడా చేజ్ చేశాము. అయితే బౌలర్లు సామర్థ్యంలేనివారని నేననటంలేదు. మరో 60-70 పరుగులు చేస్తే విజయావకాశాలు పెరిగేవన్నాడు.

కోహ్లీనే చేజ్ మాస్టర్

రహానేతో కలిసి 189 పరుగుల భాగస్వామ్యం

తొలి వన్డేపై క్రీడా నిపుణుల విశ్లేషణ



డర్బన్: దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో కెప్టెన్ విరాట్ కోహ్లీ అద్భుత ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు 6 వికెట్ల తేడాతో విజయం సాధించి పెట్టాడు. అంతేకాక, వన్డేల్లో తన 20వ శతకాన్ని పూర్తిచేసుకున్నాడు. వీటిలో 18సార్లు సెంచరీ చేసిన సమయంలో జట్టు విజయం సాధించింది. శతకాల్లో మొత్తం 119 బంతులను ఎదుర్కొని 112 పరుగులు చేశాడు. అజింక్యా రహానేతో కలిసి మూడో వికెట్ భాగస్వామ్యానికి 189 పరుగులు జోడించాడు. రహానే 86 బంతుల్లో 79 పరుగులు చేశాడు. కింగ్స్‌మీడ్ పిచ్‌పై 270 పరుగుల ఛేదన అంత సులభం కాకున్నప్పటికి కోహ్లీ తన టీంను ముందుండి నడిపించి ఇంకా 4.3 ఓవర్లు మిగిలివుండగానే లక్ష్యాన్ని ఛేదించారు. డర్బన్‌లో భారత్‌కిది తొలి విజయం. ఈ సారీ భారత్ బ్యాట్స్‌మన్లు చివరి టెస్టు అందించిన విజయంతో వన్డేల్లో కూడా తన ఆత్మ విశ్వాసాన్ని కొనసాగిస్తూ సఫారీల బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొన్నారు. ఆరంభంలో కొంచెం తడబడ్డప్పటికి కోహ్లీ పరిస్థితిని చక్కదిద్దాడు. కోహ్లీకి ధావన్ రహానేలనుంచి మద్దతు దొరకడంతో అడపాదడపా ఫోర్లు కొడుతూ భారత్ స్కోరును పరుగెత్తింపచేశాడు. కోహ్లీ 112 పరుగుల్లో 10 ఫోర్లు ఉన్నాయి. అత్యంత కీలకమైన అంశమే మిటంటే.. వికెట్ల మధ్య పరుగెత్తటం. రహానే, కోహ్లీ మధ్య భాగస్వామ్యం. కోహ్లీ, ధావన్‌లు క్రీజులో ఉన్న సమయంలో వారిద్దరు రెండవ వికెట్‌కు 34 పరుగులను భారత్ స్కోరుకు జోడించారు. దావన్ బంతిని ఆడి పరుగుకోసం ప్రయత్నించడంలో ఆలస్యం చేయడంతో మర్‌క్రం నేరుగా బంతిని వికెట్ల మీదికి విసరడంతో దావన్ రనౌట్ అయ్యాడు. అనంతరం రహానే, కోహ్లీ జోడీ సఫారీల బౌలింగ్‌ను చిందర వందర చేశారు. వీరిద్దరూ 112 బంతుల్‌ఓ 100 పరుగులను స్కోరుకు జోడించారు. రహానే 60 బంతుల్లో అర్ధ శతకం పూర్తిచేసుకోగా, వీరి భాగస్వామ్యం 154 బంతుల్లో 150 పరుగులకు పెరిగింది. కోహ్లీ 105 బంతుల్లో తన సెంచరీని పూర్తిచేశాడు. భారత కెప్టెన్‌గా అత్యధిక సెంచరీలు చేసిన సౌరబ్ గంగూలీ సరసన కోహ్లీ నిలిచాడు. అయితె కోహ్లీ ఇందుకు 41 ఇన్నింగ్స్‌లు ఆడగా, గంగూలీకి 142 ఇన్నింగ్స్‌లు పట్టింది. 43వ ఓవర్లో కోహ్లీ ఔటయినప్పుడు ప్రేక్షకులు, ఆటగాళ్ల కరతాళ ధ్వనులతో కోహ్లీకి అభినందనలు తెలిపారు. సఫారీల కెప్టెన్ డుప్లెస్సిస్ కూడా సెంచరీ చేసినప్పటికీ ఆ జట్టుకు లాభించలేక పోయింది. సఫారీల బ్యాటింగ్ సమయంలో కోహ్లీ ఫీల్డింగ్ చేస్తూ గాయపడి పెవిలియన్‌కు చేరడంతో ధోని ఆటగాళ్లకు సూచనలి చ్చాడు. లెగ్ స్పిన్నర్లు కులదీప్ యాదవ్, యజువేంద్ర చాహల్‌లు తొలిసారిగా సఫారీ గడ్డపై ఆడుతూ అద్భుత ప్రతిభను చాటారు. యాదవ్ 34 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా, చాహల్ 45 పరుగులకు 2 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.

ద. ఆఫ్రికా వర్సెస్ భారత్ మ్యాచ్‌ల్లో అత్యధిక భాగస్వామ్యం (ద. ఆఫ్రికాలో మాత్రమే)

టెండూల్కర్-గంగూలీ (జొబర్గ్-2001) - 193 పరుగులు (తొలి వికెట్‌కు)

కోహ్లీ-రహానే (డర్బన్-2018) 189 పరుగులు (మూడో వికెట్‌కు)

గంగూలీ- ద్రవిడ్ (ఈస్ట్ లండన్-1997) 117 పరుగులు(తొలి వికెట్‌కు)

వన్డేల్లో కెప్టెన్‌గా అత్యధిక సెంచరీలు

రికీ పాంటింగ్ (అస్ట్రేలియా) 22
ఎబి డివిల్లీయర్స్ (ఆస్ట్రేలియా) 13
సౌరబ్ గంగూలీ (భారత్) 11
విరాట్ కోహ్లీ (భారత్) 11
సనత్ జయసూర్య (శ్రీలంక) 10

ద. ఆఫ్రికా వర్సెస్ భారత్ మ్యాచ్‌ల్లో 3 వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం

కోహ్లీ-రహానే	(డర్బన్-2018)	189 పరుగులు
టెండూల్కర్ - ద్రవిడ్	(బెల్‌ఫాస్ట్ 2007)	158 పరుగులు
ధావన్-రహానే-	(ఎంసీజీ 2015)	125 పరుగులు

సెమీస్‌లోకి సింధు, సైనా నిష్క్రమణ



సైనా బాటలో కశ్యప్, సాయ్ ప్రణీత్ ఇండియా ఓపెన్ సూపర్ - 500 టోర్నీలో

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ సూపర్-500 టోర్నీలో పివి సింధు సెమీఫైనల్స్‌కు చేరగా మరో స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఓటమితో టోర్నీనుంచి నిష్క్రమించింది. ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలో ఫైనల్‌కు చేరి రన్నరప్‌గా నిలిచిన సైనా శుక్రవారం జరిగినక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అమెరికా షట్లర్ బెయ్‌వెన్ జాంగ్(ర్యాంక్.11) చేతిలో 10-21,13-21 సెట్లను కోల్పోయి ఓటమి పాలయ్యింది. వరుసగా తప్పిదాలు చేసిన సైనా జాంగ్‌కు ఏమాత్రం పోటీని ఇవ్వలేకపోయింది. మరో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో పివి సింధు స్పెయిన్ షట్లర్ బీట్రిజ్ కొర్రాలెస్ (ర్యాంకు 36)తో జరిగిన పోటీలో మూడు సెట్లలో రెండింటిని కైవసం చేసుకొని సెమీస్‌లోకి ప్రవేశించింది. తొలిసెట్‌ను 21-12 తేడాతో గెలిచిన సింధు మలిసెట్‌లో తడబడి 19-21 తేడాతో చేజార్చుకుంది. మూడో సెట్‌లో పుంజుకున్న సింధు 21-11 తేడాతో గెలిచి తన ఆటకు తిరుగులేదని చాటింది. సెమీస్‌లో సింధు, 2013 వరల్డ్ ఛాంపియన్ థాయ్‌లాండ్‌కు చెందిన రాట్చనోక్ ఇంథానొన్(ప్రపంచ ర్యాంకు 3)తో తలపడనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎనిమిదోసీడ్‌లో ఉన్న ఎన్. సిక్కిరెడ్డి ప్రణవ్ జెర్రీచోప్రా ఫైనల్లోకి ప్రవేశించారు. వీరు చైనాకు చెందిన హాన్ చెంగ్‌కయ్, కావో టాంగ్ వెయ్ జంటను 21-8, 21-13 తేడాతో ఓడించారు. ఫైనల్లో సిక్కిరెడ్డి, ప్రణవ్ జోడీ ఐదో సీడెడ్ డానిష్ జోడి మాథియాస్ క్రిస్టియన్‌సేన్, క్రిస్టియాన పీడెర్సన్‌తో టైటిల్‌కోసం పోరాడుతారు. డానిష్‌జోడీ భారత్‌కు చెందిన సాత్విక్ స్వరాజ్, రాంకిరెడ్డి జోడీని 21-17, 21-11 తేడాతో ఓడించారు.



పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్, బి సాయ్ ప్రణీత్, సమీర్ వర్మలు ఓటమి పాలయి టోర్నీ నుంచి నిష్క్రమించారు. కశ్యప్ చైనీస్ షట్లర్ కియో బిన్ చేతిలో 16-21, 18-21 తేడాతో ఓటమి చెందగా, ప్రణీత్ తైవాన్ షట్లర్ చో టెయిన్ చేతిలో 15-21, 13-21 స్కోరుతో పరాజయం పొందగా, సమీర్ మలేసియన్ షట్లర్ ఇస్కాందర్ జుల్కామెయిన్ చేతిలో 17-21, 14-21 తేడాతో ఓటమి చెందారు. ఈ రోజు ఆటలో విశేషమేమంటే... హాంగ్‌కాంగ్‌కు చెందిన చ్యూంగ్ న్గాన్ యి ఒలింపిక్ ఛాంపియన్ కరోలినా మారిన్‌ను 21-12, 21-19 తేడాతో ఓడించడం. వీరి మధ్య ఆట 48 నివింషాల పాటు సాగింది. మారి అంపైరింగ్ భాగాలేదని వ్యాఖ్యానించింది. పురుషుల డబుల్స్‌లో టాప్ సీడెడ్ మార్కస్ ఫెమాల్డి గిడియోన్, కెవిన్ సంజయ సుఖమూల్జి జంట భారత్‌కు చెందిన మను అత్రి, బి సుమీత్ రెడ్డిను 21-19, 21-19 తేడాతో ఓడించారు. మహిళల డబుల్స్‌లో ఆశ్విని పొన్నప్ప, ఎన్ సిక్కిరెడ్డి జోడీ చైనాకు చెందిన దుయే, లియెన్‌హుయ్ జోడీ చేతిలో 17-21, 21-23 తేడాతో ఓడిపోయారు. ఏడో సీడ్ ఇండియా జోడీ జక్కంపూడి మేఘన, పూర్వాంశి ఎస్ రామ్, థాయ్ జోడీ జొంగకొల్ఫాన్ కిటిథర్కుల్, రవిండా ప్రజోంగ్జల్ చేతిలో 10-21, 15-21 తేడాతో ఓటమి చెందారు.

రాష్ట్ర క్రీడా బడ్జెట్‌ను రూ. 700 కోట్లకు పెంచాలి

సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి సీఎంకు వినతి



హైదరాబాద్: 2018-19 రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణలో క్రీడల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర క్రీడల బడ్జెట్‌కు కేటాయింపులు రూ.700 కోట్లకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(సాట్స్) చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కోరుతూ ఒక ప్రతిపాదన పత్రంను ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్. నర్సింగ్ రావుకు సమర్పించారు. యువతలో క్రీడలపట్ల ఆసక్తిని పెంచేందుకు క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడానికి స్పోర్ట్స్ అకాడమీలు/ హాస్టల్స్, అంతర్జాతీయ స్థాయి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేయాలని వెంకటేశ్వర్‌రెడ్డి తన ప్రతిపాదనలో విజ్ఞప్తి చేశారు. అంతేకాక, నియోజక వర్గాల్లో క్రీడా వసతులను పెంచి.. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహ మొత్తం పెంచాలని కోరారు.



తెలంగాణ టీ-20 లీగ్ లోగోను ఆవిష్కరిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జీ. వివేక్ తదితరులు

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

lifepage2012@gmail.com

కోల్డ్ షోల్డర్...ఫ్యాషన్ హోల్డర్!

ఫ్యాషన్‌కి ఒక చక్కని పర్యాయపదం చెప్పాలంటే...అది... భిన్నత్వమే. అవును అప్పటికే ఆచరణలో ఉన్న దానికి భిన్నంగా వెళ్లడమే ఫ్యాషన్‌కి మొదటి అడుగు. ఇక్కడ కనబడుతున్న బ్లౌజుల్లో చేతులు కనబడుతున్న తీరుని కోల్డ్ షోల్డర్ అంటారు. భుజం వద్ద శరీరం కనిపించేలా వీటిని రూపొందించడం జరిగింది. పొట్టి చేతులు, పొడుగు చేతులు, స్లీవ్‌లెస్, బుట్టచేతులు...ఇలా ఇప్పటివరకు జాకెట్ చేతులు ఎన్నో రూపాంతరాలు చెందాయి. ఆ క్రమంలో ఇదీ ఒకటి. భుజాలు కనిపించేలా డిజైన్ చేసే భాగంలో... రకరకాల అందమైన భిన్నమైన అలంకారాలు చేసే అవకాశం ఉండటం వలన ఈ జాకెట్లు మరింత ఆకర్షణీయంగా కనబడుతున్నాయి.



పద్మావతి సినిమా వివాదం ఇంకా కొలిక్కి వచ్చినట్టుగా లేదు. ఈ సినిమాపై హిందీ నటి స్వరా భాస్కర్ చాలా తీవ్రమైన విమర్శలు చేసి...అందుకు ప్రతిగా నెటిజన్లచేత విపరీతమైన మాటలను ఎదుర్కొంటున్నారు. సినిమాలో....తనని మోహించిన ఖిల్జీకి దక్కకూడదని పద్మావతి తన సహ మహిళలతో కలిసి ఆత్మాహుతికి పాల్పడటంపై స్వరా భాస్కర్...తీవ్రంగా స్పందించారు. మహిళకు ఉన్న విలువపై ఆమె ఘాటైన ప్రశ్నలు వేశారు. అత్యద్భుతమైన మీ సినిమా ద్వారా...స్త్రీ అంటే...ఆమె పునరుత్పత్తి అవయవాలు మాత్రమే...అనేలా చేశారని...తనకు అలాంటి ఫీలింగే కలిగిందని స్వరా భాస్కర్... పద్మావత్ దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీకి ఒక బహిరంగ లేఖ రాశారు. దీనిపై సోషల్ మీడియాలో స్వరా భాస్కర్...ఇంతకంటే ఘాటైన విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. కొంతమంది ప్రముఖులు కూడా...స్వరా భాస్కర్ ఆదర్శం నిజమైన ఫెమినిజం కాదని...అది నకిలీ ఫెమినిజం అని ఆమెపై దండెత్తారు. అయితే కొంతమంది సెలబ్రిటీ మహిళలు మాత్రం ఆమెకు అండగా నిలిచారు.

భావస్వేచ్ఛ బరిలో... మరోసారి పద్మావత్!



ఈ వాదనలో మీరు ఎటువైపు ఉన్నా...ఆమెని విమర్శించడం తగదు. ఆమె అభిప్రాయాలను వెల్లడించే అధికారం ఆమెకు ఉంది. ధైర్యం, తనదైన వ్యక్తిత్వమున్న స్వరా భాస్కర్ పై ఈ విధంగా దండెత్తడం తగదు.

-ప్రముఖ టెలివిజన్ హోస్ట్ మిని మాథుర్



స్వరా



ఈ సమాజానికి ఏమైందో నాకు తెలియటం లేదు. ఇతరుల అభిప్రాయాలకు విలువని ఇవ్వాలనే కనీస జ్ఞానం లేకుండా పోయింది. మనం ఎక్కడికి వెళుతున్నాం. ఆరోగ్యకరమైన రీతిలో మాట్లాడుకోవటం, చర్చించుకోవటం మనకు ఎందుకు చేతకావటం లేదు. మానవత్వం ఏమైంది. స్వరా భాస్కర్ తనదైన అభిప్రాయం ఎందుకు కలిగి ఉండకూడదు..ఎందుకు మనం దానిని గౌరవించకూడదు.

-బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల

సంజయ్ లీలా బన్సాలీకి ఎలాగైతే తనకు నచ్చినట్టుగా సినిమా తీసి విడుదల తీసే హక్కు ఉందో...అలాగే స్వరా భాస్కర్‌కి తన అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉంది. మీరు ఆమె అభిప్రాయాలను ఒప్పుకోవచ్చు...ఒప్పుకోకపోవచ్చు కానీ...ఆమెను దూషించి అవమానించే అధికారం మాత్రం ఎవరికీ లేదు.

-బాలివుడ్ నటి రిచాచద్దా



విఐపిలకు వడ్డించడం...మహా కష్టం!

ఆకాశవీధిలో...అందాల సేవిక!

ఎయిర్‌హోస్టెస్‌లు అనగానే..ఒక ప్రత్యేకమైన వేష ధారణతో అందంగా నాజూగ్గా ఉండే అమ్మాయిలే మనకు గుర్తొస్తారు. అందంగా కనిపించడం వారి విధుల్లో భాగమే. ఇక్కడ చిత్రంలో కనబడుతున్న అందమైన అమ్మాయిలు దుబాయికి చెందిన విమానయాన సంస్థ ఎమిరేట్స్ కి చెందిన విమాన సహాయకులు. వీరు తమ విధుల్లో భాగంగా ఉండే నియమ నిబంధనలను, విఐపి ప్రయాణీకులకు అందించాల్సిన రాచమర్యాదలను వెల్లడించారు. తమ విధుల్లో పాటించాల్సిన నియమాలు చాలా కఠినంగా ఉంటాయని. తమ గోళ్ల రంగు, లిప్‌స్టిక్ రంగులు సైతం నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఈ యువతులు అంటున్నారు. మరిన్ని విశేషాలు వారి మాటల్లోనే-



ఆకాశ ప్రయాణంలో... అత్యంత గ్లామర్ కలిగిన విమాన సిబ్బందిగా పేరున్న ఎమిరేట్స్ విమాన సహాయకులు నిజంగానే అందానికి ఆకర్షణకు మారుపేరులా కనబడుతుంటారు. పెదవులకు ఎర్రని లిప్‌స్టిక్ అదే ఎరుపు షేడ్ ఉన్న టోపీతో చాలా ఆకర్షణీయంగా, విమాన సహాయకులు అంటే ఇలా ఉండాలి... అనిపించేలా ఉంటారు.

మొదటి తరగతి మేకప్ నియమాలు మహా కఠినం

మొదటి తరగతి విమాన సహాయకులుగా పనిచేసే క్యాబిన్ క్రూ మేకప్ విషయంలో నియమ నిబంధనలు చాలా ఎక్కువగా ఉంటాయంటున్నారు...ఎమిరేట్స్ ఫస్ట్‌క్లాస్ క్యాబిన్ సిబ్బంది హోదాలో పనిచేస్తున్న యువతులు. ఎకానమీ తరగతిలో కంటే ప్రీమియం క్లాసుల్లో ప్రయాణించే విఐపీలకు సహాయకులుగా పనిచేయాలంటే..తమకు చాలా కట్టుదిట్టమైన శిక్షణ ఉంటుందని, మేకప్, హెయిర్ స్టయిల్, షూస్ విషయంలో నియమ నిబంధనలను సరిగ్గా పాటించాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు. ఐషాడో రంగు నుండి జుట్టు ముడి వరకు అన్నీ పద్ధతిగా నిబంధనలకు అనుగుణంగా ఉండితీరాలంటున్నారు.

వడ్డింపులోనూ పద్ధతులెన్నో...

జోన్నా కొలీన్స్ ఈ విషయంపై స్పందిస్తూ..మొదటి తరగతి విమాన సహాయకురాలి హోదాకు వెళ్లాలంటే శిక్షణ చాలా తీవ్రంగా ఉంటుందని తెలిపింది. మొదటి తరగతిలో ప్రయాణించేవారికి సహాయకులుగా పనిచేయాలంటే..ముందు తమకు అన్నిరకాల ఫైన్ వైన్స్, ఫిజ్ (కాకటైల్స్) గురించి తెలిసి ఉండాలని చెప్పిందామె. వైన్ ఎడ్యుకేషన్ కోర్సులో భాగంగా..ఈ వివరాలన్నీ తమకు పాఠాలుగా ఉంటాయంది. పాత వైన్‌కి కొత్త వైన్‌కి తేడాలు తెలిసి ఉండాలని, అలాగే షాంపేన్స్, విస్కీలు ఇతర అన్నిరకాల స్పిరిట్స్ గురించి తెలిసి ఉండాలని, గ్లాసులో ఏం పోస్తున్నామనే దానిపై స్పష్టమైన అవగాహన ఉండాలని కొలీన్స్...ఒక మేగజైన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఎకానమీ తరగతిలో అయితే డైనింగ్ విషయంలో ఒకటే ట్రే ఉంటుందని, కానీ మొదటి తరగతిలో సిల్వర్ సర్వీస్ డైనింగ్ ఉంటుందని, ఇందులో ఎపిటైజర్లు (ఆకలిని పెంచే ఫుడ్ లేదా పానీయాలు చిన్న పరిమాణంలో), ప్రధాన భోజనం, డిజర్టులు అనే మూడు విభాగాలను భిన్న సమయాల్లో అందించాల్సి ఉంటుందని...వారు కోరినప్పుడు కోరిన ఫుడ్‌ని ఇవ్వాల్సి ఉంటుందని ఆమె పేర్కొంది. ఏ తరహా ఆహారానికి ఏ రకమైన పాత్రలు ప్లేట్లు స్పూనులు వాడాలనే విషయంలోనూ తమకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని వివరించింది.



మేకప్‌లో ఎమిరేట్స్ ప్రత్యేక ముద్ర

మేకప్ గురించి వివరిస్తూ....'గోళ్లకు పాలిష్ వేయకుండా వదిలేయవచ్చు...అలా అవి లైట్ పింక్ రంగులో కనబడాలి. లేదా ఎరుపు రంగు నెయిల్ పాలిష్‌ని వాడాలి. ఇక ఎమిరేట్స్ రెడ్‌గా గుర్తింపు పొందిన ఎరుపు రంగు లిప్‌స్టిక్‌ని లిప్‌లైనర్‌తో వాడాల్సి ఉంటుంది. మేము మ్యాక్స్ రష్యన్ రెడ్‌ని వాడతాము... ఎందుకంటే ఇది ఎక్కువ సమయం నిలిచి ఉంటుంది. నలుపు లేదా బీజ్‌రంగులో ఉన్న ఐషాడోని వాడుతూ..సరైన షేపు కోసం లిక్విడ్ ఐ లైనర్‌ని ఉపయోగిస్తాం. హెయిర్ స్టయిల్‌కి ఫ్రెంచ్ ట్విస్ట్ చేయాలి లేదా బన్ వేసుకోవాలి. దీనికి ఎరుపు రబ్బర్ బ్యాండునే వాడాల్సి ఉంటుంది' అని కొలీన్స్ వివరించింది.


ప్రయాణీకుల వివరాలు ముందుగానే తెలుస్తాయి

మొదటి తరగతి ప్రయాణీకులు విమానం ఎక్కక ముందే సహాయకులు కొంత హోం వర్క్ చేయాల్సి ఉంటుంది. విమానంలో తాము సహాయకులుగా పనిచేయాల్సిన ప్రయాణీకుల పేరు ఇతర వివరాలు ముందుగానే అందిస్తారని... ఈ వివరాలన్నీ ఆన్‌బోర్డ్ ట్యాబ్‌లేట్‌లో ఉంటాయని.. ఈ వివరాలను బట్టి...ప్రయాణీకుల ఇష్టాఇష్టాలు, ఆహార అవసరాలు, వారి ట్రిప్ ఉద్దేశ్యం మొదలైన అంశాలతో నోట్సు రాసుకోవాల్సి ఉంటుందని కొలీన్ తెలిపింది. 'విమానంలో ఉన్నంత సమయం తప్పకుండా షూధరించే ఉండాలి. ఎయిర్‌పోర్టులోనూ, విమానం ఎక్కేంత వరకు హీల్స్‌తోనే ఉండాలి. విమానం బయలు దేరాక ఎరుపురంగులో ఉన్న ఎత్తులేని చెప్పులను వాడవచ్చు. అయితే కొంతమంది అమ్మాయిలు వాటిని ధరించడానికి ఇష్టపడరు.. హీల్స్ తోనే ఉంటారు. కానీ 16 గంటల ప్రయాణ సమయంలో హీల్స్‌తో ఉండటం నా వల్ల మాత్రం కాదు' అని ఆమె చెప్పింది. విమానం టేకాఫ్ తరువాత సర్వీస్ దుస్తులు ధరిస్తామని..జాకెట్ తీసేసి వెయిస్ట్‌కోటుని వేసుకుంటామని, అందరి యూనిఫామ్ ఒకే రంగులో ఉంటుంది కానీ...ఫ్లైట్ అటెండెంట్స్ హెడ్ దుస్తులు మాత్రం బ్రౌన్ రంగులో ఉంటాయని కొలీన్స్ వివరించింది.

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

దివ్య దర్శనాలు



(గత సంచిక తరువాయి భాగం)

"అక్కడ ఆమె ఈ సంభవం ఎవరితోనైనా చెప్పిందేమో?" అన్నాను. "విచారించాము గాని ఆమె అప్పుడు చెప్పే స్థితిలో లేదట" అన్నారు భగవాన్. "నాయనగారికి దర్శనమిచ్చినట్లే ఆమెకున్నూ దర్శనమిచ్చి అనుగ్రహించారన్నమాట. ఏకస్తన్య పాన ఫలితం వృథాపోతుందా?" అన్నాను. "ఊ -అదే-అదే. అమ్మ మా యిద్దరికీ పాలిచ్చేది. నాకు అయిదేండ్లు దాటేదాకా తాగుతూనే వున్నాను. మా నాయన చూస్తే 'ఎదిగిన పిల్లాడికి పాలే'మని కోపం చేసేవారు. అందువల్ల వారిని బయటికి పోనిచ్చి తాగేవాణ్ణి. అమ్మవద్ద పాలు అంత సమృద్ధిగా వుండేవి" అన్నారు భగవాన్.

"భగవాన్ గణపతి శాస్త్రి గారిని గూడా 'నాయనా' అంటారెందువల్ల? అన్నారొక భక్తులు. "ఎందువల్లనా? అందుకొక కారణం వున్నది. సాధారణంగా నేను అందరినీ మర్యాదగా పిలవటం మామూలుగదా! పైగా వారు నాకంటె వయస్సులో పెద్దవారు. గణపతి శాస్త్రిగారూ, రండీ, పొండీ అనేవాణ్ణి. వారికది పట్టరాని బాధగా వుండేది. 'శిష్యుణ్ణి గదా? గణపతీ! రారా! పోరా అనక అదేమి అన్యాయ'మని ఎన్నిసార్లో బ్రతిమాలారు. నేను వినలేదు. కడకొకనాడు 'ఏమైనా సరే. ఈ మర్యాదవాచకం మానితేగాని వీల్లే'దని పట్టుబట్టి కూర్చున్నారు. వారి శిష్యులంతా వారిని 'నాయన' అంటారు గదా. అదొక సాకు పెట్టుకొని 'ఇదుగో వీరందరితో పాటు నేనున్నూ. 'నాయనా' అంటే బిడ్డకూ అన్వయిస్తుంది గదా. శిష్యుణ్ణి బిడ్డగా భావించుట సహజమేనని వారు సమాధానానికి వచ్చారు. 'నాయన' అంటే తండ్రి గదా, మనదేం పోయిందని నేనొప్పుకున్నాను. అయితే ఏమి. రండీ పొండీ అనుట మానలేదు. వారికి మాత్రం ఇంత చేసీ లాభం లేకపోయిందే అన్న కించ వదలనే లేదు. ఏం చేస్తారు?" అన్నారు భగవాన్.

"భగవాన్ దర్శనమిచ్చిన సంగతి మీనాక్షమ్మ చెప్పే స్థితిలో లేదన్నారు; సరే, నాయనగారు చెప్పే వున్నారు గదా. ఉభయులకూ ఒకే సమయంలో ఒకే అనుభవం కలిగించే ఈ దర్శనాలను గుఱించి పరిభాషలో ఏమంటారో?" అన్నా నేను. భగవాన్ దరహసితవదనులై "వాటినే దివ్యదర్శనాలంటారు" అన్నారు.

తెల్లనెమలి

మొన్న 12వతేదీన బరోడా రాణి పంపిందని ఒకరొక తెల్లనెమలిని తెచ్చి, భగవత్సన్నిధిలో సమర్పించారు. భగవాన్ చూచి "ఆ పది పన్నెండు నల్ల నెమళ్లు వస్తున్నవే చాలదా? అవి దీనిపైకి జగడానికి వస్తవేమో? ఈ జాతి వేరు. అదీగాక పిల్లులు మొదలైన వాటి బాధ లేకుండా కాపాడాలి. ఎందుకివి మనకు? వారి బసలోనే ఉంచుట మంచిది" అన్నారు. వారు వినక ఇక్కడే వదలి వెళ్లారు. కృష్ణస్వామి దాని సంరక్షణ కర్త. తక్కినవారు వారికి సహాయం.

మొన్న మధ్యాహ్నం నేను వెళ్లేసరికి భగవాన్ ఆ నెమలి చేష్టలను గురించి సమీపస్థులతో మాట్లాడుతూ "ఇదుగో, వల్లి అనే జింక పిల్లను నిప్పుల పెట్టెలు చేసే వర్తకుడొకడు తెచ్చి ఇట్లాగే విడిచి వెళ్లాడు. ఇక్కడే పెరుగుతూ ఉండేది. సెనగపప్పూ, మరమరాలూ కలిపి పళ్లెంతో పోస్తే ఒక్క గింజయినా క్రిందపడకుండా ఏరి పప్పంతా తిని, మరమరాలు వదిలేసేది. కొన్నాళ్లకు మేకలమందతో కలిసి అడవికి పోతుంటే, ఎరిగినవారిది ఆశ్రమానిదని పట్టి తెచ్చేవారు. వెనుక తానే తిరిగి వచ్చేది. పోనిమ్మని ఊరుకున్నాం. ఒకనాడెవరో పంచములు మాంసం కొఱకు కాలు విరగగొట్టటం చూచి, "అయ్యో, అది ఆశ్రమానిదే?" అని ఎరిగిన వారొకరు ఎత్తుకొని తెచ్చారు.

(తరువాయి భాగం వచ్చేసంచికలో)

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభపరిణామాలు చోటు చేసుకొంటాయి.ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసిక ధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు ఉపకరిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. శ్రమ పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు/ లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవిచూస్తారు.


కుంభరాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. శ్రమ అధికమవుతుంది. అవకాశాలను సద్వినియోగ పరచుకోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదా యంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

సంస్కృతి ఒక సంఘటిత శక్తి



'ప్రతి జాతికి ఉత్తమ లక్షణాలు కలిగిన సనాతనమైన సంస్కృతి అంటూ ఒకటి ఉంటే దానిని పరిరక్షించుకోవడమూ, అనుసరించడమూ అతి ముఖ్యం. అలాంటి సంస్కృతి చేత జాతి మొత్తం ఏకమై, ఏకోన్ముఖమవుతుంది. ఆ సంస్కృతి పట్ల విశ్వాసం లేని మరి ఏ ఇతర శక్తి చేత సంఘటితం కాజాలదు'. కలియుగంలో సంఘటిత సంఘ శక్తే జాతిని కలిపి ఉంచుతుంది. ఇదే విషయాన్ని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు.

'ప్రకృతి శక్తులన్నీ కళ్యాణ కారకాలగుగాక' అంటుంది వేదం. నీరు, నిప్పు, సూర్యచంద్రులు, గ్రహతారకలు, పర్వతాలు, పుడమి, చెట్టు, చేమ ఇవన్నీ ఈశ్వరమయాలు. అవి మనకు శాంతిని, శుభాన్ని కలిగిస్తాయని అథర్వణ వేదం ఆకాంక్షిస్తుంది. సంకల్పానికి, కర్మకి బలీయమైన శక్తి ఉంది. కాలం కాని, ప్రకృతి గాని జడపదార్థాలు కావు. అవి చైతన్య స్వరూపాలు. అవి మన సంకల్పాలను, క్రియలను గమనిస్తాయి, స్పందిస్తాయి. అందువలన ప్రకృతి పరిరక్షణే పరమేశ్వరార్చనగా భావించాలి. అందుకు చిత్తశుద్ధి తోడు కావాలి. మనమందరం శుద్ధులమై, పవిత్రులమై యాజ్ఞికులం కావాలని ఋగ్వేదం ఆశిస్తోంది. పవిత్రత ఉన్న చోట చేరిన సంపదలు వ్యక్తులకు, సమాజానికి, దేశానికి క్షేమాన్ని కలిగిస్తాయి. స్వార్థరహిత ప్రకృతి హితమే మన ధ్యేయం, సంకల్పం కావాలి. అందుకు సత్కర్మ విధానం సహకరిస్తుంది.

నేడు కొందరు ఒక్కొక్క రంగుని ఒక్కో మతానికి, వర్గానికి, కులానికి ఆపాదిస్తున్నారు. కాని దేశం అంటే ఇంద్ర ధనుస్సులాంటిది. అందులో ఏడు రంగులున్నాయి. ప్రతి రంగుది ప్రత్యేక గుణం. ఆ ఏడు రంగులు ఇంద్ర ధనుస్సులో కలిసే ఉంటాయి. అలాగే మనకు మన మత విశ్వాసం ప్రీతి కరం అయినా జాతుల, మతాలు వర్గాల మధ్య విభేదాలుండరాదు.

అందుకు దేశ పౌరులుగా మనం ఏమి చేయాలి? జీవుని వలె, పరమాత్మ వలె సనాతన ధర్మం, నిత్యము, శాశ్వతము అని గ్రహించాలి. సనాతన ధర్మం నేడు హిందూ ధర్మంగా లేదా మతంగా చలామణి అవుతోంది. సనాతనం అంటే ఆద్యంతాలు లేనిది. అయితే మన ధర్మాన్ని అందరూ హిందూమతంగా పేర్కొంటున్నారు. దాన్ని హిందువులు అంగీకరించినందున ప్రమాదం లేదు. ఒక జాతి క్షేమం, శక్తి, పురోగతి లేదా క్షయం ఇవన్నీ దేని మీద ఆధారపడి ఉంటాయో దానిని రక్షించుకోవాలి. ఈ విషయంలో మన పెద్దలేమన్నారో పరిశీలిద్దాం. 'ప్రతి జాతికి ఉత్తమ లక్షణాలు కలిగిన సనాతనమైన సంస్కృతి అంటూ ఒకటి ఉంటే దానిని పరిరక్షించుకోవడమూ, అనుసరించడమూ అతి ముఖ్యం. అలాంటి సంస్కృతి చేత జాతి మొత్తం ఏకమై, ఏకోన్ముఖమవుతుంది. ఆ సంస్కృతి పట్ల విశ్వాసం లేని మరి ఏ ఇతర శక్తి చేత సంఘటితం కాజాలదు'. కలియుగంలో సంఘటిత సంఘ శక్తే జాతిని కలిపి ఉంచుతుంది. ఇదే విషయాన్ని శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఇలా చెప్పాడు.

శ్రేయాన్స్వధర్మో విగుణం పరధర్మాత్స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః

అనగా చక్కగా ఆచరించబడిన పర ధర్మం కంటే, స్వధర్మం కించిద్గుణలోపం కలదైనా శ్రేష్ఠతరం. పర ధర్మజీవనం కంటే స్వధర్మాచరణంలో మరణమే మేలు. స్వధర్మం వల్ల ఇహ లోకంలో కీర్తి, పరంలో స్వర్గం కలుగుతాయి. పర ధర్మం వల్ల ఇహ లోకంలో అపకీర్తి, పరంలో నరకం కలుగుతాయి. అందువలన పర ధర్మం హానికరం. మనం దీనిని దేశభక్తి అంటున్నాం. దేశ భక్తిలో సమాజం, వ్యక్తి విహితమై ఉండాలి. ఇక్కడ దేశ భక్తి అంటే అది రాజకీయ దృక్పథమా? నిజానికి దేశ భక్తి అంటే ఇవేవీ కావు. ఆ జాతి సంస్కృతి పట్ల ప్రేమ, గౌరవాలు, దానిని పరిరక్షించుకోవాలనే తపన. వీటి నుంచి పుట్టే పవిత్ర భావన పేరే దేశభక్తి. ఏ దేశ ప్రజలు ఆ దేశ సంస్కృతిని గౌరవించరో, ఆచరించరో, అంతేకాక ద్వేషభావంతో అవమానిస్తారో ఆ ప్రజలు దేశభక్తులు కాజాలరు. ఆ సంస్కృతి పట్ల గౌరవం కలిగిన ఒక వర్గం ప్రజలు ఆ దేశీయులను ద్వేషించి హాని కూడా చేయగలుగుతారు. ఆ పరిస్థితులలో ఆ దేశం, ఆ సమాజం, ఆ ప్రజలు దుర్బలులవుతారు. అందువలన దేశ భక్తికి గీటురాయి తన సంస్కృతిని గౌరవించడం.

ప్రకృతిలో నానా రకాల చెట్టుచేమలు, ఎత్తు పల్లాలు ఉన్నట్టు ఒక సనాతన దేశంలో భిన్న మతాలను, ఉపాసనా పద్ధతులను ఆచార వ్యవహారాలను ఆచరించే వారుంటారు. వారు కూడా సనాతనమైన, దేశీయమైన సంస్కృతిని గౌరవించడం నేర్చుకుంటే దేశం క్షేమంగా ఉంటుంది. సనాతన సంస్కృతిని గౌరవించి ఆచరిస్తే ఆ దేశం సమైక్యంగా ఉంటుంది. రాజకీయంగాను, ఆర్థికంగాను, సామాజికంగాను బలపడుతుంది. ఇలాంటి దేశ భక్తే జాతి సమైక్యతకు పునాది. ఇక విభిన్న సంప్రదాయాలను అనుసరించే వారు ఉన్నప్పటికీ భిన్నత్వంలో ఏకత్వం కోరుకోవాలి. హిందూ మతంగా చెప్పబడుతున్న దానిలో పలుశాఖలున్నాయి. అందువలన ధార్మిక, సాంస్కృతిక ఐక్యత, మతాలకు, వర్గాలకు అతీతమైనది.

ధార్మిక సంస్కృతికి, దృక్పథానికి ముఖ్యంగా కావలసినవి మానవత్వం, నీతి న్యాయం, క్షమ, దాతృత్వం పరమత సహనం, ఈశ్వరుని మీద విశ్వాసం. ఈశ్వరుడు అంటే త్రిమూర్తుల్లోని శంకరుడో, సర్వేశ్వరుడో అని భావించరాదు. అన్ని మతాలు, వర్గాలు, కులాల వారికి ఇష్టదైవం ఉంటాడు. ఎవరికి తోచిన దేవతను వారు పూజించడం ధార్మికమే, పూజాపద్ధతి ఏదైనా సరే.

దేశం క్షేమంగా ఉండాలన్నా, సుసంపన్నం కావాలన్నా సోదర భావం వెల్లివిరియాలన్నా సృష్టి నియమాలను అతిక్రమించరాదు. హింస వల్ల గతంలో మేలు జరగలేదు. నేడు జరగడం లేదు. భవిష్యత్తులో జరగదు. అందువలన మంచి సంకల్పం, మంచి కార్యాచరణ, సోదర భావం ఇవే దేశ భక్తికి మూలం. మనకు జన్మనిచ్చిన గడ్డ, మనకు కూడు, నీడ ఇస్తున్న ఈ పుడమి, నేల కాదు. అమ్మలను గన్న తల్లి భరత మాత. ఆ భావం ప్రతి ఒక్కరి హృదయాల్లోను ఉండాలి. 'కలసి ఉంటే కలదు సుఖం' అని మన పెద్దలన్నది వేద వాక్యంతో సమానం.

గుమ్మా ప్రసాదరావు
(భిలాయ్ నుంచి)
9755110398

సాగరతీరాన చాలీసా యజ్ఞం

లక్ష మందితో

-గణపతి సచ్చిదానంద స్వామి పర్యవేక్షణ

-రేపు ఉక్కు ఫ్యాక్టరీ స్టేడియంలో సంగీత నాద సాగర...






ఆర్తితో శరణు కోరిన వారికి ఆపన్న హస్తం అందించే సకల సంకట హరుడు హనుమంతుడు. సాక్షాత్తు శ్రీ రామచంద్ర ప్రభువుల వారి కష్టాన్ని తీర్చగలిగినంతటి శక్తిశాలి. ఆయన సామాన్యులమైన మన కష్టాన్ని తీర్చగలడనే చిన్న సూత్రంతో ప్రారంభమైనదే ఈ హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం.

ఆధ్యాత్మిక తరంగాలు ఉప్పొంగేలా సముద్రుని చల్లని గాలుల సన్నిధానంలో అవధూత దత్త పీఠాధిపతి పరమపూజ్య జగద్గురు నాదబ్రహ్మ, యోగ బ్రహ్మ ప్రత్యక్ష దత్తావతార మూర్తులు, నడయాడే దత్త దైవం శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో లక్ష మంది భక్తులతో ఒకే సమయాన విశాఖ నగరంలోని రామకృష్ణబీచ్ ప్రాంగణంలో శ్రీ హనుమాన్ చాలీసా మహా యజ్ఞం శనివారం ఆరంభం కానుంది. అన్ని రాష్ట్రాల నుండి భక్తులు ఈ మహా యజ్ఞంలో పాల్గొనడానికి వైజాగ్‌కు చేరుకుంటున్నారు. పూజ్య స్వామిజీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంజనేయస్వామిని సంధాన కర్తగా పిలుస్తారని చెప్పారు. ఆంజనేయ స్వామి వారు సీతమ్మను శ్రీరామచంద్ర ప్రభువుతో కలిపి సంధానకర్త అయ్యారని, లక్ష్మణ స్వామి కోసం సంజీవని పర్వతాన్ని తెచ్చి ఆయనను బ్రతికించి రామచంద్ర ప్రభువుతో కలిపి సంధానకర్త అయ్యారని అలాగే ఆయన సీతమ్మ తల్లిని వెదకినందున శ్రీరాముడు అరణ్య వాసం నుండి అయోధ్య వాసులతో తిరిగి సంధానం కాగలిగారని అన్నారు.

ఆంజనేయ స్వామి వారు చూపిన బాటలోనే నడుస్తున్న శ్రీ స్వామిజీ కూడా ధర్మానికి దూరం అవుతున్న మనల్ని మరల ధర్మంతో అనుసంధానం చేస్తూ ధర్మమార్గంలో పయనింపచేసేందుకే హనుమాన్ చాలీసా పారాయణ చేయిస్తున్నారు. స్వామిజీ ప్రపంచ శాంతి కాంక్షిస్తూ దేశ విదేశాల్లో అనేక చోట్ల వేలాది మంది భక్తులతో ఇప్పటి వరకు 2 వేల కోట్ల హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. అటువంటి ఒక మహత్తర కోటి హను మాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞాన్ని విశాఖ నగరంలో నిర్వహిం చాలని సంకల్పించారు. ప్రత్యేకించి విశాఖ పట్టణంలో ప్రకృతి వైపరీత్యాలను శాంతింప చేయడానికి సముద్రుడిని ప్రకృతిని హను మంతుల వారి ద్వారా వేడుకుంటూ చేయతలపెట్టిన మహత్తర కార్యక్రమమే హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం. ఎక్కడ రామనామ గానం జరుగుతుందో హను మంతుడు అక్కడ సాక్షాత్కరిస్తాడు. ఆయన ఉన్న చోట జయం, విజయం, సస్యశ్యామలం ఉంటాయని ప్రతీతి. పూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ విశ్వశాంతికై సంకల్పించిన యజ్ఞంలో భాగంగా రేపు విశాఖ స్టీల్ ప్లాంట్ స్టేడియంలో ప్రకృతి పులకించేలా స్వామిజీ వారిచే నాద చికిత్స కచేరి నిర్వ హించబడుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అన్ని రాష్ట్రాల నుండి విదేశాల నుండి భక్తులు విశాఖ నగరానికి చేరుకుంటున్నారు. ఈ కార్యక్రమ నిర్వ హణకు విశాఖ పట్టణం జ్ఞానబోధ సభ ట్రస్టు భక్తులు ఏర్పాట్లు చేశారు.

(విశాఖ పట్టణం ఆంధ్రప్రభ ప్రతినిధి)



భగవద్గీత

నేను నిరాకారుణ్ణనటం తెలివితక్కువ

అధ్యాయం 7

శ్లోకం 24:

అవ్యక్తం వ్యక్తిమాపన్నం
మన్యంతే మామబుద్ధయః
పరం భావమజానంతో
మమావ్యయమనుత్తమమ్ ॥

తాత్పర్యం: నన్ను సంపూర్ణంగా ఎరుగని మంద బుద్ధులు దేవదేవుడనైన నేను (శ్రీకృష్ణుడు) తొలుత నిరాకారుడనై యుండి ఇపుడు ఈ రూపము దాల్చి నానని తలుస్తారు. అల్పజ్ఞత వలన వారు నాశరహితం అగు నా దివ్య భావమును ఎరుగలేరు.

భాష్యం: దేవతలను పూజించే వారినే కాక నిరాకారవాదులను కూడా ఇక్కడ భగవంతుడు 'అబుద్ధయః' 'తెలివి లేనివారు' అని సంబోధి స్తున్నాడు. కృష్ణుడే స్వయంగా అర్జునుడితో మాట్లా డుతూ ఉన్నా, వారు ఆయనకు రూపము లేదు, అనుటలో అర్థం లేదు. శ్రీ కృష్ణుడు దేవకీ సుతుడు, ఒక గొప్ప వ్యక్తి మాత్రమే అని అనటం తెలివితక్కువతనం. దీనినే రాబోవు తొమ్మిదవ అధ్యాయ ములో "**అవజానంతి మాం మూఢాః**" మూఢులు నన్ను అర్థం చేసికొనలేరు అని తెలుపబోవు చున్నాడు. దేవతలకు వేరు వేరు లోకాలు, భగవంతునికి వేరు లోకము ఉందని ఇంతకు ముందే చెప్పి ఉన్నారు. అంటే దేవతలు, భగవంతుడు, వ్యక్తు లని, వారికి రూపాలు, లోకాలు ఉన్నవన్న మాటే కదా! మరి భగవంతుడు నిరాకారుడు, ఇప్పుడు రూపాన్ని పొందాడు అనుటలో అర్థం లేదు.

భగవంతుడు సచ్చిదానంద విగ్రహుడు, సమస్త గుణములను కలిగిన ఆనందభరితుడు. నాల్గవ అధ్యాయంలో చెప్పినట్లు 'అజుడైనప్పటికీ ఈ లోకములో అవతరిస్తాడు. 'బ్రహ్మ సంహితలో' చెప్పినట్లు కేవలము వేదాలను చదివినంత మాత్రాన భగవంతుణ్ణి అర్థం చేసుకొన లేము. భగవంతుణ్ణి 'హరే కృష్ణహరే కృష్ణ కృష్ణకృష్ణహరే హరే, హరే రామ హరే రామ రామ రామహరే హరే' అనే మహా మంత్ర ఉచ్చా రణతో మొదలుగా ఆయ నను సేవించి కృపను పొందనిదే, భగవంతుణ్ణి ఎన్నటికీ అర్థం చేసుకోలేం.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



సుమతి శతకము

ఎప్పుడు దప్పులు వెదకెడు
నప్పురుషుని గొల్వగూడ దది యెట్లన్నన్
సప్పంబపడగనీడను
గప్పవసించెడి విధంబు గదరా సుమతీ

తాత్పర్యం: చేసే పనుల్లో ఎప్పుడూ మంచిని చూడకుండా తప్పులను వెదికే వ్యక్తిని సేవించరాదు. ఆ సేవ ఒక కప్ప పడగ నీడలో నివసించినట్లుగా నిత్యమూ ప్రమాదంతో కూడి ఉండును.

బాలప్రభ

పొడుపు కథ

ముఖం లేకపోయినా
బొట్టు పెట్టుకునేది

ప్రతిఫలం



కథ

ఒక ఊళ్లో ఓ పీనాసీ పాపయ్య ఉండేవాడు. అతను ఏ పనిచేసినా తగిన ప్రతిఫలం ఉంటేనే చేసేవాడు. లేదంటే ఎంత ముఖ్యమైన పనైనా చేయడానికి ఇష్టపడేవాడు కాదు. అతని ఈ ప్రవర్తనతో అత్తమామలు, భార్యపిల్లలు, ఊరివాళ్లు కూడా విసిగిపోయారు.
ఇలా వుండగా ఆ వూరికి ఓ సాధువు వచ్చాడు. ఆయన పగలు దేవాలయంలో పూజలు,ధ్యానం చేసుకుని సాయంత్రాలు ఊరిప్రజలకు హితోపదేశం చేయసాగాడు.
ఒక రోజు పాపయ్య గుడికి వచ్చాడు. దర్శనానంతరం పూజారి ప్రసాదం పంచుతుంటే తాను దూరం నుంచీ గుర్రపు బండి కట్టించుకుని మరీ వచ్చాడు కాబట్టి అందరికంటే ఎక్కువ ప్రసాదం ఇవ్వాలని దురుసుగా గొడవపడి సగం గిన్నెడు ప్రసాదం అరటి ఆకులో కట్టించుకుని వెళ్లాడు. మరోసారి పాపయ్య ఓ వ్యాపారి దుకాణంలో కనిపించి తాను ఒకప్పుడు పెట్టుబడి కోసం అప్పిచ్చినందువల్ల సరుకులన్నీ అందరికంటే తక్కువ ధరకే ఇవ్వాలని ఆ వ్యాపారి నష్టం కలిగేలా తక్కువ మొత్తం చెల్లించి వెళ్లడం గమనించాడు సాధువు.
అన్నింటికంటే ఘోరంగా ఆరేళ్ల కన్న కూతురిపై కనికరం లేకుండా ఎంత పెంచినా, చివరికి అత్తవారింటికెళ్లేదానివేగా? ఇకనైనా ఇల్లు వాకిలి చిమ్మటం, అంట్లు తోమటం వంటి పనులు చేస్తే నీకు దక్కు త్రిండికి దక్కు ప్రతిఫలం అని అనటం, దానికి అతని భార్య బాధపడటం కూడా అతని దృష్టిలో పడింది.
ఒకరోజు సాయంత్రం హితోపదేశం చేస్తున్న సాధువు గారు వున్నట్టుండి చెప్పడం ఆపి, పాపయ్యను దగ్గరికి పిలిచాడు. ఎందుకు పిలిచాడో అర్థం కాక వచ్చాడు పాపయ్య.
ఎన్ని రోజుల నుంచీ నా హితోపదేశాలు వింటున్నావ్? అని అందరి ముందూ అడిగాడు.
''పదిరోజుల నుంచీ స్వామీ'' అన్నాడు పాపయ్య.
పదిరోజుల నుంచీ అందరూ పండో. పువ్వో, కాయో తెచ్చి సమర్పించి వింటున్నారు. కానీ నువ్వు మాత్రం ఉచితంగా వింటున్నావ్. అలా నీలాంటి ప్రతిఫలాపేక్షపరుడు ఉచితంగా వినటం వల్ల ఊరికే అరిష్టమని కాబట్టి పౌర్ణమి రోజు ఊళ్లోని పేదలకు అన్నదానం చేయటం వల్ల దోషం నివారింపబడుతుందని, లేదంటే కరువు కాటకాలతో మేఘాలు సైతం మొరాయించటం వల్ల వర్షాలు కురవవని చెప్పాడు. ఊరంతటికీ అరిష్టమంటే ఊళ్లో వాళ్లు ఊరుకోరని పౌర్ణమి రోజు అన్నదానం చేయడానికి అయిష్టంగానే ఉద్యుక్తుడయ్యాడు పాపయ్య.
అన్నదానం వల్ల ఎంత ఖర్చు పెట్టవలసి వస్తుందో అని మనసులో దిగులు పడ్డాడు. కానీ మంచిపనికోసం కాబట్టి బియ్యం పప్పు కూరగాయలు అన్నీ దుకాణదారులు చవకగాను, కొందరు ఉచితంగాను ఇవ్వటంతో పెద్దగా బాధపడాల్సిన అవసరం లేకపోగా పాపయ్య వంటివాడు అన్నదానం చేయాలనుకోవడంతో ఆశ్చర్యపోతూ అంతా పొగిడారు.
సంతోషించిన పాపయ్య దానికి కారణమైన సాధువును అన్నదాన కార్యక్రమం ప్రారంభించడానికి పిలిచాడు.
అప్పుడు సాధువు, స్వలాభం కోసం కంటే అందరి ప్రయోజనం కోరి చేసే ఏ పనైనా గొప్పదేనని, అందువల్ల అందరికీ మేలు కలగటమే కాకుండా మంచి పేరనే ప్రతిఫలం వస్తుందని హితోపదేశం చేసాడు.
పాపయ్య కూడా నిస్వార్థంగా అందరికీ ఉపయోగపడుతూ అందరి మన్ననలు పొందాడు.

దేగల అనితాసూరి

బాలలకు తెలుగు పద్యరచనపై అవగాహన కల్పించాలి

బాలసాహితీ బంధువులు-38



రాజావాసిరెడ్డి మల్లీశ్వరి.
చిరునామా
రాజావాసిరెడ్డి మల్లీశ్వరి.
501. సాశ్రీ సీతారెసిడెన్సీ
బ్రాహ్మణవాడి
బేగంపేట, హైదరాబాద్ 500016
సెల్ : 9866583907

బాలలకు బుజ్జిబుజ్జి పద్యాలు రాయటంలో దిట్ట రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి అమ్మమ్మ. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకామైనేని వారిపాలెంలో 10 సెప్టెంబర్ 1952న పుట్టారు. అమ్మ సత్యవతీదేవి. నాన్న పుండరీకాక్షరావు. ఎంఎ, బిఎడ్ చేసి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో దీర్ఘకాలం తెలుగుఉపాధ్యాయినిగా పనిచేశారు.
ఇంటర్ చదివిన నాటి నుండి అవిశ్రాంతంగా వచనా కవితా రచనగేయ రచన వ్యాసరచన పద్యరచన, కథలు, బాలసాహితీరచన, నిఘంటు కూర్పు ఇలా ఎన్నో చేస్తూనే ఉన్నారు. 2000 నుండి బాలసాహితీరచన చేస్తున్నా.. 2007లోనే పుస్తక ప్రచురణ చేశారు. అప్పుడు ఒకేసారిగా.. తేనెచినుకులు (బాలగేయాలు) తేనె వాక్యాలు 1, 2 భాగాలు(గేయకథలు) రెల్లుపూలు (గేయాలు) ప్రచురించారు. ఈ సమయంలోనే విశాలాంధ్ర దినపత్రికలో పిల్లలకు తెలుగు పదపరిచయానికై పదంలో పదం..... అనే బొమ్మల నిఘంటువును ప్రచురించటం జరిగింది. వార్త దినపత్రికలో.. చిన్న పదాల....... పేరుతో తెలుగు పదజాలాన్నందించడానికి చిన్న చిన్న బాలగేయాలను ప్రచురించటం జరిగింది.
2013లో వార్త దినపత్రిక మొగ్గలో దాదాపు 8 ఏళ్లు పిల్లలకి, పెద్దలకి పనికివచ్చే అనేక విషయాలపై ప్రచురింపబడిన వ్యాసాల నుండి కొన్నింటిని పదాల పరిమళాలు పేరున పుస్తక ప్రచురణ చేయటం జరిగింది. 2016లో మరల ఒకేసారి బొమ్మల కొలువు (బాలగేయాలు) అమ్మపాట (లాలిపాటలు) నేనెవరిని (పొడుపుకథాగేయాలు) ప్రచురించారు.
''మొలక'' పిల్లల మాసపత్రికలో మనదైన పద్యం శీర్షికను (దాదాపు 3 ఏళ్లపైగా) నిర్వహిస్తున్నారు. 2017లో ఇంద్రధనస్సు పేరుతో బాలల విజ్ఞాన గేయాలను ప్రచురించారు. అందరికి ఉపయోగపడేలా 'పదసంపద' పేరుతో ఒక నిఘంటువును వాట్సాప్ గ్రూపులో నిర్వహించారు. దానిని పుస్తక రూపంలో తీసుకురానున్నారు. ఇంకా వీరు పిల్లల కోసం పద్యాలు వ్రాశారు. దాదాపు 15 కథలు రాశారు. అందరికీ పనికొచ్చే విధంగా భాషా సాహిత్యాలకు సంబంధించి దాదాపు వెయ్యి వ్యాసాలను రాశారు. వివిధ ప్రయివేటు పబ్లిషర్స్‌కి 1-8 తరగతుల వరకు తెలుగు వాచక రచన చేశారు. ఇలా బాలలకోసం ఎన్నో రచనలు చేస్తున్న రాజావాసిరెడ్డి మల్లీశ్వరిగారు ఎంఎలో .. బెస్ట్ లిరిక్ రచయిత్రిగా, బిఇడిలో ప్రొఫిషియన్సీ ఇన్ టీచింగ్ తెలుగు... ప్రశంసాపత్రాలను పొందారు.
బాలసాహితీరచనలకుగాను సంఘమిత్ర సంస్కృతిక సంఘం సేవాసంస్థ నుండి .. బాలబంధు బిరుదు పొందారు. బాలసాహితీపరిషత్ నుండి జ్ఞాపికనందుకున్నారు. చిలకలూరిపేటలోని రావూరి భరద్వాజ బాలల విజ్ఞాన పీఠం వారి నుండి రావూరి భరద్వాజ స్మారక ఉత్తమ గ్రంథ రచన అవార్డునందుకున్నారు. రంగినేని సుజాత మోహనరావు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహించిన కార్యశాలలో పాల్గొని ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2017లో కైత అనే కవితా సంపుటిని తెచ్చారు. లేఖా సాహిత్య ప్రక్రియలో వంద భావ కవితా లేఖలను రచించారు. విశాలాంధ్రలో ధారావాహికంగా 7 ఏళ్లు ప్రచురించిన వ్యాసాలలో కొన్నిటితో నవచేతన పబ్లిషింగ్ హౌస్ వారు 2015లోనే తెలుగు భాషగురించిన ఒక్కపదం. అర్థాలెన్నో అనే ఒక గ్రంథాన్ని ప్రచురించారు. బాలలకు తెలుగు పద్య ప్రక్రియపై అవగాహన కల్పించాలని చెబుతారు. ఇలా బాలసాహిత్యం, భాషా సాహిత్యాల గురించి నిరంతర సేవ చేస్తున్న అమ్మమ్మ



నిర్వహణ: పైడిమర్రి రామకృష్ణ
సెల్ : 9247564699


చెట్లపై ఒరంగుటాన్ల ఆవాసం



ఒరంగుటాన్ ఒక విధమైన క్షీరదం. హోమినిడే వర్గానికి చెందిన రెండు జాతుల కోతలను కలిపి ఒరంగుటాన్ అని వ్యవహరిస్తుంటారు. ఇవి ఎక్కువగా చెట్లపై నివసిస్తుంటాయి. చెట్లపై నివసించే జంతువులతో ఒరాంగుటాన్లే అత్యంత పెద్దవి. ఇతర కోతుల కంటే వీటికి పొడవాటి చేతులు ఉంటాయి. సాధారణంగా వీటి జుట్టు ఇతర పెద్ద కోతుల వెల ముదురు గోధుమ లేదా నలుపు రంగులలో కాకుండా ఎరుపు చాయలున్న ముదురు గోధుమ వర్ణంలో ఉంటుంది. ఇండోనేషియా, మలేషియాలకు స్థానికమైన ఒరంగుటాన్లు కేవలం బోర్నియా, సుమాత్రా ద్వీపాల్లోని ఊష్ణమండల అడవుల్లోనే కనపిస్తాయి. వీటి శిలాజాలు మాత్రం జావా, థాయ్‌మలయ్ ద్వీపకల్పం, వియత్నాం, చైనాలలో కూడా లభ్యమవుతున్నాయి.

మౌంట్ మౌంగనూయ్

హాయ్ ఫ్రెండ్స్.. ఈ రోజు మీకు ఒక మంచి విహార కేంద్రం విశేషాలు చెప్పాలనుకుంటున్నాను... సరేనా! మౌంట్ మౌంగనూయ్ అనే పర్యాటక నగరం ఒకటి ఉంది. 1910లో ఇది పూర్తి ఇసుక తిన్నెలతో నిండిపోయి ఉండేది. అయితే టౌరంగా జిల్లాలో ఉన్న ఈ కేంద్రాన్ని 1927లో అభివృద్ధి చేయడం ప్రారంభించి 1945 వరకు పూర్తిచేసారు. ప్రస్తుతం ఇది అత్యంత ఆనందాన్ని అందించే విహార క్షేత్రం..



సాధారణంగా వారంతపు సెలవురోజుల్లో ఎంతో సందడిగా ఉంటుంది. మనం ఇక్కడికి వెళ్లాలని ప్రణాళిక సిద్దం చేసుకుంటే మనకు వసతి కోసం మూడు నెలల ముందే చెప్పి పెట్టాలి. తిరుపతి, భద్రాచలం వద్ద ఎంత రద్దీగా ఉంటుందో ఇక్కడ వసతి గృహాలకు అంతకంటే ఎక్కువగా జనం ఉంటారు. పెద్ద కొండ చుట్టూ సముద్రం.. బీచ్ లు ఉంటాయి. కొండపై నుంచి ప్యారాచూట్‌లలో ఎగురుతూ వచ్చి సముద్ర తీరంలో ఉన్న బీచ్‌లలో వాలుతుంటారు. కొన్ని చోట్ల పక్కనే ఉన్న కొండలపైకి ఎక్కి సముద్రంలో దుముకుతూ ఆనందిస్తుంటారు. ఇలా కుటుంబసమేతంగా ఇక్కడివి వెళితే ప్రకృతిని చూస్తూ ఎంత సేపైనా ఆనందిస్తుండవచ్చు. దీనికి సమీపంలోని వేడినీళ్ళ సరస్సు కూడా ఉంటుంది. అంటే లోన గంధకం ఉండటం వల్ల నీరు వేగిగా ఉంటాయి. ఇక్కడ చలి విపరీతంగా ఉంటుంది కానీ నీరు మాత్రం పొగలు కక్కుతూ వేడివేడిగా ఉంటాయి. అంటే ఏమీలేని చోట అందమైన ప్రదేశాన్ని ఏర్పాటు చేసుకోవడం మనిషి సృష్టికి అద్దం పడుతుంది. మనోల్లాసం కోసం, మరువకుండా ఉండే ప్రదేశంగా ఇది మనలను ఎంతో ఆకట్టుకుంటుంది. ఆ అందాన్ని అక్షరాల్లో బంధించడం కష్టమే కానీ మీకు చెప్పాలనిపించింది.

- టి. వేదాంతసూరి


అంతరిక్షంలో కుక్క



సోవియట్ యూనియన్ మొట్టమొదటిసారిగా అంతరిక్షంలో ఒక కుక్కను 1956 నవంబర్ మూడో తేదీన తీసుకెళ్లింది. మాస్కో వీధుల్లో తిరిగే లైకా అనే కుక్కను అంతరిక్షంలోకి పంపడానికి సోవియట్ యూనియన్ పూనుకొంది. దురదృష్టవశాత్తు ఈ కుక్క అంతరిక్షంలోనే చనిపోయింది. అంతరిక్షంలో మనిషి అడుగు పెట్టకముందే 36 కుక్కలను అంతరిక్షంలోకి పంపింది. 1948 జూన్ 11 వతేదీన అంతరిక్షంలో మొదటిసారిగా ఓ కోతి వెళ్లింది.

పొడుపు క(వి)తలు

పుస్తకాల తోట



ఏమర్రా బుజ్జాయిలు. ఏమిటి కబుర్లు అందరూ బాగున్నారా?! బాగున్నాం ఈ వారం పుస్తకాల తోట కోసం ఎదురు చూస్తున్నామ్ అంటారా? మరింకెందుకు ఆలస్యం పదండిపోదాం మనకిష్టమైన పుస్తకాలవేటకు.
ఈ వారం మీకోసం మీకెంతో ఇష్టమైన పొడుపు కథలతో కూడిన కవితల సంపుటి గురించి తెలుసుకుందామే! దీనిని ఆవుల చక్రపాణియాదవ్ అన్నయ్య ఎంత బాగా రాసారో తెలుసా? మన మెదడుకు మేతపెట్టే పొడుపు కథలంటే మనకు మొదటి నుంచి ఇష్టం ఇవి చదువుతుంటే భలే గమ్మత్తుగా వుండటమేగాక ఎంతో ఆనందానుభూతి కలుగుతుంది.
మొత్తం 110 పొడుపు కథలు. నాలుగేసి లైన్లతో చక్కటి ప్రాసలతో ముచ్చటగా ఉంటాయి. ఇక ఇలా ఊరించడం దేనికిగాని మచ్చుకు మీరే చదవండి.
నాలుగుకాళ్లుంటాయి, నే కదలలేననోయి, ప్రత్యేక గది నాకోయి, ప్రత్యేక గది నాకోయి, మీ పాన్పు నా మీదోయి..? అంత్య ప్రాసతో ఉన్న ఈ కవితలోని పొడుపుకు విడుపు మీకు అర్థమైందా? మీ పాన్పు నా మీద అనగానే మీకు ఈ పాటికే అర్థమైపోయుంటుంది ''మంచం'' అని. ఇలా కేవలం వస్తువుల గురించేగాక వ్యక్తుల గురించి కూడా చక్కని పొడుపు కథలు ఇందులో మనం చదవవచ్చు. విడుపు తెలిసినదే అయినా దానిని మళ్లీ
మళ్లీ చదవాలి అనిపించడమే కాక. ఇలా మనకు తెలిసిన వాటిని కూడా ఇంత చక్కగా ఎలా వ్రాయవచ్చో అర్థమవుతుంది.
యుగోస్లేవియాలో జననం, కలకత్తాలో సేవానిలయం, మొక్కింపచేసే తల్లి విగ్రహం, ఆమె నోబెల్ ప్రైజ్ గ్రహీత..? అంటూ విశ్వమాత మదర్ థెరిస్సా గురించి ఎంత చక్కగా చెప్పారో చూసారా? ఇలా వస్తువులు. వ్యక్తులతో పాటు ఆధునిక ప్రాచీన చారిత్రక విషయాల గురించి. ఈ పొడుపు కథలు, కవితలు, భలే భలేగా సాగుతాయి.
ఇవి అన్నీ ఆసాంతం చదివాకా.. ఇంత బాగున్నాయే! అనిపించడంతో పాటు ఇలాంటివి. మేము సైతం వ్రాయగలం అనిపించడమే కాదు. కొద్దిగా ప్రయత్నిస్తే మీరు కూడా వ్రాయగలరు.
ఇంత ఉపయుక్తమైన పుస్తకంలోని పేజీలు మొత్తం 56. ధర యాభై రూపాయలు.
ప్రతులకు: ఆవుల చక్రపాణియాదవ్. ఇంటినెంబర్ 3-18, కన్నమడకల గ్రామం, ఓర్వకల్లు పోస్టుమండలం, కర్నూలు-518010, ఆంధ్రప్రదేశ్, సెల్: 9963350973

పరిచయకర్త: డాక్టర్ అమ్మిన

పకపక




టీచర్ ఫెయిల్

షీలా: నువ్వు ఎగ్జామ్‌లో పాస్ అయ్యావా?
మున్ని: మా మొత్తం క్లాస్ పాసయ్యింది. కానీ మా టీచర్ మాత్రం ఫెయిల్ అయ్యింది.
షీలా: అదెలా?
మున్ని: టీచర్ అదే క్లాసులో ఉండిపోయి ఇతర విద్యార్థులకు క్లాసులు తీసుకుంటుంది.



ముగ్గురం



మూడు చీమలు ఏనుగురావడాన్ని చూసి మాట్లాడుకుంటున్నాయ్.
మొదటిచీమ: మనం ఏనుగును చంపేద్దాం
రెండో చీమ: మనం ఏనుగు కాళ్లను విరగ్గొడదాం
మూడో చీమ: మర్చిపోండి గయ్స్, అదొక్కటే ఉంది మనం ముగ్గురం ఉన్నాం

విచ్చలవిడిగా

నరేష్ (పెట్రోల్ పంప్ దగ్గర): అరె అన్నా, కొంచెం ఒక రూపాయి పెట్రోల్ కొట్టు!
సేల్స్‌మెన్: అన్నా ఈ పెట్రోల్ పోసుకుని ఎక్కడికెళ్తావు?
నరేష్: ఎక్కడికి వెళ్లేదిలేదు. అప్పుడప్పుడు నేను ఇలా డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తుంటాను.



కేవలం నాలుగు గ్లాసులు

డాక్టర్: నువ్వు ప్రతిరోజు కనీసం 10 గ్లాసుల నీళ్లు త్రాగాలి
పేషెంట్ : ఇది సాధ్యం కాదు
డాక్టర్: ఎందుకు?
పేషెంట్ : మా ఇంట్లో కేవలం 4 గ్లాసులు మాత్రమే ఉన్నాయి.



ఐరన్ లేదు

రాము: నేను నిన్న చెక్ చేసుకున్నాను. నా శరీరంలో ఐరన్ ఏ మాత్రం లేదు.
సోము: ఎలా చెక్ చేసుకున్నావ్?
రాము: అయస్కాంతంతో చెక్ చేసుకున్నాను. అయస్కాంతాన్ని నా శరీరానికి అంటిస్తే అతుక్కోవడం లేదు



బంగారు పలుకు

నువ్వు నిరుపేదవని అనుకోవద్దు.
ధనం నిజమైన
శక్తికాదుమంచితనం పవిత్రతలే
నిజమైన శక్తి
- స్వామి వివేకానంద





ఎన్టీఆర్, రాజమౌళి, రామ్‌చరణ్

పోటా పోటీ పోలీసులు

ఎన్టీఆర్, రామ్ చరణ్‌లతో రాజమౌళి తన కొత్త చిత్రాన్ని రూపొందిస్తున్నారనే విషయం ప్రస్తుతం చిత్రరంగంలో మాట్లాడుకునే ఆసక్తికర అంశమవుతోంది. అంతా అనుకున్నట్లుగానే ఎన్టీఆర్, చరణ్‌తో రాజమౌళి సినిమాకు ఎలాంటి హడావుడీ లేకుండా సన్నాహాలు జరుగుతున్నాయి. ఎప్పటిలాగే ఈ చిత్రానికి విజయేంద్రప్రసాద్ కథను అందిస్తున్నారు. నిజాయితీగల శక్తివంతమైన ఇద్దరు పోలీసు అధికారుల పాత్రలతో ఈ కథ ఉండబోతోంది. సమాచారం ప్రకారం అక్టోబర్ నుంచి ఈ భారీ మల్టీస్టారర్ సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ చిత్ర నేపథ్యాన్ని చూస్తే...నవంబర్ 18న రాజమౌళి తన ట్విట్టర్‌లో ఎన్టీఆర్, రామ్ చరణ్‌లతో దిగిన ఓ ఫొటోను పోస్టు చేశాడు. ముగ్గురూ ఒక సోఫాలో కూర్చుని వాళ్లకున్న అనుబంధాన్ని చూపించేలా దిగిన ఛాయాచిత్రమది.

ఈ ఫొటో బయటకు చూశాక..రాజమౌళి కొత్త చిత్రం ఎన్టీఆర్, చరణ్‌లతో మల్టీస్టారర్‌గా ఉంటుందని అంతా నిర్ణయానికి వచ్చేశారు. అయితే ఆ తర్వాత ఈ ముగ్గురిలో ఎవరి దగ్గరనుంచి ప్రతిస్పందన రాలేదు. ఎన్టీఆర్, రామ్ చరణ్ ఇద్దరూ స్టార్ హీరోలే. చరణ్ కంటే ఎన్టీఆర్ పేరున్న కథానాయకుడు. అభినయంలో స్టార్‌డమ్‌లో మరో మెట్టుపై ఉంటారు. హిట్ చిత్రాలతో చరణ్ ప్రతిభావంతమైన కథానాయకుడిగా ప్రేక్షకుల మెప్పు పొందాడు. రెండు భిన్న ధృవాలు అనే విస్తృత అభిప్రాయమున్న వీళ్లిద్దరూ కలిసి తెరపైకి వస్తే నిజంగా ఓ గొప్ప సందర్భమే అవుతుంది.

నటించడం విసుగెత్తింది..!

తీరిక లేని సినిమా చిత్రీకరణలతో విసుగెత్తిపోయానంటోంది అందాల భామ శృతి హాసన్. ఇన్నేళ్ల తీరిక లేని నాయిక ప్రయాణంలో కాస్త విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నట్లు తెలిపింది. గాయనిగా స్థిరపడాలనే తన కోరికను నెరవేర్చుకునే ప్రయత్నాలు ప్రారంభిస్తానని చెప్పింది. నటించడంలో పడి తను జీవితంలో కోరుకున్నది చేయలేకపోతున్నానని....ఇకపై తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపింది. పెళ్లిపై విరక్తి లేదని...తన బంధాన్ని ఎలా కాపాడుకోవాలో తెలుసుంది. తాజాగా శృతి హాసన్ మాట్లాడుతూ...మూడు భాషల చిత్రాలతో తీరకి లేకుండా గడిపాను. ఈ హడావుడిలో నన్ను నేను తెలుసుకోవడమే మర్చిపోయాను. నా గురించి ఆలోచించుకునే సమయమే దొరకడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో నేనుంటే నా గురించి బయటవాళ్లు రకరకాల అభిప్రాయాలు చెప్పుకుంటున్నారు. కళాకారిణిగా ఒక స్థాయికి నేను సంతృప్తిపడలేను. నన్ను నేను నిత్యం కొత్తగా ఆవిష్కరించుకోవడం చాలా ముఖ్యమని భావిస్తా. ఈ ఏడాది గాయనిగా నేను పాడబోతున్న పాటలు వింటారు. నా పెళ్లి పుకార్లతో చిరాకు పుడుతోంది. అతని గురించి అందరికీ తెలుసు. నేను చెప్పినా ఉపయోగం లేదు. మా అమ్మా నాన్న వైవాహిక జీవితం నాపై ప్రభావం చూపించలేదు. వాళ్ల వల్ల నాకు పెళ్లిపై విరక్తి కలగలేదు. వాళ్ల జీవితం వాళ్లది. నా జీవితం నాది. నాకున్న బంధాలను ఎలా కాపాడుకోవాలి నాకు బాగా తెలుసు అని చెప్పింది.



శృతి హాసన్

24న ముహూర్తం!



నాని, నాగార్జున

తెలుగు సినీరంగంలో మళ్లీ మల్టీస్టారర్ సినిమాల నిర్మాణం జోరందుకుంది. ఇద్దరు స్టార్స్ కలిసి నటించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో పలు కాంబినేషన్ సినిమాలు మొదలుకానున్నాయి. వాటిలో నాగార్జున, నాని నటించే మల్టీస్టారర్ సినిమా కూడా ఉంది. ఇప్పటికే కథను ఇద్దరు హీరోలు ఓకే చేశారు. ఈ చిత్రానికి శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్నారు. సీనియర్ నిర్మాత సి.అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తారని తెలిసింది. ఇక పోతే మల్టీస్టారర్ ప్రారంభించేందుకు ముహూర్తం కుదిరింది. ఇదే నెల 24న షూటింగ్ ప్రారంభిస్తారు. వినోదాత్మక కథనంతో తెరకెక్కే ఈ చిత్రంలో నాగార్జున డాన్ పాత్రలో కనిపిస్తారు. నాని డాక్టర్ పాత్రని చేస్తారని తెలిసింది. ఇక ఈ సినిమాలో నటించబోయే హీరోయిన్ల పేర్లు ఇప్పటి వరకు సస్పెన్స్‌గా ఉంచారు.

నాగార్జున ప్రస్తుతం రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో నటిస్తున్నారు. నాని కృష్ణార్జున యుద్ధం చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.

లేడీ డిటెక్టివ్‌గా

సమాజంలో ప్రభావవంతమైన వ్యక్తుల స్ఫూర్తితో లేదా వారి నిజజీవిత సంఘటనల ఆధారంగా సినిమాలు రూపొందడం ఎప్పట్నుంచో చూస్తున్నదే. గతంలో ఐపీయస్ అధికారిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్న కిరణ్‌బేడి స్ఫూర్తితో కర్తవ్యం చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే. అందులో కథానాయికగా నటించిన విజయశాంతికి ఆ చిత్రంతో ఓ ప్రత్యేక ఇమేజ్ సొంతమైన విషయం గుర్తుండే ఉంటుంది. అలా చెప్పుకుంటూ పోతే ఇంకా ఎందరి స్ఫూర్తితో సినిమాలొచ్చాయి కూడా. తాజాగా త్రిష ఆ కోవలో ఓ సినిమా చేయబోతోంది. మహారాష్ట్రకు చెందిన తొలి బారతీయ లేడీ డిటెక్టివ్ రజినిపండిట్ స్ఫూర్తితో ఆమె తాజాగా ఓ చిత్రాన్ని చేయబోతోంది.



త్రిష

గత కొంతకాలంగా హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాల అవకాశాలు ఆమెకు వెల్లువెత్తుతున్నాయి. అనుష్క, నయనతారల తర్వాత అత్యధిక హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలు చేస్తున్న నటిగా ఆమెకు పేరొచ్చింది. ప్రస్తుతం మోహి ని, గర్జన, పరమపదం విళైయాడు వంటి హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలతో పాటు 96, చతురంగవేట్టై-2, 1818 తదితర అరడజనుకు పైగా సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి. అదే సమయంలో కుట్రపయిర్చి అనే పేరుతో రూపొందబోయే చిత్రంలో ఆమె ఇలా డికెట్టివ్ అవతారంలో కనిపిస్తారు. త్వరలోనే ఈ చిత్రం ప్రారంభం కానుంది. తమిళ సినీరంగంలో లేడీ డికెట్టివ్‌గా ఓ నటి నటించడం ఇదే తొలిసారి అని అంటున్నారు. శ్రీ గురుజ్యోతి ఫిలింస్ పతాకంపై జి.వివేకానందన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా నూతన దర్శకుడు వర్ణిక్ పరిచయం కానున్నారు. పూర్వాశ్రమంలో బాలా వద్ద తారైతప్పటైట అనే చిత్రానికి వర్ణిక్ సహాయ దర్శకుడిగా పనిచేశారు. 1980లో సాగే నేరపరిశోధన కథాచిత్రంగా ఇది ఉంటుందట. ఒక హత్య, దాని గురించి పరిశోధన ప్రధాన ఇతివృత్తంగా సాగుతుందని యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు దర్శకుడు తెలిపారు. ఇందులో త్రిషతో పాటు సురభి, సూపర్ సుబ్బరాయన్ ప్రధాన పాత్రల్లో నటించనున్నారని తెలిపారు.

దీనికి రథన్ సంగీతం, బాబుకుమార్ ఛాయాగ్రహణం అందించనున్నారు. ఇదిలావుండగా...త్రిష లోగడ తెలుగు సినిమాలతో మంచి గుర్తింపు సంపాదించుకున్నందువల్ల తమిళంలో ఆమె నటిస్తున్న కొన్ని చిత్రాలను తెలుగులో కూడా విడుదలచేసే అవకాశాలున్నాయి. లైన్, నాయక చిత్రాల తర్వాత తెలుగులో డైరెక్ట్ సినిమాలేవీ ఆమెకు లేకపోవడం గమనార్హం.



తాప్సీ

నవ్వించేలా సోడా గోలీసోడా

మానస్, నిత్య నరేష్, కారుణ్య హీరో హీరోయిన్‌లుగా నటించిన చిత్రం సోడా గోలీసోడా. ఎస్‌బీ క్రియేషన్స్ పతాకంపై భువనగిరి సత్య సింధూజ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చక్రసీద్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. మల్లూరి హరిబాబు దర్శకత్వం వహించారు. సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న సోడా గోలీసోడా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సత్య సింధూజ మాట్లాడుతూ...మా సినిమాకు సెన్సార్ క్లీన్ యూ సర్టిఫికెట్ ఇవ్వడం సంతోషంగా ఉంది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంటుంది. ప్రేక్షకులను నవ్వించే సినిమా చేయాలన్న ఉద్దేశంతోనే సోడా గోలీసోడా చిత్రాన్ని నిర్మించాము. అని చెప్పారు. హీరో మానస్ మాట్లాడుతూ....అనుభవమున్న హాస్య నటులు చాలా మంది ఈ చిత్రంలో ఉన్నారు. పూర్తిస్థాయి వినోదంతో ఉంటుంది. కుటుంబం అంతా సంతోషంగా చూసే సినిమా అవుతుంది. పాలకొల్లు, హైదరాబాద్‌లోని అందమైన లొకేషన్‌లలో సినిమాను చిత్రీకరించాం. సంగీతం ప్రధాన ఆకర్షణ అవుతుంది. చిత్ర బృందం సహకారం బాగుంటే మంచి చిత్రాల చేస్తామనేందుకు సోడా గోలీసోడా ఉదహారణగా చెప్పవచ్చు. అన్నారు. నాయిక నిత్యనరేష్, సహ నిర్మాత భువనగిరి శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.మానస్, కారుణ్య, బ్రహ్మానందం, అలీ, కృష్ణ భగవాన్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్ - నందమూరి హరి, సంగీతం - భరత్, సినిమాటోగ్రఫీ - ముజీర్ మాలిక్

మానస్, నిత్య నరేష్



స్నేహితుల కథతో...

సాలగ్రామ్ సినిమా పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం గున్న. విప్లవ్.కె. దర్శకత్వం వహిస్తున్నారు. నేపథ్యాన్ని, పాత్రల స్వభావాన్ని తెలిపేందుకు రూపొందించిన ప్రీ పోస్టర్‌ను, లోగోను సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు శుక్రవారం విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, లోగో డిజైన్ బావుంది. సినిమా చక్కటి విజయాన్ని అందుకుని చిత్రబృందానికి పేరు తీసుకుని రావాలని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ, పదహారేళ్ల వయసులా నిత్యనూతనంగా ఆలోచించే రాఘవేంద్రరావుగారి చేతులమీదుగా పోస్టర్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. పసి వయసుకు, యుక్త వయసుకు మధ్య గున్న ప్రాయంలో ఉన్న కొందరు స్నేహితుల కథతో తెరకెక్కనున్న చిత్రమిది. సినిమాకు సంబంధించి ప్రధాన పాత్రల ఎంపిక ఎనిమిది నెలలుగా జరుగుతోంది. సామ్రాట్, ప్రజ్ఞాత, నిఖిల్, ఆర్మాన్, మోహక్, ఐశ్వర్యలను ఎంపిక చేశాం. త్వరలో మిగిలిన ఇద్దరు ఆర్టిస్టులను ఎంపికచేసి, మార్చిలో షూటింగ్ ప్రారంభిస్తామని చెప్పారు.

కేవీస్వీ సమర్పిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: భరణి కె.ధరన్, ఎడిటింగ్: ధర్మేంద్ర కాకరాల, నిర్మాణ, నిర్వహణ: సి.హెచ్.వి.ఎస్.ఎన్.బాబ్జీ, నిర్మాణం: సాలగ్రామ్ సినిమా.



కెమెరా ముందు కష్టమే మరి

నటించే అన్ని పాత్రలకు తమ వ్యక్తిత్వానికి పోలిక ఉండాల్సిన అవసరం లేదంటోంది బాలీవుడ్ భామ తాప్సీ. దక్షిణాదిలో ఎక్కువగా పేరు తెచ్చుకున్న తాప్సీ....హిందీ తెరకు వెళ్లి అక్కడా విజయపరంపర కొనసాగిస్తోంది. గతేడాది నామ్ షబానా, ఆనందో బ్రహ్మ, జుద్వా 2 లాంటి మూడు వరుస విజయాలను అందుకుంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న చిత్రం దిల్ జుంగ్లీ విడుదలకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 16న దిల్ జుంగ్లీ తెరపైకి రోబోతోంది. ఈ చిత్రంలో తాప్సీ రొమాంటిక్ పాత్రలో నటిస్తోంది. ఈ పాత్రకు చాలా సన్నిహిత సన్నివేశాలు కథలో ఉంటాయట. ఈ విషయంపై తాప్సీని వివరాలు అడగ్గా......ఒక చిత్రంలో సంప్రదాయ నృత్యకారిణి పాత్రలో నటిస్తాను. మరో చిత్రంలో ఇంకో పాత్రలో కనిపిస్తాను. ఆ పాత్రలకు నా వ్యక్తిగతంగా ఎలాంటి సంబంధం లేదు. అలాగే దిల్ జుంగ్లీ చిత్రంలోని కొరొలీ నాయర్ క్యారెక్టర్‌కు నాతో ఎలాంటి పోలికలు లేవు. నేను ఆ పాత్ర అంత రొమాంటిక్ కాదు. ఈ పాత్రలో నటించడం నిజంగా ఇబ్బందిపడ్డాను. రొమాంటిక్ సన్నివేశాల్లో ధరించే దుస్తులు, మాట్లాడే మాటలు, స్పందించే విధానం ఇవన్నీ కెమెరా ముందు చేయాలంటే కష్టమనిపించింది. వినోదాత్మక రొమాంటిక్ కథతో దర్శకుడు అలేన్ శర్మ దిల్ జుంగ్లీ చిత్రాన్ని రూపొందించారు.